
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM



'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 1

SUNDAY Special | ఆదివారం 24-3-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సన్‌రైజర్స్ పరాజయం

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ 4 పరుగుల తేడాతో కోల్‌కతా చేతిలో ఓటమిపాలైంది. కోల్‌కతా 208 పరుగులు చేయగా, రైజర్స్ 204 పరుగులకే పరిమితమైంది.

- వివరాలు 12లో



గర్భిణులు- వ్యాక్సిన్లు

ప్రతీ మహిళా గర్భం ధరించినప్పటి నుంచి కొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. వాటిపై అవగాహన కలిగించే ప్రత్యేక కథనం..


- వివరాలు 11లో



త్వరలో వస్తా..

'ఏ జైలూ ఎక్కువ రోజులు బంధించలేదు. బయటికొచ్చి వాగ్దానాలను నెరవేరుస్తా' అని కేజ్రీవాల్ వీడియో సందేశమిచ్చారు.

- వివరాలు 6లో



విరాళాల్లేకుండా పార్టీలు మనలేవు

'విరాళాలు తీసుకోకుండా ఏ పార్టీ మనుగడ సాధించలేదు. సుప్రీంకోర్టు ఎలక్టోరల్ బాండ్లపై సూచనలిస్తే బాగుండేది' అని గడ్కరీ అన్నారు.

- వివరాలు 6లో



అమెరికాలో నరమాంస భక్షకుడు!

కాలిఫోర్నియాలో ఓ వ్యక్తి తెగిపోయిన మనిషి కాలు చేతబట్టుకుని తిరుగుతూ కలకలం రేపాడు. సదరు వీడియో వైరలైంది.

- వివరాలు 6లో



ఒకే ఒక్కరు..

100 మైళ్లు.. 60 గంటలు.. పరుగెత్తుతూనే ఉండాలి. ఈ మారథాన్‌లో పురుషులకు దీటుగా తొలిసారి ఓ అతివ గెలిచింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

కవిత ప్రధాన కుట్రదారు



ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో కల్వకుంట్ల కవిత ప్రధాన కుట్రదారు అని ఈడీ ఆరోపించింది. మరో ఐదు రోజులు ఆమె కస్టడీ పొడిగించాలని కోరుతూ రౌస్ అవెన్యూ కోర్టులో దరఖాస్తు సమర్పించిన ఈడీ.. అందులో పలు ఆరోపణలు చేసింది.

- వివరాలు 13లో

ధాన్యం లేదంటే డబ్బులు ఇవ్వాల్సిందే!



గతేడాది యాసంగిలో వచ్చిన ధాన్యాన్ని ముడిబియ్యంగా మిల్లింగ్ చేయలేమని రాష్ట్రంలోని మిల్లర్లంతా చేతులెత్తేయడంతో ఆగిపోయిన సీఎంఆర్ ప్రక్రియ ఇప్పుడు వారి మెడకే చుట్టుకుంది.

- వివరాలు 5లో

3 రోజులు మరింత ఎండలు



రాష్ట్రంలో రానున్న 3 రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. సగటున 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 3డిగ్రీల సెల్సియస్ మేర పెరుగుతాయని సూచించింది. రోజురోజుకూ ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని పేర్కొంది.

- వివరాలు 14లో


వోల్వో.. వద్దు



గరుడ ప్లస్ కేటగిరీ బస్సులు కనుమరుగు కానున్నాయి. ఒక్కో వోల్వో బస్సుకు నెలకు సగటున రూ.లక్షకు పైగా నిర్వహణ ఖర్చు వస్తోంది. పైగా చిన్న రిపేరుకూ 3–4 లక్షల వరకు బిల్లు వస్తుండటంతో వాటిని వదిలించుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది.

- వివరాలు 14లో

ఇదండీ సంగతి



ఇలా డబ్బులు వేయగానే మరుక్షణం నుండి మనమెలా చెబితే అలా చేస్తుంది..వెరీ సింపుల్!



పెద్దపల్లి జిల్లా కాకర్లపల్లెలో బీటలు వారిన వరిపొలం

'కరువు' సాగు!

రాష్ట్రవ్యాప్తంగా ఎండిపోతున్న పంటలు

ఇటు కాలువల కింద అందని సాగునీరు..

అటు భూగర్భ జలాలు అడుగంటి ఎండిపోతున్న బోర్లు

- నీళ్ల లేక, ఎండ తీవ్రత పెరిగి.. మాడిపోతున్న పంటలు
- ఇప్పటికే దాదాపు 10 లక్షల ఎకరాల్లో ఎండిన వరి.. మిగతా పంటలకూ దెబ్బ
- ఈ సీజన్‌లో గణనీయంగా తగ్గిన సాగు.. అందులోనూ 30 శాతం దాకా ఎండిపోయిన దుస్థితి
- పలుచోట్ల పంటలను తగలబెడుతున్న రైతులు.. మరికొన్ని చోట్ల పశువుల మేతకు వదిలేస్తున్న దుస్థితి
- ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించడంలో వ్యవసాయ శాఖ విఫలమైందనే విమర్శలు
- కనీసం రైతులకు భరోసా కల్పించే ప్రయత్నమూ లేదని మండిపాటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయి. కాలువల ద్వారా సాగునీటి సరఫరా అందడం లేదు. బోర్లు, బావుల్లో నీళ్లు అడుగంటిపోయాయి. దీనితో చాలాచోట్ల సాగునీటికి కొరత ఏర్పడింది. దీనితో ముఖ్యంగా వరి పంట దెబ్బతింటోంది. పొట్టదశకు వచ్చిన వరి ఎండిపోతుంటే రైతులు ఆందోళన పడుతున్నారు. ఎలాగోలా పంటను కాపాడుకోవడానికి ట్యాంకర్లతో నీటిని తెచ్చి పొలాల్లో పోస్తున్నారు. ఇలా చేయలేనివారు కన్నీటితో పంటలను అలాగే వదిలేస్తున్నారు. పశువుల మేతకు వినియోగిస్తున్నారు. కొందరు రైతులు ఎండిన పంటలకు ఆవేదనతో నిప్పు పెడుతున్నారు.

మూడో వంతు పంటలకు దెబ్బ

వర్షాభావంతో కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు నిండలేదు. దీనితో యాసంగి సీజన్‌లో ప్రాజెక్టుల నుంచి సాగుకు నీటిని విడుదల చేయలేదు. దీనికితోడు భూగర్భజలాలు పడిపోవడం మరింత కష్టం తెచ్చిపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. మిగతా పంటలనూ కలుపుకొంటే యాసంగిలో సాగుచేసిన పంటల్లో దాదాపు 30 శాతం మేర ఎండిపోయాయని పేర్కొంటున్నారు. దీనితో గ్రామాల్లో రైతులతోపాటు కూలీలకు కూడా పనులు లేకుండా పోయాయి. ఉపాధి హామీ పనులే జీవనాధారంగా మారాయి. ఇది కరువు పరిస్థితేనని వ్యవసాయశాఖ వర్గాలు అంటున్నాయి. కానీ మిగతా 2వ పేజీలో ▶



రైతు కష్టం.. మేకలకు మేత

ఆరుగాలం పండించిన పంట సాగునీరు లేక ఎండిపోతుండటంతో మేకలకు మేతగా వదిలేసిన వైనమిది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం నాచేపల్లికి చెందిన రైతు వెంకటేశ్వర్లు రెండెకరాల్లో వరి వేశాడు. పంట చేతికందే సమయంలో సాగునీరు అందక ఎండిపోయింది.



సిటీ హాలు వద్ద మృతులకు నివాళులర్పిస్తున్న చిన్నారి

మాస్కోలో మారణహోమం

- క్రాకస్ సిటీ హాల్‌లో జరిగిన కాల్పుల ఘటనలో 133కి చేరిన మృతుల సంఖ్య
- చావుబతుకుల్లో మరో 120 మంది..
- తమ పనేనన్న ఐసిస్.. ఉక్రెయిన్ హస్తం ఉందన్న రష్యా

రష్యా రాజధాని మాస్కోలోని క్రాకస్ సిటీ హాల్‌లో ముష్కరులు ఘోరకలి సృష్టించారు. శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న ఈ మారణ హోమంలో మృతుల సంఖ్య శనివారం నాటికి 133కి చేరుకుంది. 120 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రపంచ దేశాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. - 6లో

తుక్కుగూడ నుంచే శ్రీకారం

ఏప్రిల్ మొదటి వారంలో భారీ సభతో కాంగ్రెస్ ప్రచారం షురూ..

ఖర్గే, రాహుల్ హాజరయ్యే చాన్స్.. ఆ తర్వాత సీఎం రేవంత్ బస్సు యాత్ర?



సాక్షి, హైదరాబాద్: ఇప్పటివరకు కలిసివచ్చిన తుక్కుగూడ నుంచే కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించనుంది. ఏప్రిల్ మొదటి వారంలో రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడ వేదికగా భారీ బహిరంగ సభను నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరవుతారని సమాచారం. ఈ సభలోనే కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోను కూడా విడుదల చేస్తారని, మేనిఫెస్టో తెలుగు ప్రతులను ఆవిష్కరిస్తారని తెలుస్తోంది. కాగా, ఈ సభ నిర్వహణ కంటే ముందే పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలను నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ సభ అనంతరం సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి వెళ్లనున్నారు. ఆయన బస్సులో ప్రచార యాత్ర చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. అయితే, బస్సు యాత్ర చేయాలా? అలా వెళ్తే ఎంత మంది నేతలు వెళ్లాలి? లేదా ప్రతి ఉమ్మడి జిల్లాలో బహిరంగ సభలు పెట్టి కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేయాలా అన్న దానిపై పార్టీలో అంతర్గతంగా చర్చలు జరుగుతున్నాయి. దీనిపై నాలుగైదు రోజుల్లో స్పష్టత వస్తుందని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.



పద్మారావుగౌడ్ | కంచర్ల కృష్ణారెడ్డి | క్యామ మల్లేశ్

సికింద్రాబాద్ బరిలో 'పజ్జన్న'

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన కేసీఆర్

భువనగిరి నుంచి క్యామ మల్లేశ్, నల్లగొండ నుంచి కంచర్ల పోటీ

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ పార్లమెంటు స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ పేరును పార్టీ అధినేత కె. చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు. సుమారు వారంపాటు ఢిల్లీలో ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు కూడా శనివారం జరిగిన ఈ భేటీకి హాజరయ్యారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలతో చర్చించి అందరి అభిప్రాయం మేరకే పద్మారావు గౌడ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు బీఆర్‌ఎస్ మిగతా 2వ పేజీలో ▶

జీఎస్టీ కేసుల్లో నిర్బంధానికి సరైన కారణం ఉండాలి

- జీఎస్టీ చట్టంకింద విచక్షణారహితంగా అరెస్టులు సరికాదు
- జాతీయ పన్నుల సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్
- ప్రభుత్వాన్ని నడపడానికి పన్నులు అవసరం
- తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే



సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే

సాక్షి, హైదరాబాద్: జీఎస్టీ చట్టం కింద విచక్షణారహితంగా వ్యాపారులను అరెస్టులు చేయడం మంచిది కాదని, నిర్బంధానికి సరైన కారణాలు అధికారుల వద్ద ఉండాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అభిప్రాయపడ్డారు. అనుమానాలు ఉన్నాయన్న మిగతా 10వ పేజీలో ▶

షెల్ కంపెనీతో సీఎం రమేశ్ టోకరా..

- బోగస్ సబ్ కాంట్రాక్టుతో రూ.450 కోట్లు స్వాహా
- ఫోర్జరీ సంతకాలు, తప్పుడు జీపీఏతో ఘరానా మోసం
- ఉత్తరాఖండ్ వరకూ విస్తరించిన రిత్విక్ కంపెనీ అక్రమాలు
- బాధితులు సినీనటుడు వేణు, కేంద్ర మాజీమంత్రి కావూరి కుమారుడు భాస్కర్
- పీసీఎల్ కంపెనీ ఫిర్యాదుతో హైదరాబాద్‌లో కేసు నమోదు
- ఆధారాలిచ్చిన బాధితులు



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, ఆయన నమ్మిన బంటు.. ఆ పార్టీ మాజీ ఎంపీ, ప్రస్తుతం బీజేపీలో టీడీపీ కోటరీకి నాయకుడు సీఎం రమేశ్ అక్రమాల బాగోతం మరొకటి బయటపడింది. ఫోర్జరీ సంతకాలు చేసి షెల్ కంపెనీ ముసుగులో ఏకంగా రూ.450 కోట్లు కొట్టేసిన వ్యవహారం ఆధారాలతో సహా వెలుగుచూసింది. సీఎం రమేశ్, మిగతా 10వ పేజీలో ▶

'ట్యాపింగ్'లో మరో ఇద్దరు అదనపు ఎస్పీలు!

- ఎస్‌ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు టీమ్‌లో పనిచేసిన అధికారులను ప్రశ్నించిన సిట్
- కీలక సమాచారం సేకరించినట్టు చెప్తున్న అధికార వర్గాలు
- ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ఇద్దరు మాజీ ఓఎస్డీలు అమెరికాకు పరారీ
- వారి నివాసాలు సహా 10 ప్రాంతాల్లో సిట్ అధికారుల సోదాలు

- వివరాలు 5లో



తిరుపతన్న | భుజంగరావు

ఇసుక కొరత ఉండొద్దు

- గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక అవసరాలకు ఇసుక కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. స్థానిక అవసరాలకు సరిపడ ఇసుక రవాణాకు అనుమతించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. - 5లో

ప్రమాద సంకేతాల విస్మరణతోనే నష్టమా?

- కాళేశ్వరం బ్యారేజీలు దెబ్బతినడంపై నీటిపారుదల శాఖకు అయ్యర్ కమిటీ ప్రశ్న
- 2019 వానాకాలం తర్వాత బ్యారేజీలకు ప్రమాద సంకేతాలు
- ప్రారంభించిన వెంటనే రక్షణ ఏర్పాట్లు ఎందుకు కొట్టుకుపోయాయి?
- నాటి నుంచి గుర్తించిన లోపాలు, తీసుకున్న చర్యలను తెలపండి
- బ్యారేజీలను నిర్మించింది నీటి నిల్వకా? మళ్లింపు కోసమా?
- పలు కీలక అంశాలపై ప్రశ్నావళి ఇచ్చిన కమిటీ
- వాటికి సమాధానాలు సిద్ధం చేస్తున్న నీటి పారుదల శాఖ

5లో

'మత్తు' బంధం బహిర్గతం

- డ్రగ్స్ కుతంత్రం అంతా పచ్చ నేతలదే..
- పాత్రధారి సంధ్యా ఆక్వా ఎండీ కోటయ్య చౌదరి
- సూత్రధారులు నారా, దగ్గుబాటి కోటరీ
- వ్యాపార, వ్యక్తిగత బంధం అంతా వారితోనే
- ఆధారాలతో అడ్డంగా దొరకడంతో చంద్రబాబు బెంబేలు
- ఫ్లెక్సీ చూపిస్తూ వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారానికి టీడీపీ కుట్ర
- బెడిసికొట్టిన పన్నాగం.. బాబు, పురందేశ్వరి కుటుంబాల్లో తీవ్ర ఆందోళన
- బాలకృష్ణ చిన్నల్లుడు భరత్‌కు కోటయ్య చౌదరితో సాన్నిహిత్యం
- అలపాటి రాజాతోనూ చౌదరి ఆర్థిక బంధం బట్టబయలు



3లో

కిలో కాదు.. 2 కిలోలు కాదు.. ఏకంగా 25 వేల కిలోల డ్రై ఈస్ట్‌లో కలగలిసిన డ్రగ్స్ పట్టుబడిన వ్యవహారం చంద్రబాబు అండ్ గ్యాంగ్ వ్యాపార పునాదులను కదిలిస్తోంది. డ్రగ్స్ కంటైనర్ బ్రెజిల్ నుంచి నౌకలో బయలు దేరడం.. ఆ సమాచారం ఇంటర్‌పోల్ చెవిన పడటం.. వారు సీబీఐకి చేరవేయడం.. హుటాహుటిన సీబీఐ బృందం విశాఖ పోర్టుకు రావడం.. ఆ కంటైనర్‌ను గుర్తించి సోదాలు, పరీక్షలు చేయడం.. అందులో కొకైన్ తదితర డ్రగ్స్ ఉన్నట్లు స్పష్టం కావడం.. అంతా సస్పెన్స్, థ్రిల్లర్ సినిమాను తలపించింది. ఇంత భారీ పరిమాణంలో డ్రగ్స్ పట్టుబడిన ఈ వ్యవహారంలో అన్ని వేళ్లూ చంద్రబాబు, ఆయన బంధుగణంపైనే చూపిస్తుండటం ఏపీలో హాట్ టాపిక్‌గా మారింది.

రాష్ట్రంలో రాహుల్ ట్యాక్స్

ఒక చదరపు మీటర్‌కు ఇంత అని రేట్ పెట్టి వసూలు చేస్తున్నారు: కిషన్‌రెడ్డి

లిక్కర్ స్కాంపై కేసీఆర్ బహిరంగ చర్చకు రావాలని సవాల్



సాక్షి, హైదరాబాద్: ''కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మనుషులు హైదరాబాద్‌లో కూర్చుని ఆర్‌జీ (రాహుల్ గాంధీ) ట్యాక్స్ పేరుతో వసూళ్లు చేస్తున్నారు. ఒక చదరపు మీటర్‌కు ఇంత అని రేటు పెట్టి మరీ.. కంపెనీలు, బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు, కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నడిచేందుకు తెలంగాణ సొమ్ముపైనే ఆధారపడుతోంది. గతంలో తమిళనాడు, ఆ తర్వాత కర్ణాటకలో ఇలాంటి పరిస్థితి ఉండగా.. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ వసూళ్లకు అడ్డాగా మారింది..'' అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పాల్వాయి హరీశ్‌బాబు, నేతలతో కలసి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన వివిధ సెటిల్‌మెంట్లను రాహుల్‌గాంధీ మనుషులు మళ్లీ బయటికి తీస్తున్నారని.. ఢిల్లీ వెళ్లి మాట్లాడుకుని, ఆర్‌జీ ట్యాక్స్ చెల్లించి రావాలని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ భూలావాదేవీలు అంటూ గతంలో ఆరోపించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు వాటిపై దర్యాప్తు చేసే పరిస్థితి లేదన్నారు.

బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్..: 'హైదరాబాద్ చుట్టుపక్కల లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని అప్పనంగా మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

బీఆర్ఎస్‌కు మాజీ ఎమ్మెల్సీ చిన్నపరెడ్డి రాజీనామా



సాక్షి ప్రతినిధి నల్లగొండ: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి శనివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపించారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డిని ప్రకటించిన రోజే ఆయన రాజీనామా చేయడం గమనార్హం. రాజీనామా లేఖలో ఈనెల 18న రాజీనామా చేసినట్లు పేర్కొనగా, చిన్నపరెడ్డి ఈ రోజే రాజీనామా చేశారని, టైపింగ్ ఎర్రర్ వల్ల అలా వచ్చిందని ఆయన అనుచరులు పేర్కొన్నారు. నల్ల గొండ ఎంపీ అభ్యర్థిగా చిన్నపరెడ్డిని బరిలో నిల పాలని మొదట్లో బీఆర్ఎస్ భావించింది. అయితే ఆయన బీజేపీకి టచ్‌లోకి వెళ్లినట్లు ప్రచారం జరగడంతో చిన్నపరెడ్డి పేరును పక్కన పెట్టింది. కానీ తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, టికెట్ తనకే వస్తుందని చిన్నపరెడ్డి రెండ్రోజుల కిందట చెప్పారు. బీఆర్ఎస్ అధిష్టానం అనూహ్యంగా కంచర్ల కృష్ణారెడ్డి పేరును ప్రకటించింది. బీజేపీ అధిష్టానం హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పేరును ప్రకటించింది. 15 రోజులు గడవక ముందే ఆయన్ను మార్చి చిన్నపరెడ్డికి టికెట్ ఇస్తారన్న చర్చ కూడా సాగుతోంది. కంచర్ల కృష్ణారెడ్డికి నల్లగొండ ఎంపీ టికెట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ మండల స్థాయి నేతలు మూకుమ్మడిగా రాజీనామా చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

ప్రతిపక్షాలను ఉక్కిరిబిక్కిరి చేసేందుకు బీజేపీ యత్నం

టీపీసీసీ సీనియర్ నేత నిరంజన్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలు ఏకపక్షంగా జరిగేలా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కుట్ర పన్నుతోందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీలను టార్గెట్ చేస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతలను ఉక్కిరిబిక్కిరి చేసేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇదే విషయమై ఇండియా కూటమి నేతలు కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారని, దేశంలో ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి సూచించారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత దేశంలో పోలీసు వ్యవస్థ, పాలనా యంత్రాంగం ఎన్నికల కమిషన్ చేతుల్లో ఉంటాయని, లోక్‌సభ ఎన్నికల్లోపు సీబీఐ, ఈడీ, ఐటీ లాంటి సంస్థలు దాడులు చేసే సమయంలో ఈసీ అనుమతి తీసుకునేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని నిరంజన్ అన్నారు.

ముఖ్యమంత్రి అయితే మాకేంటి..

మాలలకు కొమ్ము కాస్తే ఒప్పుకునేది లేదు: మంద కృష్ణ మాదిగ



లక్డీకాపూల్: 'నువ్వు ముఖ్యమంత్రి అయితే కావచ్చు.. మాలలకు కొమ్ము కాస్తే ఎందుకు ఒప్పుకుంటాం'అని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. శనివారం ఆయన సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మాదిగలపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియోలను ప్రదర్శించారు. అనంతరం మాట్లాడుతూ, తనకు జవాబు ఇవ్వాల్సింది.. సంపత్ కుమార్ కాదని, ముఖ్యమంత్రే సమాధానం చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో మాదిగలకు అన్యాయం జరుగుతోందని ఇటీవల ప్రెస్‌మీట్‌లో చెప్పానని, దానికి తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తితో కౌంటర్ చెప్పించారని మండిపడ్డారు. 'సంపత్ మాట్లాడిన మాటలు ఆయన మనసులోంచి వచ్చిన మాటలు కాదు.. రేవంత్ రెడ్డి చిలుక పలుకులు ఆయన నోట వచ్చాయి'అని విమర్శించారు. తాను బీజేపీకి మద్దతు ఇస్తు న్నానని, మాదిగ జాతిని మోదీ కాళ్ల దగ్గర పెట్టించానని సంపత్ ఆరోపిస్తున్నారని, అయి తే మాదిగ జాతి ప్రయోజనాల కోసమే ప్రధా ని మోదీకి మద్దతు ఇస్తున్నానని స్పష్టం చేశా రు.కాగా, లోక్‌సభ ఎన్నికల్లో మూడు స్థానాలు మాదిగలకు ఇవ్వాలని మంద కృష్ణ డిమాండ్ చేశారు.

మందకృష్ణ వైఖరి సరికాదు: చెన్నయ్య



సాక్షి, హైదరాబాద్: ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇస్తూ.. సీట్ల కోసం కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో విమర్శించా రు. బీజేపీకి మద్దతు ఇచ్చినప్పుడు ఆ పార్టీనే సీట్లు అడగాలని సూచించారు. రాష్ట్రంలోని ఎస్సీ రిజర్వుడు సీట్ల కేటాయింపుల్లో మాల సామాజిక వర్గానికి ప్రాధాన్యమివ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ అభ్యర్థిగా మల్లు రవి పేరును ప్రకటించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

9-12 సీట్లలో గెలుపు మనదే

- ఫాంహౌస్‌లో కేటీఆర్, హరీశ్‌తో భేటీలో కేసీఆర్
- లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం



బహిరంగ సభలకు కేసీఆర్..
లోకసభ నియోజకవర్గాలవారీగా రెండు లేదా మూడు బహిరంగ సభలకు కేసీఆర్ హాజరు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో 9 నుంచి 12 స్థానాల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని పార్టీ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కేసీఆర్‌తో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమై కవిత అరెస్టు, ఢిల్లీ పరిణామాలను వివరించారు. దీంతో పార్టీపరంగా చేయాల్సిన న్యాయ, రాజకీయ పోరాటంపై కేసీఆర్ వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్, బీజేపీ ఎత్తుగడలపై చర్చించారు. పోటీ చేసే పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తయినందున అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. బీఆర్ఎస్ లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ అమలు చేస్తున్న ఎత్తుగడలను విశ్లేషించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం 12 నుంచి 14 స్థానాల్లో బీఆర్ఎస్ ప్రధాన ప్రత్యర్థిగా ఉంటుందని అంచనా వేసిన కేసీఆర్.. 9 నుంచి 12 స్థానాల్లో బీఆర్ఎస్‌కు గెలుపు అవకాశాలు ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. సామాజిక కోణంలో అభ్యర్థుల ఎంపిక సంతృప్తికరంగా ఉందని, ఈ పరిస్థితుల్లో పార్టీ యంత్రాంగం పకడ్బందీగా పనిచేసేలా ప్రణాళికలతో ముందుకు వెళితే విజయం సాధించవచ్చని నేతలు భావించినట్లు సమాచారం.

కావాలని ఈ భేటీలో నిర్ణయించారు. బస్సు యాత్ర సాధ్యాసాధ్యాలపై చర్చ జరిగింది. సభలు, సమావేశాల షెడ్యూల్, ఇన్‌చార్జిల నియామకంపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. మీడియా, సోషల్ మీడియా వ్యూహంపైనా పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యేలు, కీలక నేతలు పార్టీని వీడిన చోట ఇన్‌చార్జీలను నియమించాలని నిర్ణయించారు. పార్టీ సమన్వయ బాధ్యతలను కేటీఆర్, హరీశ్‌లకు అప్పగించారు. స్వయంగా వివిధ మీడియా మాధ్యమాల్లో కేసీఆర్‌తో ప్రత్యక్ష ప్రసారాలు ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్తగా ఎమ్మెల్సీ దండే విఠల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు.

రాబోయే కాలంలో ప్రాంతీయ పార్టీలదే హవా..

లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో కాంగ్రెస్ పని అయిపోతుందని.. కేంద్రంలో బీజేపీకి కూడా ఈసారి చివరి అవకాశం ఉండొచ్చని... భవిష్యత్తులో ప్రాంతీయ పార్టీలదే హవా అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభిప్రాయపడ్డారు. శనివారం ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో భేటీలో కేసీఆర్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్‌లో తన్నులాటలు మొదలయ్యాయని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని... కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇతరులు కూల్చే అవసరం లేదని, వాళ్లకు వాళ్లే కూల్చుకుంటారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నుంచి పోయేవాళ్లను పోనివ్వాలని.. బీఆర్ఎస్‌లో జెండా మోసిన వారికే ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఖైరతాబాద్ అసెంబ్లీ బాధ్యతలను మన్నె గోవర్ధన్ చూసుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమావేశంలో కేటీఆర్, ఎమ్మెల్యేలు తలసాని, మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, కాలేరు వెంకటేష్, నాయకులు దాసోజు శ్రవణ్, మన్నెగోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ మన్నె కవిత తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ బరిలో 'పజ్జన్న'

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటించింది. అలాగే నల్లగొండ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి పేరును గతంలోనే ఖరారు చేయగా తాజాగా మరోమారు కీలక నేతలతో కేసీఆర్ ఫోన్లో మాట్లాడారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికి కంచర్ల కృష్ణారెడ్డి సోదరుడు కావడం గమనార్హం. భువనగిరి స్థానం నుంచి కురుమ సామాజికవర్గానికి చెందిన క్యామ మల్లేశ్ యాదవ్ పేరును ఖరారు చేశారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితోపాటు జిట్టా బాలకృష్ణారెడ్డి, దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరుల పేర్లను పరిశీలించినా సామాజికవర్గ సమీకరణల్లో భాగంగా క్యామ మల్లేశ్ అభ్యర్థిత్వం వైపు కేసీఆర్ మొగ్గు చూపారు. మొత్తంగా 17 ఎంపీ సీట్లకుగాను తాజాగా ప్రకటించిన ముగ్గురు పేర్లతో బీఆర్ఎస్ 16 సీట్లకు అభ్యర్థులను ప్రకటించినట్లయింది. హైదరాబాద్ లోకసభ స్థానం నుంచి కూడా బలమైన అభ్యర్థిని బరిలోకి దింపుతామని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఒకట్రెండు రోజుల్లో హైదరాబాద్ నుంచి పోటీ చేసే అభ్యర్థి ఎవరనే అంశంపై స్పష్టత రానుంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థానానికి జరిగే ఉప ఎన్నిక అభ్యర్థి పేరును కూడా వీలైనంత త్వరగా ప్రకటిస్తామని కేసీఆర్ వెల్లడించినట్లు సమాచారం. కాగా, భువనగిరి నుంచి తనను అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ క్యామ మల్లేశ్ యాదవ్ శనివారం కేసీఆర్‌ను కలిశారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం ఈ భేటీలో పాల్గొన్నారు.

ఎంపీగా పోటీకి విముఖత చూపినా బుజ్జగించి..

బీఆర్ఎస్ సీనియర్ నేతగా, తెలంగాణ ఉద్యమ కాలం నుంచి నేటి వరకు పార్టీకి విధేయుడుగా ఉన్న పద్మారావుగౌడ్ అందరివాడిగా గుర్తింపు తెచ్చుకున్నందునే ఆయన పేరును ఖరారు చేసినట్లు కేసీఆర్ ప్రకటించారు. సికింద్రాబాద్ అభివృద్ధికి చేసిన కృషి, స్థానిక నేతగా 'పజ్జన్న'గా ఆదరాభిమానాలు పొందిన పద్మారావు గౌడ్ సరైన అభ్యర్థిగా సమావేశం ఏకగ్రీవంగా అంగీకరించినట్లు బీఆర్ఎస్ వెల్లడించింది. రెండురోజుల క్రితం పద్మారావు అభ్యర్థిత్వం తెరపైకి రాగా పోటీకి ఆయన విముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే పద్మారావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఎర్రవెల్లి ఫాంహౌస్‌కు పిలిచి మరీ బుజ్జగించినట్లు సమాచారం.

జాబితాలో బీసీలకు ప్రాధాన్యత

ఇప్పటి వరకు ప్రకటించిన 16 లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్ బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ అభ్యర్థులను ఖరారు చేసింది. సామాజికవర్గాలవారీగా రెడ్లకు 4, మున్నూరు కాపు 2, మాదిగలకు 2, కమ్మ, వెలమ, ముదిరాజ్, గౌడ, కురుమ, లంబాడా, గోండులకు ఒక్కో సీటు చొప్పున కేటాయించింది. హైదరాబాద్ నుంచి కూడా బీసీ అభ్యర్థినే రంగంలోకి దింపే అవకాశం ఉంది. దీంతో జనరల్ స్థానాల్లో సగం చోట్ల బీసీ అభ్యర్థులే పోటీ చేయనున్నట్లు కానుంది. బీఆర్ఎస్‌కు ప్రస్తుతం లోక్‌సభలో తొమ్మిది మంది ఎంపీలు ఉండగా వారిలో సిట్టింగ్ ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, మాలోత్ కవిత, మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాత్రమే పోటీ చేస్తున్నారు. మరో ఐదుగురు ఎంపీలు కాంగ్రెస్, బీజేపీలలో చేరారు.

తండాల స్థాయి నుంచి కార్యాచరణ

- పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సభలు నిర్వహించండి
- రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో మున్షీని సన్మానిస్తున్న బెల్లయ్యనాయక్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం గిరిజన నేతలు కృషి చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ కోరారు. తండాల స్థాయి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన ఆదివాసీ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. లోక్‌సభ అభ్యర్థులతో గిరిజన విభాగం సమన్వయం చేసుకోవాలని, ప్రతి అసెంబ్లీ స్థాయిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని, పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా భారీ సభలను గిరిజనులతో ఏర్పాటు చేయాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహుల్‌గాంధీని ప్రధాని చేయడంలో గిరిజనులు ప్రధాన భూమిక పోషించాలన్నారు. ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్యనాయక్ మాట్లాడుతూ...అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన విధంగానే రాష్ట్రంలో 13–14 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర వైస్ చైర్మన్ రఘు నాయక్, కోఆర్డినేటర్లు గణేశ్ నాయక్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్ సమయం ఇవ్వడం లేదు: వీహెచ్

కార్యకర్తలు కోర్టు కేసుల చుట్టూ ఎన్ని రోజులు తిరగాలి?



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించుకోవాలని చాలాసార్లు ప్రయత్నించానని, కానీ ఆయన సమయం ఇవ్వడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టిన వాళ్లకు సీఎం న్యాయం చేస్తున్నారని, పైసలు సంపాదించినోళ్లను పార్టీలో చేర్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...కాంగ్రెస్ కార్యకర్తలెవరికీ అన్యాయం చేయవద్దన్నారు. గతంలో తనతో సహా చాలామందిపై కేసులు పెట్టారని, ఆ కేసుల కోసం కాంగ్రెస్ కార్యకర్తలు కోర్టుల చుట్టూ ఎన్ని రోజులు తిరగాలని ప్రశ్నించారు. ఎవరైనా పార్టీలో చేరానులకుంటే వారే సీఎం వద్దకు రావాలని, సీఎం స్వయంగా వెళ్లి వారిని ఆహ్వానించి స్థాయిని తగ్గించుకోవద్దని సూచించారు.

డీకే అరుణ సోయి లేకుండా మాట్లాడుతున్నారు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తనపై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ వ్యక్తిగతంగా, సోయిలేకుండా మాట్లాడటం తగదని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేవలం కుటుంబ సభ్యుల వ్యాపారాలు, స్వలాభం కోసమే ఆమె రాజకీయాలు నడుపుతున్నారని ఆరోపించారు. 2014లో కల్వకుర్తి ఎమ్మెల్యేగా తనను ఓడించేందుకు ఎన్నో కుట్రలు పన్నారని, అయినా అక్కడి ప్రజల ఆదరాభిమానాలతో గెలుపొందానని పేర్కొన్నారు. 2006 నుంచే ఏఐసీసీ సభ్యుడిగా ఉన్నానని, ఆమెకు 2014 వరకు కాంగ్రెస్‌లో సభ్యత్వమే లేదన్నారు. ఎన్నో పార్టీలు మారిన డీకే అరుణ బీసీ ద్రోహి అని విమర్శించారు. తాను నాన్‌–లోకల్ కాదని ఉమ్మడి పాలమూరు బిడ్డనని వంశీచంద్‌రెడ్డి చెప్పారు. అప్పట్లో పాన్‌గల్ జెడ్పీటీసీ సభ్యురాలిగా కాంగ్రెస్ నుంచి డీకే అరుణ గెలుపొందినప్పుడు ఆమెకు ఈ విషయం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. కేవలం కాంట్రాక్టులు, లిక్కర్ దందాలు, ధనార్జన కోసమే రాజకీయాల్లో ఉన్న ఆమె బండారం బయటపెడతామన్నారు. ఈ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి ఓడిపోతాననే అక్కసుతో ఎలాంటి సోయి లేకుండా మాట్లాడుతున్నారని చెప్పారు. కనీసం తన పుట్టిన ఊరు ధన్వాడ మండలానికి గానీ, నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతలకుగానీ అరుణ ఏమీ చేయలేకపోయారని, రాజకీయ విలువలు లేని ఆమె తీరుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఈ ప్రాంత సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు.

మాదిగలకు రెండు స్థానాలివ్వాలి



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ, అసెంబ్లీ ఉప ఎన్నికల్లో మాదిగలకు రెండు స్థానాలు కేటాయించాలని తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట వేదిక రాష్ట్ర చైర్మన్ వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి శనివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర జనాభాలో 60 లక్షల మందికి పైగా మాదిగలున్నారని, 12 శాతం మంది ఉన్న మాదిగలకు జనాభా దామాషా ప్రకారం వరంగల్ ఎంపీ, కంటోన్మెంట్ ఎమ్మెల్యే సీట్లలో పోటీచేసే అవకాశం కల్పించాలని కోరారు.

అన్ని వర్గాలను కలుపుకొంటూ ముందుకు సాగాలి

బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కేకే



సాక్షి, హైదరాబాద్: అన్ని సామాజికవర్గాలను కలుపుకొంటూ పార్టీ నేతలు ముందుకు సాగాలని బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్, పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు అన్నారు. బీఎస్పీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేశవరావు మాట్లాడారు. యువత కూడా తమ లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వారికి అహంకారం పెరిగిందని మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. బహుజన నాయకత్వాన్ని పెంపొందించే విధంగా కేసీఆర్ అందరికీ అవకాశాలు కల్పించారని, అయితే కేసీఆర్ వ్యక్తిత్వాన్ని కొంత మంది తక్కువ చేసి మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

గేట్లు తెరిస్తే గొర్రెలు చేరాయి...

కాంగ్రెస్ పార్టీ గేట్లు తెరిస్తే గొర్రెలు చేరాయని, బీఆర్ఎస్ పార్టీ గేట్లు తెరిస్తే సింహాలు వచ్చాయని నాగర్‌కర్నూలు బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. నిజమైన తెలంగాణ వాదులు బీఆర్ఎస్‌లో ఉంటే తెలంగాణను మోసం చేసిన వారు, ఆస్తులు సంపాదించుకున్నవారు కాంగ్రెస్‌లో ఉన్నారని ఆరోపించారు. దేశ రాజకీయాలను శాసించే కార్యక్రమం తెలంగాణ భవన్‌లో జరుగుతోందన్నారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ ఉందని, సీబీఐ, ఈడీ తదితర సంస్థలు కేంద్ర ప్రభుత్వ అధీనంలో పనిచేస్తున్నాయని ఆరోపించారు.

మేమంతా సిద్ధం..

27 నుంచి ఏపీ సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర... పోస్టర్ల ఆవిష్కరణ



మేమంతా సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి, రోజా తదితరులు

సాక్షి, తిరుపతి: ఎన్నికలకు 'మేమంతా సిద్ధం' అంటూ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రకటించారు. తిరుపతిలో శనివారం రీజనల్ కో ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, భరత్, ఎంపీ గురుమూర్తి, రెడ్డెప్ప, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్ రెడ్డి, వెంకటేగౌడ్, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, నియోజకవర్గ సమన్వయకర్తలు విజాయనందరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, తదితరులు..మేమంతా సిద్ధం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సిద్ధం పేరుతో ఇప్పటికే రాష్ట్రంలో నాలుగు చోట్ల భారీగా సభలు నిర్వహించామని, ఆ నాలుగు ప్రాంతాలు మినహా మిగిలిన 21 జిల్లాలో మేమంతా సిద్ధం సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 27 నుంచి సీఎం జగన్ బస్సు యాత్ర ప్రారంభమవుతుందని.. అదే రోజు ప్రొద్దుటూరులో, 28న నంద్యాలలో, 29న ఎమ్మిగనూరులో సభలుంటాయని చెప్పారు. వచ్చే నెల 2న పీలేరు, 3, 4 తేదీల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాలో సిద్ధం సభలు జరుగుతాయని వెల్లడించారు.

'కరువు' సాగు!



పెద్దపల్లి జిల్లా కాకర్లపల్లెలో ఎండిన పొలాన్ని చూపిస్తూ బాధపడుతున్న రైతు



మెదక్ జిల్లా నార్సింగి మండలం నర్సంపల్లిలో ఎండిపోయిన వరి పంటను గొర్రెల మేతకు పెట్టిన రైతు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం మాత్రం దీనిని కరువుగా భావించడం లేదని పేర్కొంటున్నాయి.

అడుగంటిన భూగర్భ జలాలు..

గత ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్రంలో భూగర్భ జలాలు సగటున 7.34 మీటర్ల లోతులో ఉండగా.. ఈసారి ఫిబ్రవరి నాటికి 8.70 మీటర్ల లోతుకు పడిపోయాయి. కామారెడ్డి జిల్లాలో 10.64 మీటర్ల లోతు నుంచి.. ఈసారి 12.92 మీటర్ల లోతుకు తగ్గిపోయాయి. ఖమ్మం జిల్లాలో 5.11 మీటర్ల నుంచి 6.22 మీటర్ల లోతుకు.. మేడ్చల్ జిల్లాలో 8.97 మీటర్ల నుంచి 11.45 మీటర్ల లోతుకు.. నాగర్‌కర్నూల్ జిల్లాలో 6.57 మీటర్ల నుంచి 9.52 మీటర్ల లోతుకు పడిపోయాయి. మహబూబ్‌నగర్, నల్లగొండ, వికారాబాద్ జిల్లాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 6.93 మీటర్ల నుంచి ఏకంగా 10.19 మీటర్ల లోతుకు.. నల్లగొండ జిల్లాలో 6.15 మీటర్ల నుంచి 10.86 మీటర్ల లోతుకు.. వికారాబాద్ జిల్లాలో 13.07 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి.

తగ్గిన పంటల సాగు విస్తీర్ణం

సాగు నీటి వసతులు తగ్గడంతో గతేడాదితో పోలిస్తే ఈసారి యాసంగి సీజన్‌లో రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గత యాసంగిలో 72.58 లక్షల ఎకరాల్లో పంటలు వేయగా.. ఈసారి 66.30 లక్షల ఎకరాలకే పరిమితమయ్యాయి. సుమారు 6.28 లక్షల ఎకరాలు తగ్గినట్లు వ్యవసాయశాఖ తేల్చి, ప్రభుత్వానికి నివేదిక కూడా అందజేసింది. గత యాసంగిలో 56.44 లక్షల ఎకరాల్లో వరి సాగైతే.. ఈసారి 50.69 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంటే 5.75 లక్షల ఎకరాల సాగు తగ్గింది. పప్పుధాన్యాల సాగు గత యాసంగిలో 4.33 లక్షల ఎకరాలు అయితే.. ఇప్పుడు 3.18 లక్షల ఎకరాలకు తగ్గింది.

ప్రత్యామ్నాయ ప్రణాళిక ఏది?

ఒకవైపు పంటల సాగు విస్తీర్ణం తగ్గడం, మరోవైపు వేసిన పంటలు ఎండిపోతుండటం ఆందోళనకరంగా మారింది. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా వ్యవసాయశాఖ స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంటలు ఎండిపోతుంటే ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయడంలో వ్యవసాయ శాఖ విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి. కనీసం తమకు భరోసా కల్పించే ప్రయత్నాలైనా చేయడం లేదని రైతులు మండిపడుతున్నారు. పంట నష్టంపై సర్వే చేయడంలోనూ నిర్లక్ష్యం వహిస్తోందని.. సర్వే చేసి కరువు తీవ్రతను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తే.. పరిహారమో, సాయమో అందే పరిస్థితి ఉండేదని వాపోతున్నారు.

పంట పశువుల మేతకు వదలాల్సి వచ్చింది

నాకు ఊరు చెరువు వెనకాల రెండెకరాల పొలం ఉంది. యాసంగిలో వరి సాగు చేసేందుకు చెరువు నుంచి నీరు వదలడం లేదు. దీనితో జనవరిలో పొలంలో బోరు వేయించాను. నీరు బాగానే పడటంతో నా రెండెకరాలకు తోడు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశా. కానీ నెలన్నర రోజుల్లో బోరు ఎండిపోయింది. పంటను దక్కించుకునేందుకు 400 అడుగుల లోతుతో మరో బోరు వేయించా. అందులోనూ నీరు అడుగంటింది. దీనితో మరో రెండు బోర్లు వేయించినా ఫలితం లేకపోయింది. పొలం ఎండిపోవడంతో పశువుల మేతకు వదిలిపెట్టా. నాలుగు బోర్లు, పంట పెట్టుబడికి ఏడు లక్షలదాకా అప్పులు అయ్యాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– చిన్నయ్య, రైతు, గాధిర్యాల్ గ్రామం, మహమ్మదాబాద్, మహబూబ్‌నగర్ జిల్లా

ప్రభుత్వం ఆదుకోవాలి

నందిగామ బ్రాంచి కెనాల్ కింద రెండెకరాల వరి వేశా. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో సాగునీరు అందక ఎండిపోయింది. మునుపెన్నడూ లేనంతగా నష్టపోయాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మల్లెబోయిన సైదులు, రైతు, భైరవనిపల్లి గ్రామం, నేలకొండపల్లి మండలం, ఖమ్మం జిల్లా

నాలుగెకరాల పంటంతా ఎండి పోయింది

నాకున్న నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి అయింది. ఉన్న ఒక్క బోరులో నీళ్లు అడుగంటాయి. నీళ్లు సరిపోక పంటంతా ఎండిపోయింది. ఎస్సారెస్పీ నీళ్లు కూడా వచ్చే పరిస్థితి లేక పంటను వదిలివేసిన.

– ధరావతు సోమాని, రైతు, పాశ్యానాయక్ తండ, చివ్వెంల మండలం, సూర్యాపేట జిల్లా

రెండు బోర్లూ అడుగంటాయి

రెండున్నర ఎకరాల భూమిలో వరి వేశాను. ఉన్న రెండు బోర్లలో నీళ్లు అడుగంటాయి. 15 రోజులైతే పంట చేతికి వస్తుందనుకున్న సమయంలో పొలం ఎండిపోయింది. పంటకు పెట్టిన రూ.50 వేలు పెట్టుబడి నష్టపోయాను.

– దొంతినేని జగన్‌రావు, వెంకటాద్రిపాలెం, తిప్పర్తి మండలం, నల్లగొండ జిల్లా

మూడు జిల్లాల్లో 'సాగు' గోస

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో యాసంగి కింద ప్రధానంగా వరి, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, ఇతర పంటలు సాగు చేశారు. మొత్తం 7,25,345 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వరి 4,71,047 ఎకరాల్లో సాగైనట్లు అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. కానీ సాగు నీరు అందక, బోర్లు వట్టిపోవడంతో ఇప్పటివరకు సుమారు 88,752 ఎకరాల్లో వరి, 2,605 ఎకరాల్లో వేరుశనగ, మొక్కజొన్న పంటలు ఎండిపోయినట్టు ప్రాథమిక అంచనా.
- ఖమ్మం జిల్లాలో గత నాలుగేళ్లుగా యాసంగిలో మూడు లక్షల ఎకరాలకుపైగా పంటలు సాగవుతున్నాయి. నాగార్జునసాగర్ జలాలు అందుబాటులో ఉండటంతోపాటు బోర్లు, బావులు, చెరువుల కింద సాగు కొనసాగింది. కానీ ఈసారి కృష్ణా పరీవాహకంలో వర్షాభావంతో సాగర్ నిండలేదు. పంటల సాగుకు జలాలు విడుదల కాలేదు. దీనితో వరి, ఇతర పంటల సాగు తగ్గింది. చాలా మంది చెరువులు, బోర్లపై ఆధారపడి పంటలు వేశారు. దీంతో ఈ ఏడాది సాగు 1,47,389 ఎకరాలకే పరిమితమైంది. ఇందులో వరి 80,025 ఎకరాల్లో, మొక్కజొన్న 57,342 ఎకరాల్లో వేశారు. సాగైన చోట కూడా పంటలు ఎండిపోతున్నాయి.
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని మండలాల్లో పంటలు ఎండిపోతున్నాయి. నాగార్జునసాగర్, ఏఎమ్మార్పీ కాల్వల కింద ఏడాది నుంచి సాగునీరు అందలేదు. భూగర్భ జలాలు అడుగంటడంతో వందల సంఖ్యలో బోర్లలో నీరు రావడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు లక్ష ఎకరాల్లో వరి ఎండిపోయినట్టు అంచనా. పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా యాతనా పడుతున్నా ప్రయోజనం ఉండటం లేదు. కొన్ని గ్రామాల్లో చేసేదేమీ లేక పొలాలను పశువుల మేతకు వదిలేస్తున్నారు.

క్లుప్తంగా...

కొత్త జడ్జీల ప్రమాణం వచ్చే వారం..

జస్టిస్ సుజోయ్ పాల్ 26న, జస్టిస్ మౌషుమి భట్టాచార్య 28న




సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టుకు కొత్తగా నియమితులైన న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం ఖరారైంది. జస్టిస్ సుజోయ్ పాల్ ఈ నెల 26న, జస్టిస్ మౌషుమి భట్టాచార్య 28వ తేదీన.. మొదటి కోర్టు హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తుల సమక్షంలో బాధ్యతలు చేపట్టనున్నారు. కలకత్తా హైకోర్టు నుంచి జస్టిస్ మౌషుమి భట్టాచార్య, మధ్యప్రదేశ్ హైకోర్టు నుంచి జస్టిస్ సుజోయ్ పాల్‌ను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

'టెట్-2024' ఫీజు తగ్గించండి

మాజీ విప్ బాల్క సుమన్ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: త్వరలో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష 'టెట్-2024'ఫీజును తగ్గించడంతో పాటు 33 జిల్లా కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ మాజీ విప్ బాల్కసుమన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శనివారం లేఖ రాశారు. గత ప్రభుత్వం టెట్ రాసే విద్యార్థులకు ఒక పేపర్‌కు రూ.200, రెండు పేపర్లకు రూ.300 మాత్రమే వసూలు చేసిందన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఈ ఫీజును ఒక పేపర్‌కు రూ.వేయి, రెండు పేపర్లకు రూ.2వేలు చొప్పున పెంచడం నిరుపేద, మధ్యతరగతి వర్గాలపై పెనుభారం వేయడమేనన్నారు.

ఎస్సీ, ఎస్టీ గురుకులాల బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీల పరిధిలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ)ల్లోని 9వ తరగతి బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీల కార్యదర్శి కె.సీతాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు అర్హత పరీక్ష ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఏప్రిల్ 1 నుంచి టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ శిక్షణ

ట్రైనింగ్ అడిషనల్ డీజీ అభిలాషబిస్త్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్ : ఇటీవల ఎంపికైన 4,250 మంది టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఏప్రిల్ 1 నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్టు ట్రైనింగ్ అడిషనల్ డీజీ అభిలాషబిస్త్ వెల్లడించారు. ఇప్పటికే ఫేజ్-1లో సివిల్, ఏఆర్, ఐటీ కమ్యూనికేషన్ కానిస్టేబుళ్లకు ఫిబ్రవరి 10 నుంచి మొదటిదశ శిక్షణ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. టీఎస్ఎస్పీకి ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులు వారికి కేటాయించిన బెటాలియన్ శిక్షణ కేంద్రాల్లో రిపోర్ట్ చేయాలని అభిలాషబిస్త్ శనివారం ఓ ప్రకటనలో సూచించారు. ఏయే బెటాలియన్‌లో ఎప్పుడు రిపోర్ట్ చేయాలన్న వివరాలను వెబ్‌సైట్‌లో శనివారం అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు పూర్తి వివరాలకు టీఎస్ఎస్పీ అధికారిక వెబ్‌సైట్ http://tssp.telangana.gov.in/లో చూడవచ్చని సూచించారు.

విశాఖ డ్రగ్స్ కేసులో పురందేశ్వరి కుమారుడు

- ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్



నల్లగొండ: ఏపీలో 25 వేల కేజీల డ్రగ్స్ కేసు జరిగిందని, అందులో పురందేశ్వరి కుమారుడు కూడా ఉన్నాడని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ ఆరోపించారు. తాను పవన్ కళ్యాణ్ లా ప్యాకేజీ స్టార్‌ను కాదని, తప్పు చేసిన ఎవర్నీ వదలనని పేర్కొన్నారు. శనివారం నల్లగొండలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టులో ఎన్నో అక్రమాలు జరిగాయని, దాని ఎంక్వయిరీ జరగకుండా వేయి కోట్లతో డీల్ చేసుకున్నారని అ న్నారు. తాను గతంలో బీఆర్ఎస్, బీజేపీలను శపించానని, అవి భూస్థాపితం అయిపోయాయని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, లేకపో తే కాంగ్రెస్ పార్టీకూడా భూ స్థాపితం అవుతుందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదని, వంద రోజులు దాటినా వంద రూపాయల పనికూడా కాలేదంటూ విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీని ఆశీర్వదించాలని, వరంగల్‌లో బాబూమోహన్‌ను గెలిపించాలని కోరారు.

'మత్తు' బంధం బహిర్గతం

- డ్రగ్స్ కుతంత్రం అంతా పచ్చ నేతలదే
- పాత్రధారి సంధ్యా ఆక్వా ఎండీ కోటయ్య చౌదరి
- సూత్రధారులు నారా, దగ్గుబాటి కోటరీ

సాక్షి, అమరావతి: విశాఖ డ్రగ్స్ దందాలో అడ్డంగా దొరికిన చంద్రబాబు-దగ్గుబాటి కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. బ్రెజిల్ నుంచి డ్రగ్స్ దిగుమతి చేయించిన సంధ్యా ఆక్వా కంపెనీ కూనం కోటయ్య చౌదరి వెనుక ఉన్నది తమ కోటరీయేనని ఆధారాలతో సహా బట్టబయలు కావడంతో ప్రజల్ని మభ్యపెట్టేందుకు దుష్ప్రచార కుట్రకు పదును పెడుతున్నాయి. అందుకే వాస్తవాలను వక్రీకరిస్తూ తమ అనుకూల మీడియా, టీడీపీ సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను, అభూత కల్పనలను ప్రచారంలోకి తెస్తు న్నాయి. కుక్కతోక పట్టుకుని గోదారి ఈదాలన్నట్టుగా.. ఫ్లెక్సీలను పట్టుకుని రాద్ధాంతం చేసేందుకు యత్నిస్తున్నాయి. ఆ సాకుతో కూనం వీరభద్రయ్య చౌదరి, కోటయ్య చౌదరిలతో దగ్గుబాటి కుటుంబ వ్యాపార బంధాన్ని కప్పిపుచ్చేందుకు విఫలయత్నం చేస్తున్నాయి. సంధ్యా ఆక్వా కంపెనీతో టీడీపీ నేతల వ్యాపార లావాదేవీలు, బంధుత్వాలు, సన్నిహిత సంబంధాలు ఏమీ తెలీనట్లుగా ఓ వర్గం మీడియా నటిస్తోంది. కానీ కోటయ్య చౌదరి డ్రగ్స్ దందా చంద్రబాబు-దగ్గుబాటి కుటుంబాల మెడకు ఇప్పటికే చుట్టుకుందన్నది బహిరంగ రహస్యం. మసిపూసి మారేడు కాయ చేయాలన్న కుతంత్రాలు బెడిసి కొడుతుండటంతో చంద్రబాబు ఆత్మ రక్షణలో పడిపోయారు.

అంతా చౌదరి కుటుంబమే..

డ్రగ్స్ దందాలో పాత్రధారులు కూనం కోటయ్య చౌదరి కుటుంబం కాగా, సూత్రధారులు అందరూ టీడీపీ, బీజేపీలోని టీడీపీ కోటరీ సభ్యులేనన్నది బట్టబయలైంది. బ్రెజిల్ నుంచి భారీ ఎత్తున డ్రగ్స్ దిగుమతి చేయించిన వ్యవహారంలో సంధ్యా ఆక్వా కంపెనీ చైర్మన్ కూనం వీరభద్ర చౌదరి, ఎండీ కోటయ్య చౌదరి ప్రధాన పాత్రధారులుగా ఉన్నారు. కాగా ఈ దందాకు ఆర్థిక, రాజకీయ అండదండలు అందించడం, డ్రగ్స్ భారత్‌కు చేరుకున్నాక మార్కెటింగ్ వ్యూహం అమలు సూత్రధారులు అందరూ టీడీపీ, బీజేపీలోని టీడీపీ కోటరీ నేతలే కావడం గమనార్హం. ముఖ్యంగా ఈ వ్యవహారంలో చంద్రబాబుకు అత్యంత సన్నిహితులు, దగ్గుబాటి పురందేశ్వరి కుటుంబ సభ్యుల వైపే వేళ్లన్నీ చూపుతున్నాయి. అసలు సంధ్యా ఆక్వా కంపెనీ ఏర్పాటులోనే దగ్గుబాటి పురంధేశ్వరి కుటుంబం కీలకపాత్ర పోషించింది. ఆమె కుమారుడు దగ్గుబాటి చెంచురామ్, వియ్యంకుడు భాగ స్వాములుగానే ఆ కంపెనీని స్థాపించారు. అనంతరం ఆ కంపెనీని మూడుగా విభజించి అంతర్జాతీయ స్థాయిలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కాగా ఆ అంతర్జాతీయ స్థాయి వ్యాపారం వెనుక డ్రగ్స్ స్మగ్లింగ్ లోగుట్టు దాగుందన్నది తాజాగా సీబీఐ సోదాల్లో వెల్లడైంది. మరోవైపు చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన టీడీపీ ముఖ్య నేతలు, వారి వారసులతో సంధ్యా ఆక్వా కంపెనీ కోటయ్య చౌదరికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండటం గమనార్హం. దామచర్ల సత్యం (ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్థన్ సోదరుడు), రాయపాటి జీవన్ (టీడీపీ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు తమ్ముడు గోపాలకృష్ణ కుమారుడు), లావు శ్రీకృష్ణ దేవరాయలు (నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి) లతో ఓ కోటరీగా గూడుపు ఠాణీ నిర్వహించారన్నది వెలుగులోకి వచ్చింది. దామచర్ల జనార్దన్ టీడీపీ అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు కాగా, ఆయన కుమారుడు దామచర్ల సత్య ప్రస్తుతం లోకేశ్ కోటరీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆ పచ్చ ముఠా సభ్యులంతా తరచూ విదేశీ పర్యటనలు చేస్తారని.. ఆ ముసుగులో వ్యాపార వ్యవహారాలు సాగిస్తారని.. కలసి ఎంజాయ్ చేస్తారనే ఫొటోలు సోషల్ మీడియాలో రెండు రోజులుగా హల్‌చల్ చేస్తు న్నాయి.



సంధ్యా ఆక్వాకు అనుమతులు నిరాకరిస్తూ కార్యకలాపాలు నిలిపివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ జారీ చేసిన ఉత్తర్వులు

ఆలపాటి రాజాకూ లింకు

చంద్రబాబు గీచిన గీత జవదాటరనే పేరున్న ఆలపాటి రాజాకు సంధ్యా ఆక్వా కంపెనీ కూనం వీరభద్ర చౌదరి, కోటయ్య చౌదరిలతో ఆర్థిక బంధం ఉందని నిరూపించే పత్రాలు వెలుగులోకి వచ్చాయి. వారిద్దరూ కలసి ఎన్నో వ్యాపార లావాదేవీలు సంయుక్తంగా నిర్వహించినట్టు నిగ్గు తేలింది. విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా రాష్ట్రంలోని ఇతర తీర ప్రాంతాల్లో తమ దందాను విస్తరించిన సంధ్యా ఆక్వా కంపెనీతో నందమూరి బాలకృష్ణ కుటుంబ సభ్యులకు కూడా సన్నిహిత సంబంధాలు ఉండటం గమనార్హం. బాలయ్య చిన్న అల్లుడు, నారా లోకేశ్ తోడల్లుడు, విశాఖపట్నం టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.భరత్ కుటుంబం విశాఖపట్నంలో సంధ్యా ఆక్వా కంపెనీ ఎండీ కూనం కోటయ్య చౌదరికి పలు వ్యవహారాల్లో సహకారం అందించింది. భరత్ కుటుంబ సహకారంతోనే విశాఖపట్నంలో సంధ్యా ఆక్వా వ్యాపార కార్యకలాపాలు విస్తరించాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరికి కూడా భరత్ కుటుంబంతో మొదటి నుంచీ సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆమె కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రిగా ఉన్న తరుణంలోనే భరత్ కుటుంబానికి చెందిన గీతం విద్యా సంస్థలకు డీమ్డ్ యూనివర్సిటీ హోదా లభించిందన్నది గమనార్హం. ఈ వాస్తవాలు, పరిణామాలన్నీ కూడా డ్రగ్స్ దందాలో పాత్రధారి అయిన సంధ్యా ఆక్వా కంపెనీతో చంద్రబాబు, దగ్గుబాటి పురంధేశ్వరి కుటుంబాలు, కోటరీలకు సన్నిహిత సంబంధాలున్నాయని స్పష్టం చేస్తున్నాయి. దాంతో డ్రగ్స్ దందాను వైఎస్సార్‌సీపీపైకి నెట్టేయాలన్న చంద్రబాబు కుతంత్రం బెడిసికొట్టింది.

ఫ్లెక్సీ పట్టుకుని గోదారి ఈదాలన్నది టీడీపీ యత్నం

డ్రగ్స్ స్మగ్లింగ్ వ్యవహారంలో తమ వ్యవహారం బట్టబయలు కావడంతో దిక్కుతోచని స్థితిలో చంద్రబాబు తానేం చేస్తున్నారో గుర్తించలేకపోతున్నారు. అయోమయానికి గురై వైఎస్సార్‌సీపీపై నిరాధార ఆరోపణలు చేస్తూ తానే అడ్డంగా దొరికిపోతున్నారు. కూనం ప్రభాకర్ చౌదరి ఫొటోలు ఉన్న ఓ ఫ్లెక్సీని చూపిస్తూ వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేసేందుకు యత్నిస్తున్నారు. ఆయన ఈ ఏడాది సంక్రాంతి పండుగకు ప్రకాశం జిల్లాలోని తమ స్వగ్రామం ఈదుమూడి వెళ్లారు. ఆ సందర్భంగా పార్టీలకతీతంగా కుటుంబ వ్యవహా రంగా ఆ గ్రామస్తులు వేసిన ఫ్లెక్సీలో కూనం ప్రభా కర్ చౌదరి ఫొటోలు వేశారు. అదేమీ వైఎస్సార్‌సీపీ రాజకీయ కార్యక్రమం కాదు.. ప్రభుత్వ కార్యక్రమం అంతకంటే కాదు. భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఆ గ్రామస్తులు రాజకీయాలతో నిమిత్తం లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ అది. అందులో ఎక్కడా వైఎస్సార్‌సీపీ పేరు కూడా లేదు. అయినా ఆ ఫ్లెక్సీలో ఫొటో ఉంది కాబట్టి కూనం ప్రభాకర్ చౌదరి వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి అంటూ టీడీపీ దుష్ప్రచారం చేస్తుండటం విడ్డూరం.

పచ్చ గ్యాంగ్ నాడు అలా.. నేడు ఇలా

భారీ డ్రగ్స్‌ను విశాఖ పోర్టుకు తీసుకువచ్చి అడ్డంగా దొరికిపోయిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్దిరోజులకే కొరడా ఝుళిపించింది. కాలుష్య నియంత్రణకు సంబంధించిన నిబంధనలు పాటించకుండానే కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్(సీఎఫ్ఈ) కోసం విజయవాడలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ జోనల్ కార్యాలయానికి సంధ్యా ఆక్వా దరఖాస్తు చేసింది. దీనిపై విచారణ జరపగా ఆ కంపెనీ నిబంధనలేమీ పాటించలేదని తేలింది. దీంతో దరఖాస్తును తిరస్కరిస్తున్నట్లు 2019 సెప్టెంబర్ 18న ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఉత్తర్వులు జారీ చేస్తూ కంపెనీకి లిఖిత పూర్వకంగా తెలియజేసింది. నిజానికి అంతకు ముందు కూడా దరఖాస్తు చేయగా తిరస్కరించామని, ఇదే కంపెనీ అదే మళ్లీ అలానే దరఖాస్తు చేసినందున తిరస్కరిస్తున్నామని స్పష్టం చేసింది. సంధ్యా ఆక్వాలో నీరు, గాలి సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, వ్యర్థాలను శుద్ధి చేయడానికి తగినంత భూమి వారి వద్ద అందుబాటులో లేదని తెలిపింది. వ్యర్థాలను సమీపంలోని కాలువలో వదిలేస్తున్నట్లు తాము గుర్తించామని ఆర్డర్‌లో పేర్కొంది. ఈ నేపథ్యంలో పొల్యూషన్ బోర్డు అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణ, అభివృద్ధి పనులు చేపట్టకూడదని ఆదేశించింది. అప్పటికే ఏవైనా కార్యకలాపాలు ప్రారంభించి ఉంటే వెంటనే వాటన్నింటినీ నిలిపివేయాలని కూడా హెచ్చరించింది. దీనిని బట్టి సంధ్యా ఆక్వా అక్రమాలకు ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించిందనేది సుస్పష్టం అవుతోంది. అలాంటప్పుడు ఇంతలా చర్యలు తీసుకున్న ప్రభుత్వంపై బురదజల్లడానికి పచ్చ గ్యాంగ్, పచ్చ మీడియా విఫలయత్నం చేస్తోంది. తమ సన్నిహిత సంస్థ అని ఆ రోజు భుజానకెత్తుకుని, ఈ ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదంటూ రచ్చ చేసిన టీడీపీ, ఎల్లో మీడియా.. ఇప్పుడు డ్రగ్స్ కుంభకోణం బయటపడేసరికి ప్లేటు ఫిరాయించాలని చూస్తోంది. కానీ నిందితులంతా టీడీపీ పెద్దలకు అత్యంత ఆప్తులనే విషయం ఇప్పటికే ప్రజలకు అర్థమైంది.

ఏప్రిల్ మొదటివారంలో రైతు సదస్సులు

- విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని టీపీసీసీ కిసాన్ సెల్ నిర్ణయించింది. సెల్ రాష్ట్ర చైర్మన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డి అధ్యక్షతన శనివారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా అన్వేశ్‌రెడ్డి మాట్లాడుతూ 100 రోజుల్లో పేదల అభివృద్ధి కోసం ప్రజాపాలన అందిస్తోన్న కాంగ్రెస్ పార్టీపై ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తు న్నాయని, వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తొమ్మిదేళ్లుగా ఒక్క ఎకరానికి కూడా పరిహారం చెల్లించని కేసీఆర్.. ఇప్పుడు పంట పరిహారం ఇవ్వాలంటూ నీతులు చెప్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రైతాంగానికి తీరని ద్రోహం చేసిందని అన్వేశ్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అవలంబించిన రైతాంగ వ్యతిరేక విధానాలను రాష్ట్రంలోని రైతులకు వివరించేందుకు ఏప్రిల్ మొదటి వారంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో భారీ సదస్సులను నిర్వహించనున్నట్లు చెప్పారు.

సరిహద్దు రాష్ట్రాల పోలీసుల అలర్ట్

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పటిష్ట చర్యలు

భూపాలపల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీసు అధికారులు అలర్ట్ అయ్యారు. మావోయిస్టుల కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు సుదీర్ఘ చర్చలు జరిపారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఎస్పీ క్యాంప్ ఆఫీస్‌లో ఆ జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంకిత్ గోయల్, ఐజీ, రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా మావోయిస్టుల కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై చర్చించుకున్నారు. మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచి సంబంధిత సమాచారాన్ని పరస్పరం చేరవేర్చుకోవాలని నిర్ణయించారు. దీనివల్ల మావోయిస్టులను కట్టడి చేయడం సులభతరం అవుతుందని భావిస్తున్నారు. మొదటగా రామగుండం పోలీస్ కమిషనర్, భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే, ఆసిఫాబాద్ ఎస్పీ, మంచిర్యాల డీసీపీ రామగుండం నుంచి హెలికాప్టర్ ద్వారా గడ్చిరోలికి వెళ్లారు. సమావేశంలో మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల ఎస్పీలు, అడిషనల్ ఎస్పీలు, ఓఎస్డీలు, డీఎస్పీలు, సీఆర్పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హెలికాప్టర్‌లో వెళ్లిన తెలంగాణ జిల్లాల ఎస్పీలు, పోలీసు ఉన్నతాధికారులు

ఎన్నికల వ్యూహాలపై... నేడు బీజేపీ కీలక భేటీలు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో... ఆదివారం బీజేపీకి సంబంధించి రెండు ముఖ్యమైన సమావేశాలు జరగనున్నాయి. ఈ భేటీల్లో పార్టీ పరంగా ఎన్నికల వ్యూహాల ఖరారుతో పాటు, ప్రచార వ్యూహం, లేవనెత్తాల్సిన అంశాలు, లోక్ సభ నియోజక వర్గాల్లో ఎన్నికల ప్రచారం తదితర అంశాలు చర్చకు రానున్నాయి. పార్టీ కార్యాలయంలో కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరగనున్న భేటీలో... పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, పార్లమెంట్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర నాయకులతో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం విడిగా రాష్ట్రపార్టీ ముఖ్యనేతల సమావేశం కూడా జరగనుంది. ఈ సమావేశాలకు పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రపార్టీ ఇన్‌చార్జిలు సునీల్ బన్సల్, తరుణ్ ఛుగ్ ఇతర నాయకులు పాల్గొంటారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాలను రూపొందించడం, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎండగట్టడంతోపాటు హామీలను నెరవేర్చే విధంగా ఒత్తిడి పెంచేలా కార్యాచరణ ఖరారు చేస్తామని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

జర్నలిస్టుల డిమాండ్లు పరిష్కరించాలి

- కిషన్‌రెడ్డికి టీయూడబ్ల్యూజే వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టులకు స్వేచ్ఛ ముఖ్యమైనందున మీడియా సంస్థలు, జర్నలిస్టుల భద్రత, రక్షణకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చట్టాన్ని తీసుకు రావాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) విజ్ఞప్తి చేసింది. శ్రమకు తగ్గ ఫలితం కోసం వర్కింగ్ జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టుల కోసం వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరింది. 2007లో జస్టిస్ మజీదియా కమిటీ చేసిన సిఫారసులను వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా మీడియా సంస్థలు, జర్నలిస్టుల సంక్షేమం కోరుతూ, షహీద్ భగత్ సింగ్ వర్ధంతి మార్చి 23న, 'జర్నలిస్ట్స్ డిమాండ్ డే'కు ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు వినతి పత్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ నేతృత్వంలో ప్రతినిధి బృందం కిషన్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ ప్రతినిధి బృందంలో ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రాజేష్, వి.యాదగిరి, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు శిగా శంకర్ గౌడ్, హమీద్ షౌకత్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాహుల్ ట్యాక్స్

▶ మొదటి పేజీ తరువాయి

అక్రమార్కులకు అప్పజెప్పారని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వాటిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు దర్యాప్తు జరిపించడం లేదు? బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోంది. సెటిల్‌మెంట్ రాజకీయాలు చేస్తోంది'' అని కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి తెలంగాణ ప్రజలు దీనంతటినీ భరిస్తున్నారని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం అవినీతికి తన దగ్గర సాక్ష్యాలు ఉన్నాయని అప్పట్లో రేవంత్ అన్నారని.. దమ్ముంటే సీబీఐ దర్యాప్తు జరిపించాలని తనకు సవాల్ చేశారని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. ఇప్పుడు రేవంత్ అధికారంలో ఉన్నారని, కాళేశ్వరంపై సీబీఐ దర్యాప్తు కోరాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు బీఆర్ఎస్ పాత్ర అప్రస్తుతమై పోయిందని, అసలు ఆ పార్టీ పోటీచేయాల్సిన అవసరం కూడా లేదని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ ఏమైనా ఉంటే అది కాంగ్రెస్‌తోనేనని పేర్కొన్నారు.

లిక్కర్ స్కాంపై బహిరంగ చర్చకు సిద్ధమా?

ఢిల్లీ మద్యం కుంభకోణంలో వందల కోట్లు చేతులు మారాయని తాను నిరూపిస్తానని, అది తప్పని మాజీ సీఎం కేసీఆర్ చెప్పగలరా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్‌కు ధైర్యముంటే ఈ అంశంపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. అవినీతికి పాల్పడిన వారిని దర్యాప్తు సంస్థలు సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేస్తే.. అది ప్రజాస్వామ్యానికి చీకటిరోజు, కక్షసాధింపు ఎలా అవుతుందో చెప్పాలని ప్రశ్నించారు. కేజ్రీవాల్ అరెస్ట్‌ను కేసీఆర్ బ్లాక్‌డే అనడం గురువింద గింజ సామెతను గుర్తుకు తెస్తోందని విమర్శించారు. తన కుమార్తె కవిత అరెస్ట్ అయినప్పుడు స్పందించని కేసీఆర్.. కేజ్రీవాల్ అరెస్ట్ అయ్యాక స్పందించడం వెనక మతలబు ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. ఆ అరెస్ట్‌లతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు.

'మేత 'వన్నె పులి

'సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్' ఆగడాలెన్నో.. • గతంలోనే అప్సడా కొరడా



కాకినాడ సమీపంలోని సంధ్యా ఆక్వా సంస్థ

- రొయ్యల మేతలో 'డ్రైడ్ ఈస్ట్' వాడకం తక్కువే
- దేశంలోనే ఉత్పత్తి కంపెనీలకు కొదవలేదు
- తక్కువ ధరకు వస్తుందనే విదేశాల నుంచి దిగుమతి
- ఎక్కువగా ఉపయోగించేది బేకరీ, ఆహార ఉత్పత్తుల్లోనే
- కొద్ది నెలల క్రితమే ఫీడ్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసిన సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్
- ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం తక్కువే అయినా 25 టన్నులు దిగుమతి
- ఇంత పెద్దమొత్తంలో అవసరమేమిటో అర్థం కాని ప్రశ్న
- ఇది టీడీపీ, బీజేపీ సమేత డ్రగ్స్ కథా చిత్రమే!

సాక్షి, అమరావతి: డ్రైడ్ ఈస్ట్ మాటున రూ.వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను బ్రెజిల్ నుంచి సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టు కంపెనీ పేరిట దిగుమతి చేసుకున్న ఘటన జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. రొయ్యల మేత మాటను రూ.లక్షల కోట్ల డ్రగ్స్ దందా సాగిస్తూ 'మేత'వన్నె పులిగా 'సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్' ఖ్యాతిపొందింది. ఈ క్రమంలో అసలు డ్రైడ్ ఈస్ట్ అంటే ఏమిటి? ఎలా తయారవుతుంది.? ఏయే అవసరాల కోసం ఎంత మోతాదులో వినియోగిస్తారు. ఆక్వా ఫీడ్ తయారీలో నిజంగానే వాడతారా? ఫీడ్ తయారీలో ఈ సంస్థ ఎప్పుడు అడుగు పెట్టింది ? ప్లాంట్ సామర్థ్యం ఎంత ? ఎందుకు ఇంత పెద్దమొత్తంలో ఆర్డర్ ఇవ్వాల్సి వచ్చింది? అనే అంశాలపై చర్చ జరుగుతోంది

90 శాతానికిపైగా ఆహార ఉత్పత్తుల తయారీలోనే

డ్రైడ్ ఈస్ట్ అనేది సజీవ సూక్ష్మజీవుల సమాహారం. ఇదొక ఇమినో బూస్టర్‌లా ఉపయోగపడుతుంది. శిలీంద్రాల జాతికి చెందిన దీని శాస్త్రీయ నామం సక్కరో మైసెస్. ప్రధానంగా యాక్టివ్ డ్రైడ్ ఈస్ట్, ఇన్‌స్టంట్ డ్రైడ్ ఈస్ట్, ఫాస్ట్ యాక్టింగ్ ఇన్‌స్టంట్ ఈస్ట్, బ్రెడ్ మెషిన్ ఈస్ట్ రకాలు అందుబాటులో ఉన్నాయి. ఎక్కువగా బేకరీ, ఆహార ఉత్పత్తుల తయారీలో వాటి ఆకృతి, రుచి, పెరుగుదలకు వాడుతుంటారు. ఆక్వా, పౌల్ట్రీ, యానిమల్ ఫీడ్ తయారీలోనూ కొద్దిగా వాడతారు. ఈస్ట్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలు దేశీయంగా చాలా ఉన్నాయి. డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి లేకపోవడం, విదేశాలతో పోల్చుకుంటే ధర ఎక్కువగా ఉండడంతో మెజార్టీ ఆహార ఉత్పత్తుల తయారీదారులు విదేశాల నుంచే ఎక్కువగా దిగుమతి చేసుకుంటుంటారు. బ్రెజిల్, ఆస్ట్రేలియా, యూఎస్ఏ, చైనాలో ఎక్కువగా ఉత్పత్తి జరుగుతుంది. దేశీయంగా క్వాలిటీని బట్టి కిలో రూ.200 నుంచి రూ.480 వరకు ఉంటే, ఒక్క బ్రెజిల్‌లోనే కిలో రూ.70కు అందుబాటులో ఉంటుంది. కారణం ఇక్కడ ఎక్కువగా పండే బార్లీ నుంచి ఈస్ట్ ఉత్పత్తి చేసే కంపెనీలు ఎక్కువగా ఉండడమే. అందుకే ఒక్క బ్రెజిల్ నుంచి ఏటా 500 టన్నుల ఈస్ట్ మన దేశానికి దిగుమతి అవుతుంది. దిగుమతి అయ్యే డ్రైడ్ ఈస్ట్‌లో నూటికి 90 శాతానికి పైగా ఆహార ఉత్పత్తుల తయారీలోనే ఉపయోగిస్తారు. ఆక్వా, పౌల్ట్రీ, యానిమల్ ఫీడ్ తయారీలో వాడకం ఐదు శాతం లోపే ఉంటుందని చెబుతున్నారు. ఎక్కువగా ఫీడ్ సప్లిమెంట్ కోసం వాడతారు.

ఆక్వా సాగులోనూ హెక్టార్‌కు 5 గ్రాములకు మించి వాడరు

ఆక్వాసాగులో ఈస్ట్‌ను రైతులు ఉపయోగిస్తుంటారు. సాగుకు ముందు చెరువులను సిద్ధం చేసే సమయంలో వాటర్ ప్యూరిఫికేషన్ చేస్తారు. ఈ సమయంలో వరిపిండి, తవుడు, బెల్లం, నీరు కలిపిన ద్రావణంలో 1-2 గ్రాములు ఈస్ట్‌ను కలిపి 24 గంటలపాటు పులియబెట్టి ఆ తర్వాత చెరువులో కలుపుతారు. దీనివల్ల ఫైటో ప్లాంటన్ (వృక్ష సంబంధమైన ప్లవకం), జూ ప్లాంటన్ (జంతు సంబంధమైన ప్లవకం) తయారవు తుంది. వీటిని తినేందుకు రొయ్యలు ఎక్కువగా ఇష్టపడుతుంటాయి. ఇలా హెక్టార్‌కు ఐదు గ్రాములకు మించి వినియోగించరు. ఆ తర్వాత వ్యాధికారక క్రిములను తట్టుకొని మెరుగైన రోగనిరోధకశక్తిని పొందేందుకు, నీటి నాణ్యతను మెరుగుపర్చేందుకు ప్రోబయోటిక్స్‌గానూ వాడుతుంటారు. వీటి తయారీలో కూడా ఈస్ట్‌ను ఫీడ్ కంపెనీలు ఉపయోగిస్తుంటాయి. రొయ్యల మేత తయారు చేసే ఫీడ్ కంపెనీలు దేశీయంగా 16 ఉన్నాయి. వీటి ద్వారా ఏటా 14 లక్షల టన్నుల మేత ఉత్పత్తి జరుగుతుంది. ఒక్క అవంతి ఫీడ్ కంపెనీయే ఏటా 5-6 లక్షల టన్నులు ఉత్పత్తి చేస్తుంది. ఆ తర్వాత సీపీఎఫ్ కంపెనీ 2 లక్షల టన్నులు ఉత్పత్తి చేస్తుంటే, మిగిలిన కంపెనీలన్నీ ఏటా 50 వేల నుంచి లక్ష టన్నులలోపు ఉత్పత్తి చేస్తుంటాయి.

ఏకంగా 25 టన్నులెందుకు?

ఇక సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెట్ పేరిట అధికారికంగా పామర్రులో రెండు ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా, నెల్లూరులో బ్లాక్‌వాటర్ షల్ ఫిష్ హేచరీ ఉంది. రెండు నెలల క్రితం కాకినాడ జిల్లా మూలపేట వద్ద మరో ప్రాసెసింగ్ ప్లాంట్, వజ్రకూటం వద్ద ఏటా 60వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఆక్వా ఫీడ్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ఒక్క కిలో కూడా మార్కెట్‌లోకి రాలేదు. కేజీ మేత తయారీ కోసం కేవలం 5 గ్రాములకు మించి డ్రైడ్ ఈస్ట్‌ను వాడరు. అంటే 25 టన్నుల డ్రైడ్ ఈస్ట్ ద్వారా కనీసం 5-6 లక్షల టన్నుల మేత తయారు చేయొచ్చు. ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం ఏటా 60 వేల టన్నులు మాత్రమే. ఈ లెక్కన ఇంత పెద్ద ఎత్తున డ్రైడ్ ఈస్ట్ దిగుమతికి ఆర్డర్ ఇవ్వడం వెనుక చాలా గూడుపుఠాణి ఉందని అర్థమవుతోంది. టీడీపీ, బీజేపీ పెద్దల సహకారంతోనే డ్రైడ్ ఈస్ట్ పేరిట డ్రగ్స్‌ను దిగుమతి చేసుకుంటున్నారన్న ఆరోపణలకు బలం చేకూరుతోంది.

రైతులకు రూ. కోట్లలో బకాయిలు

మరోవైపు సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ సంస్థ రోజుకు 80 టన్నుల నుంచి 150 టన్నుల రొయ్యలను ఉమ్మడి ఉభయ గోదావరి నుంచి నెల్లూరు వరకు ఉన్న ఆక్వా రైతుల నుంచి కొనుగోలు చేస్తుంది. వీటిని ప్రాసెస్ చేసి అమెరికా, చైనాకు ఎగుమతి చేస్తుంది. గతంలో ఎక్స్‌పోర్ట్ కంపెనీలు చెప్పిందే ధర.. ఇచ్చిందే సొమ్ము అన్నట్టుగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అప్సడా చట్టం చేయడం, పైగా కౌంట్‌ల వారీగా ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ప్రాసెసింగ్ కంపెనీలు కొనుగోలు చేసేలా ప్రతి 15రోజులకోసారి పర్యవేక్షిస్తుండడంతో కంపెనీల ఆటలు సాగడం లేదు. స్థానిక ఆక్వా రైతులను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈక్వెడార్ నుంచి 17 కంటైనర్లలో రొయ్యలను దిగుమతి చేసుకొని వాటిని ప్రాసెస్ చేసి తిరిగి అమెరికా, చైనాకు ఎగుమతి చేస్తున్నారని తెలియడంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కంపెనీని కొంతకాలం పాటు సీజ్ చేసింది. ఎగుమతులకూ బ్రేకులేసింది. ఇటీవల కాలంలో ఈ సంస్థ రైతులకు రూ.కోట్లలో బకాయి పడింది. రొయ్యలు సరఫరా చేసినందుకు ఈ కంపెనీ తనకు రూ.50 లక్షలు చెల్లించాల్సి ఉందని భీమవరానికి చెందిన ఓ రైతు 'సాక్షి' వద్ద చెప్పారు. ఇలా సుమారు రూ.10 కోట్లకు పైగా ఈ సంస్థ రైతులకు చెల్లించాల్సి ఉందని సమాచారం.

బకాయిలు చెల్లించేలా చూడాలి



సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్ కంపెనీ వ్యవహారం ఆది నుంచీ వివాదాస్పదమే. ఈక్వెడార్ నుంచి దిగుమతి చేసుకున్న రొయ్యలను ప్రాసెస్ చేసి అమెరికాకు పంపుతున్న సమయంలో అప్సడా ఉక్కుపాదం మోపింది. చట్టపరంగా చర్యలు తీసుకుని కంపెనీని చాన్నాళ్లు మూసేసింది. ఇటీవల ప్రారంభించిన ఫీడ్ ప్లాంట్ తయారీకి ఎలాంటి అనుమతులూ లేవని చెబుతున్నారు. ఉత్పత్తిని పూర్తిస్థాయిలో ప్రారంభించని ఈ సంస్థకు ఇంతపెద్ద ఎత్తున డ్రైడ్ ఈస్ట్ దిగుమతి చేసుకోవల్సిన అవసరం ఏముంది? ఏదేమైనా ముందుగా రైతులకు చెల్లించాల్సిన బకాయిలు అణాపైసలతో సహా చెల్లించి తీరాల్సిందే. ఈ సంస్థను అడ్డం పెట్టుకుని డ్రైడ్ ఈస్ట్ మాటున డ్రగ్స్ రాకెట్ నడుపుతున్న టీడీపీ, బీజేపీ పెద్దలెవరో తెలియాలంటే సీబీఐ నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలి.

– వడ్డి రఘురాం, కో–వైస్ చైర్మన్, అప్సడా



లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకేగాని
లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంప లేదు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.9.28 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** పుబ్బ ఉ.7.20 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** ప.3.20, నుండి 5.04 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.34 నుండి 5.22 వరకు, **అమృతఘడియలు:** రా.2.01 నుండి 3.45 వరకు, హోలీ పౌర్ణమి

సూర్యోదయం : 6.05
సూర్యాస్తమయం : 6.07
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

కపిల్ సిబల్ (ఎంపీ, న్యాయవాది)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

లోకానికి నాలుగు దిక్కులు ఉన్నట్లే లోకంలోని ప్రతి మనిషికీ నాలుగు దారులు ఉంటాయి. వెళుతున్న దారొకటి. వెళ్లాలనుకున్న దారొకటి. వెళ్లకూడదనుకునీ వెళుతున్న దారొకటి. వెళ్లాలనుకునీ వెళ్లలేకపోతున్న దారొకటి.

ఈ నాలుగూ కాకుండా ఐదో దారి కూడా ఒకటి ఉంది! ఏ దారి ఎటు వెళుతుందో తెలియని దారి!

"ఉన్నదే నాలుగు దారులైతే... ఐదో దారిని తెచ్చి, దానికి 'ఏ దారి ఎటు వెళుతుందో తెలియని దారి' అని పేరు పెడితే అదొక దారైపోతుందా?!" అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ బేలా ఎం. త్రివేది వంటి న్యాయ కోవిదులు నన్నడగొచ్చు.

చట్టంలో లేనిదేదీ దారి తప్పి కోర్టు హాల్లోకి రాకూడదు జడ్జిలకు. ఒకవేళ నేను లాయర్‌ని కాకుండా జడ్జిని అయివుంటే... నేను కూడా... కేసు వాదిస్తున్న లాయర్‌ని అలాగే ప్రశ్నిస్తానా... "ఐదో దారి ఎక్కడిది! శాస్త్రంలో లేదే!" అని?

జడ్జిలు ఎప్పుడూ శాస్త్రాన్ని ఆశ్రయిస్తూ తీర్పులు చెబుతూ పోతుంటే శాస్త్రం శాస్త్రంలానే ఉండిపోతుంది. వ్యక్తి కన్నా శాస్త్రం గొప్పదే.



కానీ, శాస్త్రం ఎప్పటికీ నిలబడి ఉండాలంటే అప్పుడప్పుడూ శాస్త్రమూ వ్యక్తుల ఆశ్రయం పొందుతుండాలి. వ్యక్తులంటే న్యాయవాదులు.

వాదన... శాస్త్రంతో కలబడుతుంది. వాదనే శాస్త్రాన్ని నిలబెడుతుంది.

కవితకు బెయిలు కేసులో శుక్రవారం నా వాదనల్ని నేను బలంగా వినిపిస్తున్నప్పుడు నన్నొట్టి బలహీనమైన భావోద్వేగ ప్రాణిగా చూసిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనంలోని జడ్జిలే... ఖన్నా, సుందరేశ్, త్రివేది.

"మైలార్డ్స్... నా క్లయింట్ కవితకు బెయిల్ ఇవ్వకపోవటం అన్నది సుప్రీంకోర్టు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడదు" అన్నాన్నేను.

కవితను అరెస్ట్ చేయటం నాకెందుకో సరిగా అనిపించటం లేదు. అందుకే ఆ మాట అన్నాను.

వారు నా వైపు జాలిగా చూశారు. గౌరవంగా చూశారు. లాజికల్‌గా చూశారు.

"మిస్టర్ సిబల్.. హృదయంతో ఆలోచించ కండి. హృదయం బెయిలుకు దారి ఇప్పించ లేదు."

"అండ్... మిస్టర్ సిబల్! మీ క్లయింట్ బెయిల్ కోసం మొదట ట్రయల్ కోర్టుకు వెళ్లాలి. తర్వాత హైకోర్టుకు. ఆ తర్వాతే సుప్రీం కోర్టు వరకు రావాలి. వేరే దారి లేదు."

"సీ... మిస్టర్ సిబల్, ప్రముఖులకు ప్రత్యేకంగా ప్రొసీజర్లు ఉండవన్న విషయం మీకు తెలియందా? బెయిలన్నది రావలసిన దారిలోనే రావాలి."

రాత్రంతా కలత కునుకు. ధర్మాసనం నన్ను కలగాపులగంగా మేల్కొలిపింది.

లేచి మెల్లిగా బాల్కనీలోకి వచ్చాను. కింద హైయిలీ దారి పలుచగా ఉంది. వెళుతున్న దారి, వెళ్లాలనుకున్న దారి, వెళ్లకూడదనుకునీ వెళుతున్న దారి, వెళ్లాలనుకునీ వెళ్లలేకపోతున్న దారి... ఈ నాలుగు దారులవాళ్లూ హైయిలీ దారిలో ఉండొచ్చు! అంటే... దారి ఒక్కటే. మనుషులే నాలుగు దారుల వాళ్లు.

మరి... ఏ దారి ఎటు వెళుతుందో తెలియని ఆ ఐదో రకం దారిలో నడిచే ఆ మనుషు లెవరు?

చేతిలో ఫోన్ రింగ్ అయింది.

కాంగ్రెస్ నుండి నేను బయటికి వచ్చిన దాదాపు రెండేళ్ల తర్వాత దారి తప్పి వచ్చిన తొలి కాల్ ఇది నాకు!

"సిబల్‌జీ! మీరూ వస్తారా?"

దారి తప్పిన మోదీ పాలనకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేయటానికి మీరూ వస్తారా అని 'ఇండియా' కూటమి నుంచి పిలుపు!

ఏ దారి ఎటు వెళుతుందో తెలియని వారితో కలిసి అడుగులో అడుగు వేయటం కంటే... అనుకున్న దారిలో నడిచే మోదీకి ఒక్కడినై ఎదురు నిలవటం నయం కదా!

"మోదీకి వ్యతిరేకంగా కవిత కేసు వాదిస్తాను. కేజ్రీవాల్ కేసు వాదిస్తాను. రేపు రాఘవ్ చద్దాను అరెస్ట్ చేస్తే అతడి కేసూ వాదిస్తాను... నా దారిలో నన్ను నడవ నివ్వండి..." అని నవ్వుతూ చెప్పాను.

ఎవరీ కొత్త హవాలా కొలంబస్?



జనతంత్రం

వర్ధెల్లి మురళి



గత సంవత్సరం బ్రెజిల్ అధ్యక్షునిగా లూల డసిల్వా ఎన్నికయ్యారు. ఆయనకు ట్విట్టర్ వేదికగా వైసీపీ నాయకుడు విజయసాయిరెడ్డి అభినందనలు తెలియజేశారట! యెల్లో మీడియా ఎంతో కష్టపడి శోధించి ఈ విషయాన్ని కనిపెట్టింది. బ్రెజిల్ నుంచి విశాఖపట్నం కోటయ్య చౌదరి కంపెనీకి ఓ కంటెయినర్ పార్సెల్ వచ్చింది. ఇంటర్‌పోల్ సమాచారంతో ఆ కంటెయినర్‌ను తనిఖీ చేసిన సీబీఐ అధికారులు జరిపిన మాదక ద్రవ్యాల పరీక్షలో 'పాజిటివ్' ఫలితాలొచ్చాయి. ఆ విషయాన్ని వారు విడుదల చేసిన ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించారు.

కోటయ్య చౌదరి కంపెనీకి (సంధ్యా ఎక్స్‌పోర్ట్స్) రొయ్యలు, చేపలకు సంబంధించిన ఎగుమతుల వ్యాపారం ఉన్నది. రొయ్య విత్తనాన్ని పొదిగే హేచరీ కూడా ఉన్నది. త్వరలో రొయ్యల దాణాను తయారు చేసే మరో కేంద్రాన్ని కూడా తెరవబోతున్నారు. ఆ దాణా తయారీలో ఉపయోగించడానికి పొడి చేసిన యీస్ట్‌ను తెప్పించుకోవడానికి సంధ్య కంపెనీ బ్రెజిల్‌లో ఆర్డర్ పెట్టింది. ఈ పదార్థాన్ని చైనా నుంచీ, యూరప్ నుంచీ కూడా దిగుమతి చేసుకోవచ్చు. బ్రెజిల్‌తో పోలిస్తే దూరాభారం కూడా తక్కువ. కానీ బ్రెజిల్‌నే ఎంపిక చేసుకోవడం వెనుక ఆ కంపెనీకి తనదైన ప్రత్యేక కారణం ఉండవచ్చు.

'యీస్ట్' అనే మాటకు తెలుగు అర్థం కోసం వెతికితే మన నిఘంటువుల్లో సంతృప్తికరమైన సమాధానాలు దొరకలేదు. మధు శిలీంద్రం, పులియబెట్టినది అనే అర్థాలున్నాయి. పూర్వం మన వంటిళ్లలో అన్నం వార్చే రోజుల్లో కలి, గంజి ఉండేవి. కలో గంజో తాగి బతకాలని సామెత. అందులోని కలిని యీస్ట్‌గా పరిగణిస్తాము. రకరకాల అవసరాలకు యీస్ట్‌ను ఉపయోగించడం తెలిసిందే. బ్రూవరీలు, వైనరీలు, బేకరీల్లో ప్రధానంగా వాడుతారు. ఆక్వా దాణా కోసం కూడా వాడుతారట. కోటయ్య చౌదరి కంపెనీ తెప్పించిన పొడి యీస్ట్ డబ్బాల్లో డ్రగ్స్ బయటపడ్డాయనే వార్త లోకానికి ఇంకా తెలియకముందే లోకేశ్‌బాబుకు తెలిసిపోయింది. 'ఎక్స్' వేదికగా ఆయన ఉలిక్కిపడ్డారు. వైజాగ్‌ను నాశనం చేసేందుకు వైసీపీ వాళ్లు తెప్పించారని ఆరోపణలు చేశారు. చినబాబు ఉలికిపాటు సరిపోలేదని చంద్రబాబు కూడా మరోసారి గట్టిగా ఉలిక్కిపడ్డారు.

తెల్లారి లేచేసరికి 'ఈనాడు' పత్రిక మరింత గట్టిగా ఉలిక్కిపడింది. దాంతోపాటు మిగతా యెల్లో మీడియా కూడా! ఈ డ్రగ్స్ సరఫరా వెనుక కచ్చితంగా వైసీపీ హస్తం ఉందని వారు ఏకగ్రీవంగా తీర్మానించి పారేశారు. నెమ్మదిగా అసలు విషయాలు బయటకు రావడం మొదలైంది. కోటయ్య కంపెనీ చుట్టూ అల్లుకున్న తెలుగుదేశం, బీజేపీ నేతల బాంధవ్యాలు బయటపడ్డాయి. సామాజిక బాంధవ్యాలే కాదు, వ్యాపార భాగస్వామ్యాలు కూడా వెల్లడి కావడం మొదలైంది. దాంతో మన యెల్లో మీడియా ఉలికిపాటులోంచి తత్తరపాటులోకి మారింది. ఆ తత్తరపాటులోంచి వచ్చిందే లూల డసిల్వాకు విజయసాయిరెడ్డి అభినందనలు చెప్పారనే మోకాలు – బోడిగుండు సంబంధిత ఆరోపణ.

విజయ సాయిరెడ్డి అభినందనలు ట్విట్టర్‌లో చెప్పారు కనుక కృతజ్ఞతగా బ్రెజిల్ అధ్యక్షుడు దగ్గరుండి డ్రగ్స్‌ను షిప్‌లో లోడ్ చేయించి ఉంటారని మన జనాల్ని నమ్మించాలనే వెధవాయిత్వం యెల్లో మీడియాలో కనిపించింది. సూర్యుడిపై ఉమ్మేయజూసే మూర్ఖత్వమంటే ఇదే! లూయిజ్ ఇనాసియో లూల డసిల్వా ఒక కార్మికోద్యమనేతగా తన ప్రజా జీవితాన్ని ఆరంభించిన వ్యక్తి. ఒకనాటి చిలీ అధ్యక్షుడు డాక్టర్ సాల్వెడార్ అలెండీ, వెనిజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్‌ల వరుసలోని లాటిన్ అమెరికా వామపక్ష యోధుడు. మొదటిసారి అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు ఆయన అమలుచేసిన బొల్సా ఫామిలియా (పేద కుటుంబాలకు ఆర్థిక సాయం), ఫోమ్ జీరో (ఆకలి నిర్మూలన) పథకాలు కోట్లాది మంది బ్రెజిలియన్లను దారిద్య్రం నుంచి విముక్తం చేశాయి. కోట్లాది పేద కుటుంబాల పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాయి.

అమెరికా ఖండంలో అగ్రరాజ్య ప్రయోజనాలకు కంట్లో నలుసుగా డసిల్వా మారాడు కనుక ఆయన అధికారం నుంచి దూరం కావలసి వచ్చింది. అవినీతి ఆరోపణలు మోపి మూడేళ్ల పాటు జైల్లో నిర్బంధించారు. ఆరోపణలన్నీ శుద్ధ అభాండాలేనని సుప్రీంకోర్టు తీర్పు చెప్పి ఆయన్ను జైలు నుంచి విడుదల చేసింది. తర్వాత జరిగిన ఎన్నికల్లో దేశాధ్యక్షునిగా మూడోసారి

కోటయ్య చౌదరి కంపెనీ తెప్పించిన పొడి యీస్ట్ డబ్బాల్లో డ్రగ్స్ బయటపడ్డాయనే వార్త లోకానికి ఇంకా తెలియకముందే లోకేశ్‌బాబుకు తెలిసిపోయింది. 'ఎక్స్' వేదికగా ఆయన ఉలిక్కిపడ్డారు. వైజాగ్‌ను నాశనం చేసేందుకు వైసీపీ వాళ్లు తెప్పించారని ఆరోపణలు చేశారు. చినబాబు ఉలికిపాటు సరిపోలేదని చంద్రబాబు కూడా మరోసారి గట్టిగా ఉలిక్కిపడ్డారు.

తెల్లారి లేచేసరికి 'ఈనాడు' పత్రిక మరింత గట్టిగా ఉలిక్కిపడింది. దాంతోపాటు మిగతా యెల్లో మీడియా కూడా! ఈ డ్రగ్స్ సరఫరా వెనుక కచ్చితంగా వైసీపీ హస్తం ఉందని వారు ఏకగ్రీవంగా తీర్మానించి పారేశారు. నెమ్మదిగా అసలు విషయాలు బయటకు రావడం మొదలైంది. కోటయ్య కంపెనీ చుట్టూ అల్లుకున్న తెలుగుదేశం, బీజేపీ నేతల బాంధవ్యాలు బయటపడ్డాయి. సామాజిక బాంధవ్యాలే కాదు, వ్యాపార భాగస్వామ్యాలు కూడా వెల్లడి కావడం మొదలైంది. దాంతో మన యెల్లో మీడియా ఉలికిపాటులోంచి తత్తరపాటులోకి మారింది. ఆ తత్తరపాటులోంచి వచ్చిందే లూల డసిల్వాకు విజయసాయిరెడ్డి అభినందనలు చెప్పారనే మోకాలు – బోడిగుండు సంబంధిత ఆరోపణ.

ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సకల దేశాధినేతలు, లక్షలాది మంది రాజకీయ ప్రముఖులు, కోట్లాదిమంది అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. అందులో విజయ సాయిరెడ్డి ట్వీట్ ఒకటి. ఒక ప్రముఖ దేశానికి అధ్యక్షునిగా, జి–20 దేశాల కూటమికి ప్రస్తుత అధ్యక్షునిగా ఉన్న వ్యక్తిపైనే బురద చల్లడానికి వెనుకాడలేదంటే యెల్లో మీడియా బరితెగింపు ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

నారా అండ్ సన్స్‌తో పాటు యెల్లో మీడియా కూడా ఈ విషయంలో అతిగా స్పందించింది. రాజకీయ ప్రత్యర్థుల తలకు చుట్టడానికి వారు వేగిరపడ్డారు. సీబీఐ విచారణ పూర్తయ్యే వరకు ఎందుకు ఉగ్గబట్టలేకపోయారో తెలియదు. వారి తొందరపాటుకు తగినట్టుగానే కంపెనీ బాంధవ్యాలు, భాగస్వామ్యాలు తెలుగుదేశం కుటుంబాలనే వేలెత్తి చూపుతున్నాయి. విచారణ పూర్తయితే గానీ జరిగిందేమిటనే సంగతి నిర్ధారణ కాదు. అయితే కొత్త రాజకీయ పొత్తుల నేపథ్యంలో దర్యాప్తు సంస్థపై ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండవని విశ్వసించవచ్చునా అనే ప్రశ్న తలెత్తుతున్నది.

ఈ ప్రశ్నతో పాటు మరికొన్ని సందేహాలకు కూడా సమాధానాలు రావలసి ఉన్నది. దాణా ఉత్పత్తి ప్రారంభం కాకముందే సంధ్యా సంస్థ 25 వేల కిలోల యీస్ట్‌కు ఎందుకు ఇండెంట్ పెట్టింది? యీస్ట్ దిగుమతికి ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉండగా అది బ్రెజిల్‌నే ఎందుకు ఎంపిక చేసుకున్నది? బ్రెజిల్ నుంచి బయల్దేరిన ఓడ విశాఖ రావడానికి ఎక్కువ సమయం తీసుకున్నదన్న పాయింట్‌ను సీబీఐ ముందు కంపెనీ ప్రతినిధులు ఎందుకు నొక్కి చెబుతున్నారు? మధ్యలో తమకు తెలియకుండా ఎవరో ఈ డ్రగ్స్‌ను బాక్సుల్లో పెట్టి ఉంటారని బుకాయించడం కోసమా? అలా మధ్యలో దూర్చడం సాంకేతికంగా సాధ్యమవుతుందా? విచారణ తర్వాత డ్రగ్స్‌ను తెప్పించడం వెనుక బాధ్యత సంధ్య కంపెనీదే అని తేలితే ఆ కంపెనీ ఎందుకు ఆ పని చేసినట్టు? స్వయంగా డ్రగ్స్ వ్యాపారంలోకి దిగిందా? లేక ఎవరైనా కమీషన్ మీద ఈ పని అప్పగించారా?

రెగ్యులర్‌గా దిగుమతులు చేసుకునే కంపెనీలతో డ్రగ్స్ వ్యాపారులు కమీషన్ ఒప్పందాలు చేసుకునే అవకాశం ఉన్నది. కానీ, సంధ్యా కంపెనీ దాణా ఉత్పత్తిని ఇంకా ప్రారంభించనే లేదు. అటువంటి ఉత్పత్తిని ప్రారంభించే ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఆక్వా అథారిటీకి ఇప్పటి వరకు ఎటువంటి సమాచారం ఇవ్వనేలేదు. అప్పుడే యీస్ట్ దిగుమతికి ఎందుకు తొందరపడినట్టు? డ్రగ్స్ వ్యాపారంలో ఉన్న వారు కాకుండా మరేదో బలమైన శక్తి ప్రోద్బలం మేరకే ఈ కంపెనీ యీస్ట్ దిగుమతికి ఆర్డర్ చేసిందా? బ్రెజిల్ నుంచే దిగుమతి చేసుకోవాలని ఆ శక్తి నిర్దేశించిందా? తెలుగుదేశం, జనసేనలకు బీజేపీతో పొత్తు కుదురుతుందనే నమ్మకం కలిగిన తర్వాత బ్రెజిల్‌లో బయల్దేరిన ఓడ... పొత్తుకు తుదిరూపం వచ్చిన తర్వాతనే విశాఖ తీరం చేరుకోవడం కాకతాళీయమేనా?

డ్రగ్స్ సరఫరా, పంపిణీ వ్యాపారులతో ఒప్పందాలు చేసుకోవడం మనీ లాండరింగ్‌లో కొత్త పద్ధతిగా మారిందా? ఒకేసారి వందలు, వేలకోట్ల రూపాయలను చేతులు మార్చడంలో సంప్రదాయ హవాలా పద్ధతుల కన్నా ఇది మెరుగైన పద్ధతిగా భావిస్తున్నారా? ఎందుకంటే ఇండియాలో డ్రగ్స్ దందా టర్నోవర్ లక్ష కోట్లు దాటిందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2022 జూన్ నుంచి 2023 జూలై 15 వరకు నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్రాల బృందాలు కలిసి సుమారు 12 వేల కోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలను ధ్వంసం చేశాయి. ఇంతకు కనీసం పది రెట్లు ఎక్కువ వినిమయం దేశంలో ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో మనీ లాండరింగ్‌కు ఇదో మార్గంగా పరిగణిస్తూ ఉండవచ్చు. అయితే బలమైన నెట్‌వర్క్ కలిగి ఉన్నవారే ఈ పద్ధతిని అనుసరించే అవకాశం ఉన్నది.

బ్రెజిల్ సరిహద్దు దేశాల్లో కొలంబియా ఒకటి. ప్రపంచంలో అతిపెద్ద మాదక ద్రవ్యాల సరఫరా కేంద్రం ఆ దేశం. అయితే కొలంబియా నుంచి రవాణా అయ్యే సరుకుల కన్‌సైన్‌మెంట్లపై దాదాపు అన్ని దేశాల్లో నిఘా తీవ్రంగా ఉంటుంది. నఖశిఖ పర్యంతం పరిశీలిస్తారు. కనుక కొలంబియా డ్రగ్ లార్డ్స్ పక్క దేశాల నుంచి సరుకుల రవాణాలో డ్రగ్స్‌ను కలిపి పంపుతారు. లాటిన్ అమెరికాలో అతిపెద్ద దేశమైన బ్రెజిల్ సహజంగానే వారి ఫస్ట్ ఛాయిస్‌గా ఉంటుంది. అమెజాన్ అడవులు రెండు దేశాల

డ్రగ్స్ సరఫరా. పంపిణీ వ్యాపారులతో ఒప్పందాలు చేసుకోవడం మనీ లాండరింగ్‌లో కొత్త పద్ధతిగా మారిందా? ఒకేసారి వందలు, వేలకోట్ల రూపాయలను చేతులు మార్చడంలో సంప్రదాయ హవాలా పద్ధతుల కన్నా ఇది మెరుగైన పద్ధతిగా భావిస్తున్నారా? ఎందుకంటే ఇండియాలో డ్రగ్స్ దందా టర్నోవర్ లక్ష కోట్లు దాటిందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2022 జూన్ నుంచి 2023 జూలై 15 వరకు నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్రాల బృందాలు కలిసి సుమారు 12 వేల కోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలను ధ్వంసం చేశాయి. ఇంతకు కనీసం పది రెట్లు ఎక్కువ వినిమయం దేశంలో ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద మొత్తంలో మనీ లాండరింగ్‌కు ఇదో మార్గంగా పరిగణిస్తూ ఉండవచ్చు. అయితే బలమైన నెట్‌వర్క్ కలిగి ఉన్నవారే ఈ పద్ధతిని అనుసరించే అవకాశం ఉన్నది.

బ్రెజిల్ సరిహద్దు దేశాల్లో కొలంబియా ఒకటి. ప్రపంచంలో అతిపెద్ద మాదక ద్రవ్యాల సరఫరా కేంద్రం ఆ దేశం. అయితే కొలంబియా నుంచి రవాణా అయ్యే సరుకుల కన్‌సైన్‌మెంట్లపై దాదాపు అన్ని దేశాల్లో నిఘా తీవ్రంగా ఉంటుంది. నఖశిఖ పర్యంతం పరిశీలిస్తారు. కనుక కొలంబియా డ్రగ్ లార్డ్స్ పక్క దేశాల నుంచి సరుకుల రవాణాలో డ్రగ్స్‌ను కలిపి పంపుతారు. లాటిన్ అమెరికాలో అతిపెద్ద దేశమైన బ్రెజిల్ సహజంగానే వారి ఫస్ట్ ఛాయిస్‌గా ఉంటుంది. అమెజాన్ అడవులు రెండు దేశాల సరిహద్దులను కలిపేస్తుండటంతో డ్రగ్స్‌ను బ్రెజిల్ రేవుల దాకా చేర్చడం వారికి సులువు.

సరిహద్దులను కలిపేస్తుండటంతో డ్రగ్స్‌ను బ్రెజిల్ రేవుల దాకా చేర్చడం వారికి సులువు. అమెరికా, ఇండియాల మధ్య ప్రైవేట్ ఆర్థిక సంబంధాలు చాలా ఎక్కువ. విరాళాల దందాలూ ఎక్కువే. 'ఏపీ జన్మభూమి' పేరుతో తెలుగుదేశం అభిమానులు ఓ కొత్త సంస్థను ప్రారంభించి పెద్ద ఎత్తున విరాళాలు వసూలు చేయడం ఈ మధ్య వివాదాస్పదంగా మారింది. వసూలు చేసిన విరాళాలకు సరైన లెక్కలు లేవని విరాళాలిచ్చినవారు వాపోతున్నారు. ఇదేకాకుండా ఎన్నికల పేరుతోనూ విరాళాలు సేకరించడం ఇక్కడ మామూలే. టెక్సాస్ లోని హ్యూస్టన్ నగరం నుంచి కొలంబియా తీరం 1500 మైళ్ల దూరమే!

మనీలాండరింగ్ కోసం మాదక ద్రవ్యాల రూట్‌ను ఎంచుకోవడం నిజమేనని నిర్ధారణ అయితే దేశం ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కోవలసి ఉంటుంది. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టు కంపెనీ చెబుతున్న విషయాలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. జనవరి 14న బయల్దేరిన కంటెయినర్ చాలా ఆలస్యంగా చేరిందని కంపెనీ ప్రతినిధి కూనం హరికృష్ణ వివరణ ఇచ్చారు. అంటే మధ్యలో ఎవరో ఈ పనిచేసి ఉండొచ్చని బుకాయించడానికి వీలుగా ఆయన ఈ పాయింట్‌ను ముందుకు తోస్తున్నారు. సంధ్యా కంపెనీ బ్రెజిల్ సంస్థ నుంచి పొడి యీస్ట్‌ను ఖరీదు చేసింది. దాన్ని ఆ సంస్థ కంటైనర్‌లో పెట్టి, సీల్ వేసి ఓడలోకి ఎక్కిస్తుంది. ఈ కంటెయినర్ ఎన్ని దేశాలు తిరిగివచ్చినా ఎవరికీ కంటెయినర్ తెరిచే అవకాశం ఉండదు. ఎక్స్‌పోర్ట్ చేసిన కంపెనీ కంటెయినర్ సీల్ నెంబర్లను ఇంపోర్ట్ చేసుకునే కంపెనీకి పంపిస్తుంది. ఈ నెంబర్లు చూపెడితేనే ఇంపోర్ట్ చేసుకున్న కంపెనీ సరుకును క్లెయిమ్ చేసుకోగలుగుతుంది. ఇది ప్రొటోకాల్. అందుకే సీబీఐ వారు తమంత తాము కంటెయినర్‌ను తెరవలేదు. కంపెనీ ప్రతినిధులను పిలిపించుకొని వారి సమక్షంలోనే తెరిపించారు. కనుక మధ్యలో ఎవరో డ్రగ్స్‌ను సరుకులో కలిపేయడం అబద్ధం. అనుమానాస్పద శాంపుల్స్‌ను పరీక్షకు పంపించారు. అవి మాదకద్రవ్యాలుగా రుజువై బాధ్యులను శిక్షించగలిగితే పెనుప్రమాదాన్ని నివారించినట్లవుతుంది. రాజకీయ ఒత్తిళ్లు పైచేయి సాధిస్తే భవిత అంధకారమవుతుంది.

vardhelli1959@gmail.com

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

జీవ మనుగడకు జలం కీలకం

భూగర్భ జలాలు క్షీణించే దిశగా భారత్ వేగంగా పురోగమిస్తుందని ఐక్యరాజ్యసమితి నివేదిక హెచ్చరించింది. 'ఇంటర్ కనెక్టెడ్ డిజాస్టర్ రిస్క్ రిపోర్ట్ 2023' నివేదిక ప్రకారం, ప్రపంచంలోని 31 ప్రధాన జలాశయాల్లో 27 తిరిగి నింపగలిగే స్థాయి కంటే వేగంగా క్షీణిస్తున్నాయి. భారత దేశం భూగర్భజలాలు క్షీణ దశకు చేరుకున్నాయని 'యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎన్విరాన్మెంట్ అండ్ హ్యూమన్ సెక్యూరిటీ' (యూఎన్ఐ ఈహెచ్ఎస్) ప్రచురించిన కొత్త నివేదిక కూడా హెచ్చరించింది. ఇంటర్ కనెక్టెడ్ డిజాస్టర్ రిస్క్ రిపోర్ట్ –2023 నివేదిక ఆరు పర్యావరణ పాయింట్లను పరిశీలిస్తుంది. అవి 1. వేగవంతమయిన విలుప్తాలు 2. భూగర్భ జలాల క్షీణత. 3. పర్వత హిమానీనదం. 4 ద్రవీభవనం. 5. అంతరిక్ష శిథిలాలు 6. భరించలేని వేడి– బీమా చేయలేని భవిష్యత్తు.

నివేదిక ప్రకారం పంజాబ్‌లోని 78 శాతం బావులను అతిగా ఉపయోగించినట్లు పరిగణిస్తున్నారు. మొత్తం వాయవ్య ప్రాంతంలో 2025 నాటికి భూగర్భజలాల లభ్యత బాగా తగ్గిపోతుందని నివేదిక అంచనావేసింది. 'జలాశయాలు' అని పిలువబడే భూగర్భ జలాశయాలలో నిల్వ చేయబడిన ముఖ్యమయిన వనరు మంచినీరు. ఈ జలాశయాలు 200 కోట్లకు పైగా ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తాయి. ఇందులో దాదాపు 70 శాతం వ్యవసాయం కోసం ఉపయోగిస్తారు. భూగర్భజలాలు వేలాది సంవత్సరాలుగా 'పునరుత్పాదక వనరుగా' ఉంటున్నాయి అని నివేదిక పేర్కొంది. కానీ ఇప్పటికే ఉన్న బావుల్లో నీటిని అందించగల స్థాయికంటే నిల్వలు కిందికి పడిపోతే విపత్తులు ప్రారంభమైనట్లే. వ్యవసాయానికి నీరు అందక ఆహార కొరత ఏర్పడుతుంది.

భూగర్భ జలాల క్షీణత అత్యంత తీవ్రంగా ఉన్న ప్రాంతాలలో భారతదేశం, ఈశాన్య చైనా, పశ్చిమ యునైటెడ్ స్టేట్స్, మెక్సికో, ఇరాక్, సౌదీ అరేబియా, ఉత్తర ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. ఎక్కువ నీరు అవసరమైన వరి,



గోధుమలను పండించడం వల్ల జలవనరులు తొందరగా అడుగంటుతున్నాయని నివేదిక తెలిపింది. గోధుమ, వరి పంటలకు భారత్ అధికంగా భూగర్భ జలాలను వినియోగిస్తోంది. పంజాబ్, హరియాణా రాష్ట్రాలు దేశం బియ్యం సరఫరాలో 60 శాతం, గోధుమల ఉత్పత్తిలో 85 శాతం ఉత్పత్తి చేస్తున్నాయి. అందుకే పంజాబ్‌లో 78 శాతం బావులు అతిగా వాడకానికి గురవుతున్నాయనేది నివేదిక సారాంశం.

'2023 అంచనా నివేదిక' ప్రకారం దేశం మొత్తం వార్షిక భూగర్భ జలాల రీచార్జ్ 4,49,087 బిలియన్ క్యూబిక్ మీటర్లుగా ఉంది. ఇది మునుపటి సంవత్సరంతో పోలిస్తే 11.48 బిలియన్ క్యూబిక్ మీటర్ల పెరుగుదలను సూచిస్తుంది. దేశం మొత్తం వార్షిక భూగర్భజలాల వెలికితీత 241.34 బిలియన్ క్యూబిక్ మీటర్లుగా ఉంది.

భూగర్భ జలాలు అడుగంటిపోతే తాగునీటి సమస్య మరింత పెరుగుతుంది. ఇప్పటికే ప్రపంచంలోని 220 కోట్ల మంది ప్రజలు సురక్షితమయిన నీరు అందుబాటులో లేకుండా జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2030 నాటికి ప్రతీ ఒక్కరికీ పరిశుభ్రమయిన నీటిని అందజేయాలని ఐక్యరాజ్య సమితి లక్ష్యం నిర్దేశిస్తోంది. భూగోళం మీద ఉన్న నీటిలో 97 శాతం ఉప్పు నీరే. తాగడానికి ఉపయోగపడే జలాలు కేవలం 1 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అందులో 0.86 శాతం చెరువులు, 0.02 శాతం నదులలో, మిగతా 0.12 శాతం భూగర్భజలాల రూపంలో ఉంది. ఈ వనరులే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 760 కోట్ల మందికి పైగా ఆహారాన్నీ, ఇతర అవసరాలనూ తీరుస్తున్నాయి. '2050 నాటికి ఈ భూమ్మీద తాగడానికి పుష్కలమయిన జలం ఉండనే వుండదు. జనం స్నానాలు చేయడం మానేసి శరీరానికి లేపనాలు పూసుకోవలసి ఉంటుంది. సరిహద్దులో వుండాల్సిన సైన్యం నీటి వనరుల చుట్టూ కాపలా కాస్తుంది...' అంటూ దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేయవచ్చు!

– ప్రొ౹౹ గనబోయిన మచ్చేందర్, జియాలజీ విభాగ అధిపతి, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, నల్లగొండ

ఇన్ బాక్స్

శాసనాధారాలను పరిశీలించాలి!

పవిత్ర గోదావరి సాగర సంగమం అంతర్వేది వద్ద వశిష్ఠుడు చేసిన యాగంలో ఉద్భవించిన పర'మార(కాలు)' రాజవంశం, పల్నాటి సీమ నేలిన పల్లవ (పల్లి) రాజవంశం, ఆర్బుద (నేటి మౌంట్ అబూ) పర్వతం వద్ద ఉద్భవించిన అగ్నికుల క్షత్రియ తదితర రాజ వంశాలన్నిటికీ మూల పురుషుడు రుద్ర వన్నియ మహారాజు. ఆయన 'ఫాల్గుణ మాసం, ఉత్తరా నక్షత్రం రోజున' జన్మించాడు. పరిమళ కాళిదాసు రచించిన నవ– సాహసాంక–చరిత మొదట ఈ విషయాన్ని పేర్కొంటే... తర్వాత కాలంలో చాంద్ బర్దాయి రచన 'పృథ్వీరాజ్–రాసో' అగ్నికుల క్షత్రియుల ఆవిర్భావం గురించి మరింత వివరిస్తుంది. ఆయన జన్మించిన రోజునే అగ్ని(వన్ని)కుల క్షత్రియ జాతి ఆవిర్భావ దినోత్సవంగా నిర్వహించుకుంటారు.

కల్నల్ మెకంజీ భద్రపరచిన 'పల్లికులం – బల్లి చోడులు' కైఫీయత్ పల్లవ (పల్లి) కులం అగ్నికుల క్షత్రియుల ప్రాచీన చరిత్ర గురించి మరింత సమాచారాన్ని అందిస్తుంది. పల్లవ (పల్లి) కులం ప్రాచీన చరిత్రను పరిశీలించిన బ్రిటిష్ కాలంలో ఉమ్మడి మద్రాస్ ప్రెసిడెన్సీ ప్రభుత్వం జారీ చేసిన జీవో. నం. 271/13-06-1929, తెలుగు ప్రాంతాలలో నివసిస్తున్న పల్లి, వన్నియర్స్‌ను అగ్నికుల క్షత్రియులు అనీ, తమిళనాడు ప్రాంతాలలో నివసిస్తున్న పల్లి, వన్నియర్స్‌ను వన్నికుల క్షత్రియులు అనీ అధికారికంగా పేర్కొంది.

సంస్కృత పదమైన పల్లవకు పల్లి ప్రాకృత పదమని విదేశీ, స్వదేశీ చరిత్రకారులెందరో తమ పరిశోధనలలో ఆధారాలతో నిరూపించారు. కానీ, కొందరు కుహనా చరిత్రకారులు పల్లి అంటే అదేదో హేళనాపదంగా వక్రీకరిస్తుంటే... తమ జాతి మూలాలను తామే తెలుసుకోలేని నిస్సహాయ స్థితిలోకి అగ్ని (వన్ని) కుల క్షత్రియులు నెట్టివేయబడుతున్నారు. రుద్ర వన్నియ మహారాజు జయంతిని తమిళనాడులోని అగ్ని (వన్ని) కుల క్షత్రియులు నేటికీ ఘనంగా నిర్వహిస్తున్నారు.

తెలుగులో శాసనాలు వేయడం, మహాభారతాన్ని తెలుగులోకి అనువదింపజేయడం ద్వారా సామాన్యులకు సైతం తెలుగు భాషను చేరువ చేసిన అగ్నికుల క్షత్రియ చక్రవర్తుల చరిత్ర చిక్కటి చీకటి కోణంలో నిక్షిప్తమైపోయింది. శాసన ఆధారాలను పరిశీలించి వీరి చరిత్రను బయటకు తీయవలసి ఉంది.

– చింతా శ్రీకృష్ణ బాబు, ఇబ్రహీంపట్నం, కృష్ణా జిల్లా

(నేడు రుద్ర వన్నియ మహారాజు జయంతి: అగ్ని(వన్ని)కుల క్షత్రియ జాతి ఆవిర్భావ దినోత్సవం)

ధాన్యం లేదంటే డబ్బులు ఇవ్వాల్సిందే!

మిల్లర్లకు కాంట్రాక్టు సంస్థల అల్టిమేటం

- క్వింటాలుకు రూ.2,259 లెక్కన ఇవ్వాలని స్పష్టీకరణ
- మిల్లర్ల నుంచి ధాన్యం వసూలుకు కాంట్రాక్టు సంస్థల వ్యూహం
- నిరుటి యాసంగి సీజన్‌లోని 35 ఎల్‌ఎంటీ ధాన్యం వేలం వేసిన సర్కార్
- బిడ్డింగ్‌లో ధాన్యం కొనుగోలు కాంట్రాక్టులు దక్కించుకున్న ఆరు సంస్థలు
- అయితే ఇప్పటికే ధాన్యం అమ్మేసుకున్న మిల్లర్లు
- దీంతో డబ్బులు అడుగుతున్న కాంట్రాక్టు సంస్థలు
- ఆందోళనలో మిల్లర్లు

ఇటీవల కరీంనగర్ జిల్లాలోని ఓ మిల్లు నుంచి గత సంవత్సరానికి సంబంధించి యాసంగి సీజన్‌లో ప్రభుత్వం ఇచ్చిన 10 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలను రికవరీ చేసుకునేందుకు ధాన్యం కాంట్రాక్టు పొందిన ఓ సంస్థ ప్రతినిధులు వెళ్లారు. తీరా అక్కడికి వెళితే మిల్లులో ధాన్యం నిల్వలు లేవు. మిల్లులో ఉన్న ధాన్యం చెడిపోతుందని అమ్మివేసినట్లు మిల్లర్ ఒప్పుకున్నాడు. దీంతో క్వింటాలుకు రూ. 2,259 లెక్కన 10 మెట్రిక్ టన్నులకు రూ. 2,25,900 చెల్లించాలని లెక్క చెప్పి వెళ్లారు.

సాక్షి, హైదరాబాద్: కొన్నేళ్లుగా సాఫీగా సాగిన ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ ప్రక్రియ ఇప్పుడు మిల్లర్లకు దడపుట్టిస్తోంది. గత సంవత్సరం యాసంగి సీజన్‌లో వచ్చిన ధాన్యాన్ని ముడిబియ్యంగా మిల్లింగ్ చేయలేమని రాష్ట్రంలోని మిల్లర్లంతా చేతులెత్తేయడంతో ఆగిపోయిన సీఎంఆర్ ప్రక్రియ ఇప్పుడు వారి మెడకే చుట్టుకుంది. కస్టమ్ మిల్లింగ్ చేయకుండా మిల్లుల్లోనే నిల్వ చేసిన ధాన్యం నుంచి 35 లక్షల మెట్రిక్ టన్నులను ప్రభుత్వం వేలం వేసి, బిడ్డింగ్‌లో పాల్గొన్న సంస్థలకు ధాన్యం కొనుగోలు కాంట్రాక్టులను అప్పగించింది. గన్నీ బ్యాగులతో కలిపి క్వింటాలుకు సగటున రూ. 2,007 లెక్కన ధాన్యం కాంట్రాక్టు పొందిన సంస్థలు తమకు కేటాయించిన జిల్లాల నుంచి ధాన్యం సేకరణకు శ్రీకారం చుట్టాయి. తీరా ప్రభుత్వం నుంచి



రిలీజింగ్ ఆర్డర్ తీసుకొని మిల్లులకు వెళితే అక్కడ ధాన్యం కనిపించడం లేదు. దీంతో మిల్లర్ల నుంచి క్వింటాలు ధాన్యానికి బదులుగా రూ. 2,259 లెక్కన డబ్బులు వసూలు చేయాలని కాంట్రాక్టు సంస్థలు నిర్ణయించాయి. ఈ మేరకు కార్యాచరణ ప్రారంభించడంతో మిల్లర్లు బెంబేలెత్తుతున్నారు.

వేలంలో 6 సంస్థలకు ధాన్యం అప్పగింత

2022–23 సంవత్సరం యాసంగిలో రాష్ట్రంలో 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో 20 ఎల్‌ఎంటీ ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ఆదేశాల మేరకు మిల్లర్లు సీఎంఆర్ కింద బాయిల్డ్ బియ్యంగా మిల్లింగ్ చేసి అప్పగించారు. మిగతా ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముడి బియ్యం (రా రైస్)గా సీఎంఆర్ అప్పగించాల్సి ఉండగా, మిల్లింగ్ చేయలేదు. దీంతో నిల్వ ఉన్న ధాన్యాన్ని గత ప్రభుత్వం వేలం వేయాలని ప్రయత్నించినా వీలుకాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 12 లాట్‌ల కింద వేలం వేశారు. రూ. 300 కోట్ల టర్నోవర్ కలిగిన సంస్థలకే వేలంలో పాల్గొనే అవకాశం ఇవ్వడంతో కేవలం ఏడు సంస్థలే బిడ్డింగ్‌లో పాల్గొన్నాయి. అందులో ఓ సంస్థ తిరస్కరణకు గురికాగా మిగతా ఆరు సంస్థలు ఈ బిడ్లను దక్కించుకున్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వ సంస్థలు కేంద్రీయ భండార్, నాకాఫ్ కూడా ఉన్నాయి. వేలంలో క్వింటాలు ధాన్యానికి సగటున రూ. 2,007 లెక్కన (గన్నీ బ్యాగులతో కలిపి) ప్రభుత్వానికి చెల్లించేలా బిడ్లు ఆమోదం పొందాయి. ఈ బిడ్డింగ్ ప్రక్రియకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలపడంతో సదరు సంస్థలు ధాన్యాన్ని మిల్లర్ల నుంచి రికవరీ చేసే ప్రక్రియను ప్రారంభించాయి.

గత యాసంగి సీజన్‌లో సీఎంఆర్ చేయకుండా నిల్వ చేసినట్లు మిల్లర్లు చెప్పినప్పటికీ, ఏ మిల్లర్ దగ్గరా సరిపడా ధాన్యం నిల్వలు లేవు. ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశం సందర్భంగా మిల్లర్లే ఒప్పుకున్నారు. తడిసిన, నిల్వ ఉంచిన ధాన్యం పాడైపోతుందనే కారణంగా చాలా వరకు విక్రయించినట్లు చెప్పారు. ఈ విషయాన్ని మంత్రి మీడియాకు కూడా చెప్పారు. అయితే మిల్లర్ల నుంచి ధాన్యాన్ని రికవరీ చేయాలనే ఆలోచనతో

ధాన్యం అమ్మేసుకున్న మిల్లర్లు..

ప్రభుత్వం వేలం ప్రక్రియ చేపట్టింది. ఈ మేరకు క్వింటాలుకు బిడ్డింగ్‌లో రూ.1,852 నుంచి 2,260 వరకు ధర పలికింది. సగటున క్వింటాలుకు రూ.1879 కాగా, రూ.125 గన్నీ బ్యాగుల కింద .. మొత్తంగా క్వింటాలుకు రూ. 2,007 చొప్పున లెక్క చూపారు. ఆయా సంస్థలు ఎంతకు ధాన్యం కొనుగోలు టెండర్లు దక్కించుకున్నాయనే విషయాన్ని పక్కనబెట్టి క్వింటాలు ధాన్యం ఇవ్వకపోతే, దాని బదులు రూ. 2,259 చెల్లించాలని అల్టిమేటం ఇస్తున్నట్లు పలువురు మిల్లర్లు తెలిపారు. సన్న ధాన్యం టెండరును క్వింటాలుకు రూ. 2,260కి దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ నిజామాబాద్, నల్లగొండ జిల్లాల నుంచి ధాన్యాన్ని రికవరీ చేసుకోవాల్సి ఉంది. మిల్లర్లు సన్న ధాన్యం ఇవ్వని పక్షంలో క్వింటాలుకు రూ.2,500కు పైగా వసూలు చేసే ఆలోచనలో ఆ సంస్థ ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఒక్కో జిల్లాలో 50 నుంచి 100 మెట్రిక్ టన్నుల ధాన్యం రికవరీకి కాంట్రాక్టు సంస్థలు ప్రభుత్వం నుంచి రిలీజింగ్ ఆర్డర్ పొందినట్లు చెపుతున్నారు.

సాగు నష్టాలు భరించలేక కౌలు రైతు ఆత్మహత్య



రాజారాం

గుడిహత్నూర్: వ్యవసాయంలో నష్టాలు భరించలేక కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ గ్రామానికి చెందిన కౌలు రైతు జాదవ్ రాజారాం (56) 16 ఎకరాల చేను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. గత ఖరీఫ్ సీజన్‌లో పత్తి పండించాడు. రబీలో కూరగాయలు సాగు చేస్తున్నాడు. ఆశించిన దిగుబడులు రాకపోగా నష్టాలు వస్తున్నాయని గత కొన్ని రోజులుగా దిగులుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం చేనుకు వెళ్లిన ఆయన కొట్టం వద్ద పడిఉండటంతో కుటుంబ సభ్యులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ 2 గంటల ప్రాంతంలో రాజారాం మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు న్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు.

పంట నష్టంపై వ్యవసాయశాఖ సర్వే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు జరిగిన పంట నష్టంపై వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు శనివారం నుంచి కామారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లో వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంట ప్రాంతాలను సందర్శించి పంట నష్టంపై సర్వే ప్రారంభించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలవుతున్నప్పటికీ పంట నష్టాన్ని లెక్కించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఇసుక కొరత ఉండొద్దు

గ్రామాల్లో స్థానిక అవసరాలకు ఉచిత అనుమతి

- జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక అవసరాలకు ఇసుక కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఆదేశాలు జారీ చేసింది. స్థానిక అవసరాలకు సరిపడే ఇసుక రవాణాకు అనుమతించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ శాఖ ముఖ్య కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా ఉత్తర్వులు జారీ చేశారు. తమ ఇళ్ల నిర్మాణాలు, స్థానిక అవసరాలకు ఇసుక రవాణాకోసం అనుమతి ఇవ్వాలని గ్రామీణుల నుంచి ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు అందాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో నిర్మాణాలకు ఆటంకం లేకుండా సమీపంలోని వాగులు, వంకల నుంచి ఇసుకను ఉచితంగా తీసుకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అవసరమున్న వారు ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా ఉచితంగా ఇసుకను తెచ్చుకునేందుకు అనుమతిస్తారు. అయితే నిబంధనలను ఉల్లంఘిస్తే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

గతంలోనూ వెసులుబాటు..

తెలంగాణ రాష్ట్ర ఇసుక వెలికితీత విధానం 2015 నిబంధనల ప్రకారం గతంలోనూ స్థానిక వనరుల నుంచి గ్రామాల్లో అవసరాలకు ఇసుకను తెచ్చుకోవడానికి వెసులుబాటు కల్పించారు. అయితే విచ్చలవిడి ఇసుక వెలికితీతతో భూగర్భ జల వనరులు దెబ్బతింటాయనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం స్థానిక అవసరాల కోసం ఇసుక వెలికితీత, రవాణాపై కఠినంగా వ్యవహరించడంతోపాటు ఇసుక వెలికితీత, అనుమతుల బాధ్యతను స్థానిక తహసీల్దార్లు, గ్రామపంచాయతీలకు అప్పగించింది. ఇసుక వెలికితీతకు అనువైన ప్రాంతాలను గుర్తించేందుకు రెవెన్యూ, భూగర్భ జల వనరులు, పంచాయతీ విభాగాలతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి అనుమతులు తప్పనిసరి చేసింది. మరోవైపు స్థానిక అవసరాలకు ఉపయోగించే ఇసుకకు కూడా డబ్బులు చెల్లించాలనే విధానాన్ని అనుసరించింది. అయితే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం ఇకపై స్థానిక అవసరాల కోసం ఎలాంటి అనుమతులు లేకుండా డబ్బు చెల్లించకుండానే ఇసుకను తీసుకు వెళ్లడానికి అవకాశం ఏర్పడుతుంది.

‘ట్యాపింగ్’లో మరో ఇద్దరు అదనపు ఎస్పీలు!

- ఎస్‌ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు టీమ్‌లో పనిచేసిన అధికారులను ప్రశ్నించిన సిట్
- కీలక సమాచారం సేకరించినట్టు చెప్తున్న అధికార వర్గాలు



రాధాకిషన్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబీ) కేంద్రంగా సాగిన అక్రమ ట్యాపింగ్ వ్యవహారం కేసులో సిట్ వేగం పెంచింది. ఎస్‌ఐబీకి చీఫ్‌గా వ్యవహరించిన ఓఎస్డీ టి.ప్రభాకర్‌రావు బృందంలో పనిచేసిన మరి కొందరు అధికారులను శుక్ర, శనివారాల్లో ప్రశ్నించింది. అదనపు ఎస్పీ తిరుపతన్న శనివారం సిట్ ఎదుట హాజరుకాగా.. మరో అదనపు ఎస్పీ భుజంగ్‌రావును అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా పది ప్రాంతాల్లో ఈ వ్యవహారంతో సంబంధమున్న వారి నివాసాల్లో ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి.

ఫోన్లతో మొదలుపెట్టి..

నిఘా విభాగాలు జాతీయ భద్రతతోపాటు రాజద్రోహం తదితర అంశాలపైనా కన్నేసి ఉంచడానికి ట్యాపింగ్ చేస్తుంటాయి. అలా నిఘా అధికారులు చేసిన ఫోన్ ట్యాపింగ్ కారణంగానే 2015 నాటి ‘ఓటుకు కోట్లు’ వ్యవహారం వెలుగు లోకి వచ్చినట్టు సమాచారం. అయితే ప్రభాకర్ రావు ఎస్‌ఐబీ చీఫ్‌గా మారిన తర్వాత ట్యాపింగ్ దుర్వినియోగం కావడం మొదలైంది. తొలినాళ్ల లో ఈ విభాగం నిబంధనల ప్రకారమే అవసర మైన ఫోన్లను ట్యాప్ చేసింది. దీనివల్ల ఒనగూరుతున్న లాభాలు తెలిసిన రాజకీయ నాయకులు వీలైనన్ని నంబర్లను అక్రమంగా ట్యాప్ చేసేలా ప్రేరేపించారు. దీనికోసం విదేశాల నుంచి ఉపకరణాలు, సాఫ్ట్‌వేర్లు అక్రమంగా దిగుమతి అయ్యాయి. 2018 ఎన్నికల నాటి నుంచి వీరి ట్యాపింగ్ పంథా మారిపోయింది. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల నేపథ్యంలో ఫోన్లతోపాటు సోషల్ మీడియాను ట్యాప్ చేయడం మొద లెట్టారు. దీనికోసం టెక్నాలజీ కన్సల్టెంట్ రవి పాల్ సహకారంతో ఇజ్రాయిల్ నుంచి పెగాసిస్ తరహా సాఫ్ట్‌వేర్ తెప్పించుకుని విని యోగించినట్టు సమాచారం.

‘ట్యాపింగ్’ ఆధారంగా వసూళ్లు!

కొన్నాళ్లుగా ప్రభాకర్‌రావుతోపాటు మరో ఇద్దరు ఉన్నతాధికారులు, ఓ రాజకీయ నాయకుడు కలసి బెదిరింపుల దందాకు దిగారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు, వ్యాపారులు, బిల్డర్లు, ఇన్‌ఫ్రా కంపెనీల యజమానుల ఫోన్లను ట్యాప్ చేశారు. దీనికోసం హైదరాబాద్‌లోని పర్వతగిరి, వరంగల్, సిరిసిల్లలోనూ వార్ రూమ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ప్రణీత్‌రావు, ఎస్‌ఐబీ, ఇంటెలిజెన్స్‌లలో పనిచేసిన ఇద్దరు అధికారులు, మరికొందరు బృందంతో కలసి ఆ ట్యాపింగ్స్‌లోని అంశాలను విశ్లేషించేవారు. కీలక అంశాలను పట్టుకుని.. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లకు చెందిన ప్రత్యేక విభాగాల్లో పనిచేసే కొందరి దృష్టికి తీసుకువెళ్లేవారు. వారు సదరు రాజకీయ నాయకుడితోపాటు ప్రభాకర్‌రావు నుంచి క్లియరెన్స్ తీసుకుని.. సదరు టార్గెట్ల నుంచి వీలైనంత వరకు వసూళ్లు చేసేవారు. అప్పట్లో ఈ మూడు ప్రత్యేక విభాగాలకు నేతృత్వం వహించిన అధికారులు.. నాటి ప్రభుత్వంతోపాటు ప్రభాకర్‌రావుతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నవారేనని సమాచారం. కొన్ని వసూళ్ల వ్యవహారాలను ఓ ఎంపీ, ఎమ్మెల్సీ సూచనలతోనూ కొనసాగించినట్టు సమాచారం.

అమెరికా వెళ్లిపోయిన ఆ ఇద్దరు..: డీఎస్పీ ప్రణీత్‌రావుపై సస్పెన్షన్ వేటు పడగానే ఎస్‌ఐబీ మాజీ ఓఎస్డీ టి.ప్రభాకర్‌రావు దేశం దాటేశారు. ఈ వ్యవహారంపై పంజగుట్ట ఠాణాలో కేసు నమోదై, ప్రణీత్‌రావును అరెస్టు చేశాక హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం వీరిద్దరూ అమెరికాలో ఫార్మా కంపెనీ నిర్వహించే తమ సన్నిహితుడి వద్ద ఆశ్రయం పొందుతున్నట్టు సమాచారం.

విచారణలో కీలక అంశాలు..

సిట్ అధికారులు శుక్ర, శనివారాల్లో అదనపు ఎస్పీలు తిరుపతన్న, భుజంగ్‌రావులను విచారించారు. ప్రభాకర్‌రావు హయాంలో తిరుపతన్న ఎస్‌ఐబీలో, భుజంగ్‌రావు సాధారణ ఇంటెలిజెన్స్‌లో పొలిటికల్ వింగ్‌ను పర్యవేక్షించారు. వీరి నుంచి సిట్ అధికారులకు ట్యాపింగ్‌కు సంబంధించి కీలక సమాచారం లభించినట్టు తెలిసింది. ఇక ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావుతోపాటు అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన ఇతరుల నివాసాలు కలిపి మొత్తం 10 చోట్ల సిట్ అధికారులు శనివారం సోదాలు చేశారు.

నాలుగైదు నెలల ముందు నుంచే డేటా ధ్వంసం

నిందితుడు ప్రణీత్‌రావు, అనుమానితుల విచారణ, సేకరించిన ఆధారాలన్నింటినీ విశ్లేషించినా ప్రభాకర్‌రావు బృందం ఎందరి ఫోన్లను ట్యాప్ చేసిందనేది చెప్పలేకపోతున్నామని సిట్ అధికారి ఒకరు పేర్కొన్నారు. రాజకీయ అవసరాలు, బెదిరింపులు, బలవంతపు వసూళ్ల కోసం ఎస్‌ఐబీ కేంద్రంగా ఫోన్ల ట్యాపింగ్ జరిగిందని.. ఆ డేటాను కొందరు ప్రైవేట్ వ్యక్తులకూ కాపీ చేసి ఇచ్చారని తెలుస్తోందని తెలిపారు. ప్రణీత్‌రావు తదితరులు గత ఏడాది సెప్టెంబర్–అక్టోబర్ నుంచే డేటాను ధ్వంసం చేయడం మొదలెట్టారని.. డిసెంబర్ 4 రాత్రి హార్డ్‌డిస్క్‌ల ధ్వంసం అందులో భాగమేనని సమాచారం. హార్డ్‌డిస్క్‌లతో పాటు హ్యాకింగ్ ఉపకరణాలు, సాఫ్ట్‌వేర్లనూ ధ్వంసం చేశారా? అనేది తేలాల్సి ఉంది.

కడెం ప్రాజెక్టును పరిశీలించిన అధికారుల బృందం



వరద గేటు రోప్‌లను పరిశీలిస్తున్న అధికారులు

కడెం: నిర్మల్ జిల్లా కడెం మండలంలోని కడెం ప్రాజెక్టును మెకానికల్, సెంట్రల్ డిజైన్ ఆఫీసర్స్ (సీడీవో), క్వాలిటీ కంట్రోల్ అధికారుల బృందం శనివారం పరిశీలించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ప్రాజెక్టు వరద గేట్ల మరమ్మతుకు రూ.5.46 కోట్లు విడుదల చేయగా, చేపట్టాల్సిన పనులపై అధ్యయనం చేశారు. ప్రతి వరద గేటు కౌంటర్ వెయిట్‌కు రెండు రోప్ పుల్లీల ఏర్పాటు, కొన్ని వరద గేట్ల కౌంటర్ వెయిట్‌ల మార్పు, రోలర్స్ మార్పునకు నిర్ణయించారు. అనంతరం ప్రాజెక్టు మరమ్మతులను సీఈ శ్రీనివాస్, ఎస్‌ఈ సుశీల్‌కుమార్ పరిశీలించారు. వీరి వెంట మెకానికల్ టీం ఎస్‌ఈ రాజమ్మ, బృందం సభ్యులు మురళీకృష్ణ, విద్యానంద్, ప్రాజెక్ట్ ఈఈ విఠల్, డీఈ భోజదాసు, ఏఈఈలు, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

‘ఆటోమేటిక్’ హిట్

యూటీఎస్, ఆటోమేటిక్ మెషిన్‌లకు రైల్వేలో అనూహ్య ఆదరణ

- ప్రతి రోజు 44 శాతం సాధారణ టిక్కెట్ల విక్రయాలు
- కౌంటర్ల వద్ద తగ్గిన ప్రయాణికుల రద్దీ
- హైదరాబాద్ నుంచి సుమారు 2 లక్షల మందికి పైగా ప్రయాణం



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేలో ఆటోమేటిక్, యూటీఎస్ యాప్ టిక్కెట్ విక్రయాలకు అనూహ్యమైన ఆదరణ లభిస్తోంది. ప్రతి రోజు లక్షలాది మంది ప్రయాణికులు ఈ సదుపాయాలను వినియోగించుకుంటున్నారు. సాధారణ టిక్కెట్ విక్రయాల కోసం దక్షిణమధ్య రైల్వే అన్‌రిజర్వ్‌డ్ టిక్కెట్ సిస్టమ్‌తో పాటు, ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. రైల్వేస్టేషన్‌లలో టిక్కెట్ కౌంటర్ల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయవలసిన అవసరం లేకుండా డిజిటల్ చెల్లింపుల ద్వారా టిక్కెట్‌లను కొనుగోలు చేసేందుకు యూటీఎస్ దోహదం చేస్తుంది. అలాగే ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ (ఏటీవీఎం) యంత్రాల వద్ద కూడా సాధారణ టిక్కెట్‌లను కొనుగోలు చేయవచ్చు. దక్షిణమధ్య రైల్వేలో ప్రతి రోజు 44 శాతం టిక్కెట్‌లు ఈ రెండు విధానాల్లోనే కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. మొబైల్ ఫోన్‌లలో యూటీఎస్ యాప్‌ను కలిగిన ప్రయాణికులు తమ ప్రయాణానికి అరగంట ముందు కూడా టిక్కెట్‌లను కొనుగోలు చేయవచ్చు. దూరప్రాంత రైళ్లలో రిజర్వేషన్ టిక్కెట్‌లు మినహా అన్ని జనరల్ టిక్కెట్‌లను కొనుగోలు చేయవచ్చు.అలాగే ప్లాట్‌ఫాం టిక్కెట్‌లు, ఎంఎంటీఎస్ టిక్కెట్‌లు కూడా యూటీఎస్, ఏటీవీఎంల ద్వారా కొనుగోలు చేసే సదుపాయం ఉంది.

పేపర్‌లెస్ జర్నీ....

ప్రయాణికుల సేవలపైన చెల్లింపులపైన దక్షిణమధ్య రైల్వే దశలవారీగా డిజిటలైజేషన్ చేపట్టింది.ఈ క్రమంలోనే అన్ని ప్రధాన స్టేషన్‌లలో ఏటీవీఎంలు, యూటీఎస్ యాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. నగరంలోని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి, బేగంపేట్, హైటెక్‌సిటీ, తదితర స్టేషన్‌ల నుంచి ప్రతి రోజూ సుమారు 3 లక్షల మందికి పైగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు.రిజర్వేషన్‌లపై దూరప్రాంతాలకు బయలుదేరే సుమారు లక్ష మంది ప్రయాణికులను మినహాయిస్తే 2 లక్షల మంది సాధారణ ప్రయాణికుల్లో 75 శాతం వరకు డిజిటల్ సేవలను వినియోగించుకుంటున్నట్లు అంచనా. సంక్రాంతి, దసరా,దీపావళి, క్రిస్మస్ వంటి పండుగ రోజులు, వేసవి సెలవులు, వరుస సెలవుల్లో జనరల్ బోగీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది.అలాంటి రద్దీ వేళల్లో కౌంటర్‌ల నుంచి టిక్కెట్‌లు కొనుగోలు చేయడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకొని ఉంటుంది, ప్రయాణికులు టిక్కెట్‌ల కోసం లైన్‌లలో గంటలకొద్దీ వేచి ఉండవలసి వస్తుంది. ఈ క్రమంలో యూటీఎస్, ఏటీవీఎం సదుపాయాలను అందుబాటులోకి తేవడం వల్ల కౌంటర్‌ల వద్ద రద్దీ గణనీయంగా తగ్గినట్లు అధికారులు చెప్పారు.‘రైల్వేలో అన్ని దశల్లో పేపర్‌లెస్ సేవలను ప్రోత్సహిస్తున్నాం.ప్రయాణికులు ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి గమ్యానికి చేరుకొనేవరకు పేపర్‌లెస్ జర్నీ కొనసాగించాలనేది మా లక్ష్యం.’ అని దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ తెలిపారు. 147 ప్రధాన స్టేషన్లలో ప్రస్తుతం 300కు పైగా ఏటీవీఎంలు ఉన్నట్లు పేర్కొన్నారు.ఈ మెషీన్లు టచ్ స్క్రీన్ ఆధారంగా పని చేస్తాయి.స్మార్ట్ కార్డ్‌ల ద్వారా లేదా స్క్రీన్‌పై ప్రదర్శించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా టిక్కెట్‌లను కొనుగోలు చేయవచ్చు.’ అని చెప్పారు.ఏటీవీఎంల వద్ద సలహాదారులు కూడా అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

సబర్బన్ స్టేషన్లలో ఎంతో సదుపాయం...

సబర్బన్ స్టేషన్ల నుంచి యూటీఎస్ యాప్ సేవలను వినియోగించుకోవచ్చు. ప్రయాణికులు సమీపంలోని స్టేషన్ ప్రాంగణంలో ఉన్నట్లయితే, స్టేషన్‌లోని నిర్దిష్ట క్యూ ఆర్ కోడ్‌ని స్కాన్ చేయడం ద్వారా కూడా టిక్కెట్‌లను కొనుగోలు చేయవచ్చు.ఈ యూటీఎస్ బహుళ భాషా సదుపాయాన్ని కలిగి ఉంటుంది.ఈ మొబైల్ ద్వారా అన్ రిజర్వ్‌డ్, జర్నీ టిక్కెట్లు, ప్లాట్‌ఫారమ్,సీజన్ టిక్కెట్‌లను కొనుగోలు చేయవచ్చు.ప్రయాణికులు క్యూలో వేచి ఉండకుండా అన్‌రిజర్వ్‌డ్ టిక్కెట్‌లను కొనుగోలు చేయడానికి ఏటీవీఎంలు, యూటీఎస్ యాప్‌లను వినియోగించుకోవాలని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ సూచించారు. వేసవి రద్దీ దృష్ట్యా ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రమాద సంకేతాల విస్మరణతోనే నష్టమా?

కాళేశ్వరం బ్యారేజీలు దెబ్బతినడంపై నీటిపారుదల శాఖకు అయ్యర్ కమిటీ ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు 2019 వానాకాలం తర్వాత ప్రమాద సంకేతాలు ఇచ్చినా.. నివారణ చర్యలు తీసుకోకపోవడంతోనే నష్టాన్ని పెంచిందా? అని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ నీటి పారుదల శాఖను ప్రశ్నించింది. మూడు బ్యారేజీలను ప్రారంభించిన కొద్దిరోజులకే వాటి దిగువన రక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్లింత్ శ్లాబు, సీసీ బ్లాకులు, టోయ్ వాల్, లాంచింగ్ అప్రాన్ వంటివి ఎందుకు కొట్టుకుపోయాయని నిలదీసింది. ఇటీవల మూడు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించిన అయ్యర్ కమిటీ.. నీటి పారుదలశాఖలోని అన్ని విభాగాలతో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించింది. తిరిగి వెళ్లేప్పుడు ఒక ప్రశ్నావళిని అందించి, సీల్డ్ కవర్‌లో సమాధానాలు అందజేయాలని కోరింది.

ప్రమాదం పొంచి ఉంటే ఏం చేశారు?

బ్యారేజీలకు ప్రమాదాలు పొంచి ఉన్నట్టు/నష్టాలు జరిగినట్టు గుర్తించిన సమాచారాన్ని వరుస క్రమంలో తెలుపుతూ సమగ్ర నివేదిక సమర్పించాలని అయ్యర్ కమిటీ కోరింది. ‘‘ప్రమాదాలు పొంచి ఉన్నట్టు గుర్తించినప్పుడు తీసుకున్న చర్యలేమిటి? నిర్మాణ సంస్థలకు జారీచేసిన ఆదేశాలేమిటి? తక్షణమే నిర్మాణ సంస్థలు మరమ్మతులు నిర్వహించాయా? వంటి వివరాలు నివేదికలో ఉండాలి. ముందు జాగ్రత్త చర్యలేమైనా తీసుకుని ఉంటే తెలపాలి. తీసుకోకపోతే కారణాలు వెల్లడించాలి. బ్యారేజీలలో ఏదైనా అసాధారణ మార్పును గుర్తించిన సందర్భాల్లో పరికరాల డేటా నమోదు, విశ్లేషణ, అన్వయింపు(డేటా ఇంటర్‌ప్రిటేషన్), వాటి ఆధారంగా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసే విభాగం ఏది? దీనికోసం ఎలాంటి ప్రొటోకాల్స్‌ను అనుసరిస్తున్నారు?’’ అని ప్రశ్నించింది.

జరిగిన తప్పులేమిటి? చేసింది ఎవరు?

నీటి పారుదల శాఖలోని వివిధ విభాగాల పనితీరు, సమన్వయాన్ని అర్థం చేసుకోవడానికి శాఖ మౌలిక స్వరూపం వివరాలను అయ్యర్ కమిటీ కోరింది. బ్యారేజీల నిర్మాణంలో జరిగిన లోటుపాట్లకు బాధ్యులను తేల్చడానికి ఈ సమాచారం కీలకమని పేర్కొంది. శాఖలోని అన్ని విభాగాల ఈఎన్‌సీల నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి వరకు ఉన్న అధికారుల క్రమాన్ని తెలిపేలా శాఖ ఆర్గనైజేషన్ చార్ట్‌ను సమర్పించాలని కమిటీ కోరింది. ‘‘ఈఎన్‌సీ (జనరల్), హైడ్రాలజీ అండ్ ఇన్వెస్టిగేషన్, సీడీఓ, ప్రాజెక్ట్ కన్‌స్ట్రక్షన్, క్వాలిటీ కంట్రోల్ అండ్ ఇన్‌స్పెక్షన్, ఓ అండ్ ఎం, ఇతర విభాగాల బాధ్యతలు, విధులు వివరించండి. బ్యారేజీల నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) చీఫ్ ఇంజనీర్, రామగుండం చీఫ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ అండ్ ఇన్‌స్పెక్షన్ విభాగం చీఫ్ ఇంజనీర్, ఈఎన్‌సీ (ఓఅండ్‌ఎం)లు తమపై అధికారిగా ఎవరికి రిపోర్ట్ చేస్తారు?’’ అని ప్రశ్నించింది.

సీడీఓ, క్వాలిటీ సలహాలను పాటించారా?

‘‘సీడీఓ, క్వాలిటీ కంట్రోల్ అండ్ ఇన్‌స్పెక్షన్ విభాగాలు ఇచ్చే సలహాలు/ఆదేశాలకు ప్రాజెక్టుల కన్‌స్ట్రక్షన్ విభాగం కట్టుబడి ఉంటుందా? బ్యారేజీల గేట్లను ఎత్తే సమయం (ఆపరేషన్ షెడ్యూలింగ్)ను నిర్ణయించడంలో బాధ్యులు ఎవరు? ఈ విషయంలో సీడీఓ/ తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ల్యాబ్(టీఎస్‌ఈఆర్‌ఎల్)ల సలహాను ఏమైనా ఉల్లంఘించారా?’’ అని కమిటీ ప్రశ్నించింది. ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘాని (సీడబ్ల్యూసీ)కి సమర్పించడానికి ముందు దాని రూపకల్పన సీడబ్ల్యూసీ మార్గదర్శకాలకు అనుగుణంగా జరిగేలా పర్యవేక్షణ చేసే విభాగం ఏది? దానికోసం నీటిపారుదల శాఖలో ఎలాంటి ప్రొటోకాల్స్ ఉన్నాయో తెలపాలని కోరింది.

బ్యారేజీలు నీటి మళ్లింపు కోసమా? నిల్వ కోసమా?

మూడు బ్యారేజీలను నీటి నిల్వ అవసరాలను దృష్టిలో పెట్టుకుని డిజైన్, నిర్మాణం చేశారా? లేక నీటి మళ్లింపు అవసరాలను దృష్టిలో పెట్టుకుని జరిపారా? అని అయ్యర్ కమిటీ ప్రశ్నించింది. బ్యారేజీలను ప్రారంభించిన నాటి నుంచి నిల్వ స్థాయిలను నెలవారీగా తెలియజేసే నివేదికను సమర్పించాలని కోరింది. బ్యారేజీలకు తనిఖీలు, మరమ్మతులు, నిర్వహణ పనుల కోసం ఎప్పుడైనా నిల్వలను తగ్గించారా? చేస్తే వివరాలు అందించాలని సూచించింది. బ్యారేజీల నిర్మాణ ప్రారంభం, ముగింపు తేదీలను అందించాలని.. డీపీఆర్‌ల ప్రకారం బ్యారేజీల విశిష్టతల(సేలియంట్ ఫీచర్స్)ను తెలిపాలని పేర్కొంది. నిర్మాణంలో ఈ విశిష్టతలను పాటించారా? అని ప్రశ్నించింది. బ్యారేజీల నిర్మాణానికి అనుమతిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలను సమర్పించాలని కోరింది.



లోపాలు, పునరుద్ధరణ పనులపై మీ అభిప్రాయమేంటి?

‘‘మేడిగడ్డ బ్యారేజీ ర్యాఫ్ట్, పియర్లు కుంగిపోవడానికి కారణాలేమిటి? బ్యారేజీల పునాదుల కింద ఇసుక కొట్టుకుపోయి సీపేజీ జరగడానికి కారణాలేమిటి? వచ్చే వర్షాకాలంలో బ్యారేజీలకు మరింత నష్టం జరగకుండా రక్షించడానికి తీసుకోవాల్సిన చర్యలు ఏమిటో వివరించండి’’ అని నీటి పారుదల శాఖను అయ్యర్ కమిటీ కోరింది. ఈ ప్రశ్నావళి మేరకు తగిన సమాధానాలను సిద్ధం చేస్తున్నట్టు నీటి పారుదల శాఖ వర్గాలు వెల్లడించాయి.

సీడబ్ల్యూసీ అభ్యంతరాలను పరిష్కరించారా?

డీపీఆర్ మదింపు సందర్భంగా సీడబ్ల్యూసీలోని వివిధ డైరెక్టరేట్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలు ఏమిటి? సీఎస్ఎంఆర్ఎస్, జీఎస్ఐ, సీజీడబ్ల్యూబీ వంటి ఇతర సంస్థల కామెంట్లు/ అబ్జర్వేషన్లు ఏమిటి? వాటిని తగిన రీతిలో పరిష్కరించారా? అని అయ్యర్ కమిటీ కోరింది.

నిర్మాణ దశ డిజైన్లు ఎవరివి?

నిర్మాణ దశలో మూడు బ్యారేజీల డిజైన్లు, బ్యారేజీల వివిధ విభాగాల డ్రాయింగ్స్‌ను రూపొందించింది ఎవరని కమిటీ ప్రశ్నించింది. బ్యారేజీల నిర్మాణానికి ప్రత్యామ్నాయ ప్రాంతాల ఎంపిక కోసం జరిపిన అధ్యయనాలు, ప్రస్తుత ప్రాంతాల ఎంపికను సమర్థించే కారణాలు, బ్యారేజీల కింద భూగర్భంలో నీటి ప్రవాహంపై చేసిన అంచనాల వివరాలను ఇవ్వాలని కోరింది. లోపాలు బహిర్గతమైన తర్వాత బ్యారేజీలకు నిర్వహించిన సబ్‌సర్ఫేస్ జియోలాజికల్ పరీక్షల నివేదికలు సమర్పించాలని సూచించింది.

మాస్కోలో మారణహోమం

క్రాకస్ హాల్ కాల్పుల్లో 133కు చేరిన మృతులు

- మరో 120 మంది చావుబతుకుల్లో
- తమ పనేనని ప్రకటించిన ఐసిస్(ఖోరసాన్)
- ఉక్రెయిన్ హస్తం ఉందన్న రష్యా
- 11 మంది అనుమానితుల అరెస్టు
- ఉక్రెయిన్‌కు పారిపోతూ పట్టుబడిన నలుగురు


మాస్కోలోని క్రాకస్ సిటీ హాల్ నుంచి ఎగసి పడుతున్న అగ్ని కీలలు

మాస్కో/న్యూఢిల్లీ: రష్యా రాజధాని మాస్కోలో క్రాకస్ సిటీ హాల్‌లో చోటుచేసుకున్న మారణహోమంలో మృతుల సంఖ్య శనివారం 133కు పెరిగింది. శుక్రవారం అర్ధ రాత్రి సంగీత కచేరి జరుగుతుండగా ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి అమాయక ప్రజల ప్రాణాలను బలి తీసుకోవడం తెలిసిందే. ఈ దారుణంలో 120 మందికి పైగా గాయపడ్డారు. వారిలో చాలామంది తీవ్ర గాయాలతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి 11 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నలుగురు దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని రష్యా ఇన్వెస్టిగేటివ్ కమిటీ వెల్లడించింది. వారిని పారిపోతుండగా పశ్చిమ రష్యాలోని బ్రియాన్స్క్‌లో ఉక్రెయిన్ సరిహద్దు సమీపంలోనే బంధించినట్లు తెలిపింది. సరిహద్దు దాటి ఉక్రెయిన్ చేరాలన్న పన్నాగాన్ని భగ్నం చేసినట్లు స్పష్టం చేసింది. ఈ దాడికి పాల్పడింది తామేనని అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్(ఖోరసాన్) ప్రకటించిన సంగతి తెలిసిందే. రష్యా అధికారులు మాత్రం ఇది ముమ్మాటికీ ఉక్రెయిన్ ముష్కరుల పనేనని ఆరోపిస్తున్నారు. కాల్పులకు తెగబడింది ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులేనని అమెరికా నిఘా వర్గాలు ధ్రువీకరిస్తున్నాయి. తాజా పరిణామాలపై రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసెస్ చీఫ్ శనివారం రష్యా అధినేత పుతిన్‌తో సమావేశమయ్యారు. అనుమానితుల అరెస్టు తదితరాల గురించి తెలియజేశారు. రష్యాలో ఇటీవల జరిగిన జాతీయ ఎన్నికల్లో పుతిన్ మరోసారి ఘన విజయం సాధించి ఆరేళ్లపాటు అధికారం దక్కించుకున్నారు. కొన్ని రోజులకే మాస్కోలో భీకర దాడి జరగడం, 133 మంది మరణించడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయంగా మారింది.

మోదీ దిగ్భ్రాంతి

మాస్కో ఘోరకలిపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ అమానుష దాడిని భారత్ ఖండిస్తోందని పేర్కొన్నారు. విపత్కర సమయంలో రష్యా ప్రజలకు అండగా ఉంటామంటూ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఉక్రెయిన్‌కు సంబంధం ఉంది: పుతిన్

కాల్పుల ఘటనతో ఉక్రెయిన్‌కు సంబంధం ఉందని పుతిన్ ఆరోపించారు. దేశవ్యాప్తంగా భద్రతను పటిష్టం చేసినట్లు తెలిపారు. పట్టుబడిన దుండుగుల్లో నలుగురు వ్యక్తులు ఈ దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని చెప్పారు. కాల్పుల తర్వాత వారు ఉక్రెయిన్‌కు పారిపోయేందుకు ప్రయత్నించారని అన్నారు.

మా పని కాదు: ఉక్రెయిన్

రష్యా కాల్పులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సలహాదారుడైన మైఖైలో పొడొలాయిక్ స్పందించారు. మాస్కో మారణహోమంతో తమకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. ఉగ్రవాద పద్ధతులను పాటించే అలవాటు ఉక్రెయిన్‌కు లేదన్నారు.



క్రాకస్ హాల్‌లో సాయుధ దుండగులు



క్రాకస్ సిటీ హాల్‌లో కాల్పులు జరుపుతున్న దుండగులు

పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చేశారు

- కాల్పులు జరిగిన క్రాకస్ సిటీ హాల్ చాలా విశాలమైన కాంప్లెక్స్. ఇందులో మ్యూజిక్ హాల్‌తోపాటు షాపింగ్ సెంటర్ ఉంది.
- శుక్రవారం రాత్రి సంగీత కచేరి ప్రారంభం కావడానికి ముందు జనం సీట్లలో కూర్చున్నారు. మొత్తం 6,200 సీట్లూ నిండిపోయాయి.
- సంగీత కార్యక్రమం ప్రారంభం కాకముందే కాల్పుల మోత మొదలైనట్లు వీడియో ఫుటేజీని బట్టి తెలుస్తోంది.
- సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు ఆటోమేటిక్ రైఫిళ్లతో విరుచుకుపడ్డారు. ఉన్మాదుల్లాగా చెలరేగిపోయారు. జనంపై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో గురిపెట్టి కాల్పులు జరిపారు. తూటా నుంచి రక్షణ కోసం పలువురు సీట్ల వెనుక దాక్కున్న దృశ్యాలు రికార్డయ్యాయి.
- అరుపులు కేకలతో గందరగోళం నెలకొంది. చాలామంది బయటకు పరుగులు తీసేందుకు ప్రయత్నించారు. తొక్కిసలాట జరిగింది. హాల్ కిక్కిరిసి ఉండడంతో తప్పించుకునే వీల్లేకుండా పోయింది. మృతుల సంఖ్య భారీగా పెరిగింది. లోపలంతా పొగ అలుముకుంది.
- ముష్కరులు గ్రెనేడ్లు, బాంబులు కూడా వేసినట్టు రష్యా మీడియా వెల్లడించింది. కాల్పులు, పేలుళ్ల ధాటికి హాల్‌లో మంటలు రేగాయి. పైకప్పు కూలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు.

ఒకే ఒక్కరు!

- చరిత్రలో తొలిసారిగా ఓ మహిళ విజయకేతనం
- 100 మైళ్ల మారథాన్ రేసులో అరుదైన ఘనత సాధించిన జాస్మిన్ ప్యారిస్


మారథాన్ ఫినిషింగ్ లైన్‌ను తాకాక అక్కడే అలసి పడిపోయిన జాస్మిన్

100 మైళ్ల దూరం.. 60 గంటల వ్యవధి. మధ్యలో ఎవ్వరూ మనకు సాయపడరు. పరుగెత్తుతూనే ఉండాలి. ట్రెజర్ హంట్ తరహాలో అక్కడక్కడా ఉన్న పుస్తకాలను వెతికి పట్టుకుంటూ పరుగు ఆపకుండా గమ్యం దిశగా దూసుకెళ్లాల్సిందే. మారథాన్‌లో భాగంగా పార్క్ చుట్టూతా మొత్తంగా దాదాపు 60,000 అడుగుల ఎత్తును ఎక్కి దిగాలి. అలసటతో ఆగితే ఔటే ఇక. దృఢ శరీరం మాత్రమే కాదు అంతకుమించిన మనో సంకల్పం తోడుంటేనే మారథాన్‌లో జయకేతనం ఎగరేయగలం. ప్రపంచంలోనే అత్యంత కఠోరమైన మారథాన్‌లలో ఒకటిగా పేరొందిన ప్రతిష్టాత్మక బాక్లీ మారథాన్స్‌లో పురుషులకు దీటుగా మొట్టమొదటిసారిగా ఒక అతివ ఈ రేసులో గెలిచి అబ్బురపరిచింది. అమెరికాలోని టెన్నిస్సీ రాష్ట్రంలోని ఫ్రెజెన్ హెడ్ స్టేట్ పార్క్ ఈ మారథాన్‌కు వేదికైంది. బ్రిటన్‌కు చెందిన జాస్మిన్ ప్యారిస్ అనే 40 ఏళ్ల వెటర్నరీ వైద్యురాలు ఈ ఫీట్ సాధించి చరిత్రలో నిలిచిపోయారు. 55 మైళ్లుగా ఉన్న మారథాన్‌ను 1989 సంవత్సరంలో 100 మైళ్లకు పెంచాక ఇన్నేళ్లలో నిర్ణీత గడువులోగా మారథాన్‌ను కేవలం 20 మంది మాత్రమే పూర్తిచేయగలిగారు. వీరిలో జాస్మిన్ ప్యారిస్ ఒక్కరే మహిళ కావడం విశేషం. మారథాన్‌ను 60 గంటల్లోపు పూర్తిచేయాల్సి ఉండగా ఇంకా 99 సెకన్లు ఉండగానే ఆమె విజయతీరాన్ని తాకారు. 59 గంటల 58 నిమిషాల 21 సెకన్లలో జాస్మిన్ ఈ రేసును శుక్రవారం పూర్తిచేశారు. రాత్రంతా సరైన దారీతెన్నూ లేకున్నా ముళ్లు, పొదల గుండా పరుగెడుతూ ఫినిషింగ్ లైన్‌ను చేరుకున్న జాస్మిన్‌ను వేలాది మంది ఔత్సాహికులు తమ హర్షధ్వానాలతో ఉత్సాహపరిచారు. ఈ సంవత్సరం 20 మంది బరిలో దిగగా జాస్మిన్‌తో కలిపి మొత్తంగా కేవలం ఐదుగురే మారథాన్‌ను పూర్తిచేయగలిగారు. 'ఈ రేసు ఉత్సాహం, ఆందోళనల కలబోత. దాదాపు అసాధ్యమైన రేసు అని తెలుసు. ఆ అసాధ్యమనే భావనే నన్ను ఈ రేసులో పరుగెత్తేలా చేసింది' అని జాస్మిన్ అన్నారు. అథ్లెట్ గాయాలపాలైనా మధ్యలో ఎవరూ ఎలాంటి సాయం చేయరు. ఫోన్లు ఉండవు, జీపీఎస్ ట్రాకింగ్ ఉండదు. ఎలాంటి నావిగేషన్ వ్యవస్థలు ఉండవు. రెండు చోట్ల మాత్రం తాగు నీరు సదుపాయం ఉంటుంది. ఇద్దరు పిల్లల తల్లి అయిన జాస్మిన్ వృత్తిరీత్యా పశువైద్యురాలు. బ్రిటన్‌లోని మిడ్లోటియన్‌లో ఉండే జాస్మిన్ వైద్యవృత్తిని కొనసాగిస్తూనే ఎడిన్‌బర్గ్‌లో పరిశోధనా శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. ఆఫ్రికన్-అమెరికన్ పౌరహక్కుల ఉద్యమకారుడు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యకేసులో దోషి అయిన జేమ్స్ ఎర్ల్ రే అనే ఖైదీ 1977 ఏడాదిలో అమెరికా జైలు నుంచి పారిపోతూ ఆగకుండా 12 మైళ్లు పరుగెత్తిన ఘటన నుంచి స్ఫూర్తి పొంది ఈ మారథాన్‌ను గ్యారీ క్యాంట్రెల్, కార్ల్ హెన్‌లు 1986లో ప్రారంభించారు.

సిరియాలో జోక్యం ముస్లింల అణచివేత

అందుకే రష్యాపై ఐసిస్ విద్వేషాగ్ని

రష్యా రాజధాని మాస్కోలో తాజాగా ఇస్లామిక్ స్టేట్ ఉగ్ర సంస్థ (ఐసిస్) చేసిన అమానవీయ దాడి ప్రపంచాన్ని నిర్ఘాంతపరిచింది. రష్యాపై దాడులు ఐసిస్‌కు కొత్తేమీ కాదు. కొన్నేళ్ల కింద రష్యా పౌరులే లక్ష్యంగా విమానాన్నే బాంబుతో పేల్చేసి 244 మందిని బలి తీసుకున్న చరిత్ర దానిది! కాబూల్‌లోని రష్యా రాయబార కార్యాలయంపైనా దాడులకు తెగబడింది. సిరియా అంతర్యుద్ధంలో తమకు వ్యతిరేకంగా పుతిన్ జోక్యం రష్యాపై ఐసిస్ ఆగ్రహానికి ప్రధాన కారణం. రష్యాలోని ముస్లింలు తీవ్ర అణచివేతకు గురవుతున్నారన్న వార్తలు దాని విద్వేషాన్ని మరింతగా పెంచి పోషించాయి. ఫలితంగా రష్యాకు, ఐసిస్‌కు మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణం నిత్యం నిప్పుల కుంపటి రాజేస్తూనే ఉంది...

అలా మొదలైంది...

ఐసిస్ అరాచకం 2015లో సిరియాలో అంతర్యుద్ధానికి దారితీసింది. ఐసిస్‌ను అణిచే ప్రయత్నాల్లో అధ్యక్షుడు బషీర్ అల్ అసద్‌కు పుతిన్ దన్నుగా నిలిచారు. దాంతో రష్యాపై ఐసిస్ తీవ్ర ద్వేషం పెంచుకుంది. మాస్కోలో తాజా మారణహోమానికి తెగబడింది ఐసిస్ ఖోరసాన్ (ఐసిస్-కె). ఇది అఫ్గానిస్థాన్‌లో ఐసిస్ అనుబంధ సంస్థ. 2022లో అఫ్గాన్ రాజధాని కాబూల్‌లోని రష్యా రాయబార కార్యాలయంపై ఆత్మాహుతి దాడి చేసి ఇద్దరు ఉద్యోగులతో పాటు ఎనిమిది మందిని పొట్టన పెట్టుకుంది ఐసిస్-కెనే. దీన్ని పాకిస్తానీ తాలిబాన్ ముఠా సభ్యులు 2015లో ప్రారంభించారు. అఫ్గాన్‌లో భద్రతా దళాలతో పాటు మంత్రులపై, మైనారిటీలపై వరుస దాడులతో ప్రాచుర్యంలోకి వచ్చింది. 2018కల్లా ప్రపంచంలోని నాలుగు అత్యంత ప్రమాదకరమైన ఉగ్ర సంస్థల్లో ఒకటిగా ఎదిగింది. ఉగ్ర శిక్షణ నిమిత్తం ఇరాక్, సిరియాల్లోని అగ్ర నాయకత్వం నుంచి కోట్లది డాలర్లు అందుకుంటూ వచ్చింది. తర్వాత అమెరికా సైన్యం, అఫ్గాన్ కమెండోలు, అఫ్గాన్ తాలిబన్ల ముప్పేట దాడితో ఐసిస్-కె ఆగడాలకు కళ్లెం పడింది. అమెరికా వైమానిక దాడులు దాని అగ్ర నాయకత్వాన్ని దాదాపుగా తుడిచిపెట్టేశాయి. 2021లో అమెరికా సైన్యం అఫ్గాన్ నుంచి వైదొలగడంతో ఐసిస్-కె మళ్లీ పుంజుకుంది. అదే ఏడాది కాబూల్ విమానాశ్రయంపై దాడి చేసి 13 మంది అమెరికా సైనికులతో పాటు ఏకంగా 170 మంది పౌరులను బలి తీసుకుంది. కొన్నేళ్లుగా అఫ్గాన్ ఆవల కూడా విస్తరిస్తోంది. గత జనవరిలో ఇరాన్‌లో దివంగత మేజర్ జనరల్ ఖాసీం సులేమానీ స్మారక ర్యాలీపై ఆత్మాహుతి దాడికి తెగబడి 84 మందిని పొట్టన పెట్టుకుంది. ఇస్తాంబుల్‌లో ఓ చర్చిపైనా దాడి చేసింది. పుతిన్‌ను, ఆయన విధానాలను ఐసిస్-కె తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తెగలపరంగా తమ ప్రబల శత్రువులైన తాలిబన్లతో పుతిన్ సాన్నిహిత్యం రష్యాపై విద్వేషాన్ని మరింత ఎగదోసింది. దీనికి తోడు రష్యాలో ముస్లింలపై అణచివేత పెరుగుతోందని ఆమ్నెస్టీతో పాటు పలు హక్కుల సంస్థలు ఆరోపిస్తున్నాయి. రష్యాలో ముస్లింలు 2 కోట్ల దాకా ఉంటారని అంచనా. మతపరమైన ప్రార్థనలు కూడా చేసుకోలేనంతగా వారిపై తీవ్ర అణచివేత చర్యలు కొనసాగుతున్నాయని, విద్య, ఉపాధి తదితరాల్లోనూ వివక్ష కొనసాగుతోందని వార్తలొస్తున్నాయి. ఉక్రెయిన్ నుంచి ఆక్రమించుకున్న క్రిమియాలో కూడా ముస్లింలపై రష్యా తీవ్ర ఆంక్షలు అమలు చేస్తోందని చెబుతున్నారు. ఇవన్నీ ఐసిస్-కెకు మరింత కంటగింపుగా మారాయి. హిజాబ్ ముస్లిం సంప్రదాయం కాదంటూ పుతిన్ చేసిన వ్యాఖ్యలు రష్యాపై దాని ద్వేషాన్ని మరింతగా పెంచాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

కేట్ మిడిల్టన్‌కు క్యాన్సర్

కీమోథెరపీ చేయించుకుంటున్నట్లు వెల్లడించిన కేట్



లండన్: బ్రిటన్ యువరాణి కేట్ మిడిల్టన్ (42) క్యాన్సర్ బారిన పడ్డారు. ఈ విషయాన్ని ఆమే స్వయంగా వెల్లడించారు. పొత్తికడుపు ఆపరేషన్ తర్వాత జనవరి నుంచి మీడియా ముందుకు రాని మిడిల్టన్ ఆరోగ్య పరిస్థితిపై పుకార్లు షికార్లు చేస్తుండటం తెలిసిందే. క్యాన్సర్‌కు కీమోథెరపీ చేయించుకుంటున్నట్లు కేట్ శుక్రవారం ఒక వీడియో ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె ఏప్రిల్ దాకా విధులకు దూరంగా ఉండనున్నారు. బ్రిటన్ రాజు చార్లెస్-3 కూడా ప్రొస్టేట్ క్యాన్సర్ బారిన పడటం తెలిసిందే.

అమెరికాలో నరమాంస భక్షకుడు!

మనిషి కాలు తింటూ రోడ్లపై కలకలం

వాషింగ్టన్: అమెరికాలోని కాలిఫోర్నియాలో ఓ వ్యక్తి తెగిపోయిన మనిషి కాలు చేతబట్టుకుని రోడ్డుపై తిరుగుతూ కలకలం రేపాడు. దీనికి సంబంధించిన వీడియో శుక్రవారం సోషల్ మీడియాలో వైరలైంది. అందులో కాలిని అటూ ఇటూ ఊపుతూ, వీడియో తీస్తున్న వ్యక్తివైపు చూస్తూ ఉన్మాదిలా విరగబడి నవ్వుతూ కన్పించాడతను. అప్పుడప్పుడు దాన్ని వాసన చూస్తూ, నోట్లో పెట్టుకుంటూ అందరినీ భయభ్రాంతులను చేశాడు. 'దేవుడా! అతడా కాలిని తినేస్తున్నాడు' అంటూ నేపథ్యంలో కొందరు హాహాకారాలు చేయడం కూడా వీడియోలో విన్పించింది. పట్టాలు దాటబోతూ రైలు ఢీకొని మరణించిన మహిళ తాలూకు తెగిపడిన కాలిని అలా చేతపట్టుకుని తిరిగినట్టు స్థానిక మీడియా వివరించింది. విషయం తెలిసి పోలీసులొచ్చినా అతను ఏమాత్రమూ బెదరకుండా కులాసాగా కన్పించాడు. అతన్ని 27 ఏళ్ల రెసెండో టెలెజ్‌గా గుర్తించారు. మృతదేహపు కాలిని ఎత్తుకెళ్లి రైలు ప్రమాదం తాలూకు సాక్ష్యాధారాలను మాయం చేశాడన్న అభియోగాలపై అరెస్టు చేశారు. పోలీసులు తరలిస్తుండగా కూడా కెమెరాల వైపు చూస్తూ ఉత్సాహంగా చేతులూపుతూ కన్పించాడు!


విమానం డోర్ దాకా వచ్చి మరీ మోదీకి వీడ్కోలు పలుకుతున్న భూటాన్ రాజు జిగ్మే ఖేసర్

భూటాన్‌లో ఆస్పత్రిని ప్రారంభించిన మోదీ

థింపు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం భూటాన్ రాజధాని థింపూలో అత్యాధునిక వసతులతో నిర్మించిన ఆస్పత్రిని ఆ దేశ ప్రధాని త్సెరింగ్ టోబ్‌గేతో కలిసి ప్రారంభించారు. వివిధ విభాగాలకు చెందిన మొత్తం 150 పడకలతో కూడిన గ్యాల్ట్సుయెన్ జెట్సున్ పెమా వాంగ్చుక్ మాతా శిశు హాస్పిటల్‌ను భారత ప్రభుత్వ సహకారంతో నిర్మించారు. నాణ్యతతో కూడిన ఆరోగ్య సేవలను అందించే ఈ ఆస్పత్రి ఎన్నో కుటుంబాలకు ఆశా కిరణం వంటిదని అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. భారత్-టిబెట్‌ల ఆర్థిక సహకారానికి ఒక గొప్ప ఉదాహరణ ఈ ఆస్పత్రి అని తెలిపారు. భారత్ సాయంతో మొదటి దశలో రూ.22 కోట్లతో నిర్మించిన ఈ ఆస్పత్రి 2019 నుంచి సేవలందిస్తోంది. భారత్ అందించిన మరో రూ.119 కోట్లతో చేపట్టిన ఆస్పత్రి రెండో దశ నిర్మాణం తాజాగా పూర్తయిందని విదేశాంగ శాఖ తెలిపింది.

ఎయిర్‌పోర్టులో వీడ్కోలు పలికిన రాజు

రెండు రోజుల పర్యటనకు గాను ప్రధాని మోదీ శుక్రవారం భూటాన్ చేరుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు అక్కడి ప్రజలు ఘన స్వాగతం పలికారు. రాజు జిగ్మే ఖేసర్ వాంగ్చుక్ ప్రధాని మోదీకి అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ డ్రుక్ గ్యాల్పో'ను అందజేశారు. మోదీతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పర్యటన ముగించుకుని తిరిగి శనివారం మధ్యాహ్నం మోదీ తిరుగు పయనమయ్యారు. ఆయన వెంట ప్రధాని త్సెరింగ్ టోబ్‌గేతోపాటు రాజు జిగ్మే ఖేసర్ వాంగ్చుక్ స్వయంగా పారో విమానాశ్రయానికి వచ్చారు. వీరిద్దరూ ప్రధాని మోదీకి ఘనంగా వీడ్కోలు పలికారు.

త్వరలో వస్తా..

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సైజ్ విధానంలో అక్రమాలు జరిగాయంటూ ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టుచేసిన నేపథ్యంలో ఈడీ కస్టడీ నుంచి ఆయన వీడియో సందేశం ఇచ్చారు. దాన్ని ఆయన భార్య సునీత ప్రత్యక్షప్రసారంలో చదివి వినిపించారు. ''జైల్లో ఉన్నా, బయటున్నా నా జీవితంలో ప్రతి క్షణం దేశ సేవకే అంకితం. నా ప్రతి రక్తపుబొట్టు దేశం కోసమే ధారపోస్తా. మీ సోదరుడు, కుమారుడినైన నన్ను ఏ జైలూ ఎక్కువ రోజులు బంధించలేదు. త్వరలోనే బయటికొస్తా. మీకిచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తా. కష్టాల్లోనే పెరిగా. సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధపడ్డా. అందుకే ఈ అరెస్ట్‌తో ఆశ్చర్యపోలేదు. దేశాన్ని బలహీనపరిచే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి. వాటిని ఓడించండి'' అని బీజేపీని పరోక్షంగా ప్రస్తావించారు. ''గత జన్మలో ఎంతో పుణ్యం చేసుకొని ఉంటా. అందుకే ఈ పుణ్యభూమిలో పుట్టా. కోట్లాదిగా మీరు చూపిస్తున్న ఈ ప్రేమే నాకు కొండంత అండ' అని అందులో కేజ్రీవాల్ అన్నారు.

బీజేపీ వాళ్లంతా నా సోదరసోదరీమణులు

''ఆప్ వాలంటీర్లకు నాదో సూచన. నేను కస్టడీలో ఉన్నా సామాజిక, సేవ కార్యక్రమాలు ఆగకూడదు. ఢిల్లీ మహిళలకు నెలకు రూ.1,000 వాగ్దానం నేనొచ్చాక నెరవేరుస్తా. నన్ను అరెస్ట్ చేశారని బీజేపీపై ద్వేషం పెంచుకోకండి. వాళ్లంతా నా సోదరసోదరీమణులు. ప్రజల ఆశీర్వాదాలతో మూడుసార్లు సీఎం అయిన నన్ను అధికార అహంకారంతో మోదీ జైల్లో పడేశారు. ఇది ఢిల్లీ ప్రజలను వంచించడమే. ఎక్కడున్నా ప్రజాసేవలకే అంకితమవుతా. వాళ్లే నిర్ణాయక శక్తులు. జై హింద్' అన్నారు.

ఆప్ ఢిల్లీ ఆఫీస్‌కు తాళం

ఆప్ ఢిల్లీ కార్యాలయానికి సీలు వేశారని మంత్రి అతిషి ఆరోపించారు. ''లోక్‌సభ ఎన్నికల వేళ జాతీయ పార్టీ ఆఫీస్‌కు వెళ్లకుండా మా నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారు? దీనిపై ఈసీకి ఫిర్యాదు చేస్తాం'' అని చెప్పారు. ఈ వార్తలను పోలీసులు ఖండించారు. ''ఆఫీస్‌కు సీల్ వేయలేదు. కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో పార్టీ ఆఫీస్ ఉన్న ప్రాంతంలో 144 సెక్షన్ అమల్లో ఉంది. అందుకే వందల సంఖ్యలో వస్తున్న ఆప్ కార్యకర్తలను ఆఫీస్ వైపు వెళ్లనివ్వట్లేదు. గుమిగూడనివ్వట్లేదు'' అని వివరించారు. ఆప్ ఎమ్మెల్యే గులాబ్ సింగ్ ఇంటిపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు చేశారని అతిశీ 'ఎక్స్'లో వెల్లడించారు.

జైలులో సీఎం ఆఫీస్‌కు అనుమతి కోరతాం: భగవంత్ మాన్

ఈడీ కేసులో కోర్టు కేజ్రీవాల్‌ను జైలుకు పంపితే అక్కడి నుంచి ఆయన ప్రభుత్వాన్ని నడిపేలా సీఎం తాత్కాలిక ఆఫీస్‌ను ఏర్పాటుచేసేందుకు అనుమతి కోరతామని ఆప్ నేత, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ చెప్పారు. 'ఆప్‌లో కేజ్రీవాల్ స్థానాన్ని ఎవరూ భర్తీచేయ లేరు. జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపకూడదనే నిబంధన ఏదీ లేదు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా కోర్టు కేజ్రీవాల్‌ను జైలుకు తరలిస్తే అక్కడి నుంచే సీఎంగా బాధ్యతలు నిర్వహి స్తారు. దోషిగా తేలనంత వరకూ చట్ట ప్రకారం ఆయన జైలు నుంచి కూడా పనిచేయవచ్చు. అందుకే ఆఫీస్ కోసం సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టుల అనుమతి కోరతాం' అని మాన్ అన్నారు.

వీడియో సందేశంలో కేజ్రీవాల్



సోదరా, తీహార్‌కు వెల్‌కం!

కేజ్రీవాల్‌కు సుఖేశ్ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: ''ప్రియ సోదరా, కేజ్రీవాల్! నెమ్మదిగా అయినా నిజమే గెలుస్తుంది. సరికొత్త భారత్ శక్తికి ఇదో క్లాసిక్ ఉదాహరణ. వెల్ కం టూ తీహార్ క్లబ్. బాస్ ఆఫ్ తీహార్ క్లబ్‌గా ఆహ్వానిస్తున్నా. మీ డ్రామాలకు ముగింపు పడింది'' అంటూ మనీ లాండరింగ్ కేసులో జైల్లో ఉన్న సుఖేశ్ చంద్రశేఖర్ శనివారం ఆయకు లేఖ రాశాడు. ''మీ అవినీతంతా బయటపడుతుంది. ఢిల్లీ సీఎంగా 10 కుంభకోణాలు చేశారు. నాలుగింటికి నేనే ప్రత్యక్ష సాక్షిని. లిక్కర్ స్కాం కేవలం ఆరంభమే. అప్రూవర్‌గా మారి నిజాలన్నీ బయట పెడతా. నేను ఛైర్మన్‌గా, కేజ్రీ బిగ్‌బాస్‌గా, సిసోడియా సీఈఓగా, సత్యేంద్ర జైన్ సీఓఓగా తిహార్ క్లబ్ నడుపుతా'' అన్నాడు.

విరాళాల్లేకుండా పార్టీలు మనలేవు

సదుద్దేశంతోనే బాండ్లు: గడ్కరీ

అహ్మదాబాద్: ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు రద్దుచేశాక ఈ పథకంపై ప్రజాక్షేత్రంలో చర్చోపచర్చలు జరుగుతున్న వేళ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తన మనసులో మాట చెప్పారు. ''అసలు విరాళాలు తీసుకోకుండా ఏ రాజకీయ పార్టీ కూడా మనుగడ సాధించలేదు. సదుద్దేశంతోనే ఎలక్టోరల్ బాండ్ల పథకం తెచ్చాం. పథకాన్ని సుప్రీంకోర్టు రద్దుచేయకుండా అందులోని లోటుపాట్లను సరిచేయాలని సూచనలు చేస్తే బాగుండేది. సూచనల మేరకు అప్పుడు అన్ని రాజకీయ పార్టీలు కూర్చుని చర్చించుకునే అవకాశం దొరికేది. ఏకాభిప్రాయంతో సవరణలు చేసేవాళ్లం' అని అన్నారు. శుక్రవారం గాంధీనగర్‌లోని 'గిఫ్ట్ సిటీ'లో జరిగిన ఒక కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడారు. 'గతంలో అరుణ్ జైట్లీ కేంద్ర మంత్రిగా ఉన్నపుడు ఇలాంటి పథకం ఒకటి ఉంటే మంచిదని చర్చ జరిగినప్పుడు నేను అందులో పాల్గొన్నా. వనరులు లేకుండా రాజకీయ పార్టీల మనుగడ అసాధ్యం. కొన్ని దేశాల్లో ప్రభుత్వాలే పార్టీలకు నిర్వహణ నిధులిస్తాయి. భారత్‌లో అలాంటి పద్ధతి లేదు. అందుకే పార్టీలకు ఆర్థిక అండగా నిలబడే ఇలాంటి పథకాలను రూపొందించుకున్నాం. నేరుగా పార్టీలకు విరాళాలు చేరేలా చూడటమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. విరాళాల అందజేతకు ముందు, తర్వాత అధికారంలో ఉన్న పార్టీ మారిపోతే దాతలకు సమస్యలు వస్తాయి. అందుకే దాతల వివరాలు రహస్యంగా ఉండేలా పథకంలో నిబంధనలు పెట్టాం. ఏదైనా మీడియా సంస్థ తన ఒక కార్యక్రమానికి నిధులు అవసరమైతే స్పాన్సర్‌ను చూసుకుంటుంది. పార్టీ నిర్వహణ, కార్యకలాపాలకు నిధులు అవసరమే కదా' అని గడ్కరీ ఉదహరించారు. ప్రతిదీ పారదర్శకంగా ఉండాలనే పార్టీలకు విరాళాలు పారదర్శకంగా వచ్చేలా చూశామన్నారు.

కేజ్రీకి ఢిల్లీ హైకోర్టులో దక్కని ఊరట

న్యూఢిల్లీ: కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన పిటిషన్‌పై అత్యవసర విచారణకు కోర్టు నిరాకరించింది. తనను ఈడీ అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఆయన శనివారం పిటిషన్ దాఖలు చేశారు. తన అరెస్టు, రిమాండ్ చట్టవిరుద్ధమని, వెంటనే విడుదల చేసేలా ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. పిటిషన్‌ను అత్యవసరంగా, వీలైతే ఆదివారమే విచారించాలని కోరారు. అయితే బుధవారం విచారణ చేపడతామని కోర్టు తెలిపింది.

జర్మనీ ప్రకటన, రాయబారికి భారత్ సమన్లు

కేజ్రీవాల్ అరెస్ట్‌పై జర్మనీ సంచలన వ్యాఖ్యలు చేసింది. ''ఈ అరెస్ట్‌ను మేం గమనిస్తున్నాం. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రమాణాలు, ప్రాథమిక ప్రజాస్వామ్య సూత్రాలు ఈ కేసుకు వర్తిస్తాయని ఆశిస్తున్నాం. కేజ్రీవాల్ న్యాయమైన, నిష్పక్షపాత విచారణకు అర్హులు. చట్టపరమైన పరిష్కారాలను పరిమితుల్లేకుండా ఉపయోగించుకునే హక్కు ఆయనకుండాలి'' అని జర్మనీ విదేశాంగ మంత్రి పేర్కొంది. దీనిపై విదేశాంగ శాఖ తీవ్ర నిరసన తెలిపింది. ఇది తమ అంతర్గత వ్యవహారాల్లో, న్యాయ ప్రక్రియలో జోక్యం చేసుకోవడమేనని ఆక్షేపించింది. జర్మనీ వ్యాఖ్యలను అసమంజసం, పక్షపాతపూరితమని పేర్కొంటూ ఢిల్లీలోని జర్మనీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ జార్జి ఎన్జ్‌వీలర్‌కు సమన్లు జారీ చేసినట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ చెప్పారు.

బీజేపీ ఖాతాలోకే మద్యం ముడుపులు

- మద్యం వ్యాపారి శరత్ నుంచి రూ.59.5 కోట్ల బాండ్లు
- బీజేపీ చీఫ్ నడ్డాను ఈడీ తక్షణం అరెస్టు చేయాలి: ఆప్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం తాలూకు ముడుపులు ఎన్నికల బాండ్ల రూపంలో మద్యం వ్యాపారుల నుంచి నేరుగా బీజేపీకే అందాయని ఆప్ నేతలు, ఢిల్లీ మంత్రులు అతిషి, సౌరభ్ భరద్వాజ్ శనివారం సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఉదంతంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాను ఈడీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ''ఈ కుంభకోణంపై సీబీఐ, ఈడీ రెండేళ్లుగా దర్యాప్తు చేస్తున్నా ఆప్ నేతల నుంచి గానీ, మంత్రుల నుంచి గానీ రూపాయి కూడా రికవరీ కాలేదు. మద్యం దుకాణాలు దక్కించుకున్న శరత్‌చంద్ర రెడ్డి వాగ్మూలం ఆధారంగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. కేజ్రీవాల్‌ను తానెన్నడూ కలవలేదని, మాట్లాడలేదని, ఆప్‌తో ఏ సంబంధమూ లేదని విచారణలో చెప్పిన మర్నాడే శరత్‌ను ఈడీ అరెస్టు చేసింది. కేజ్రీవాల్‌ను కలిసి మద్యం కుంభకోణంపై మాట్లాడానంటూ మాట మార్చగానే బెయిల్ పొందారు!'' అని ఆరోపించారు. ''శరత్ కంపెనీల ద్వారా బీజేపీకి ఎన్నికల బాండ్ల రూపంలో రూ.4.5 కోట్లు అందాయి. అరెస్టు అనంతరం బీజేపీకి ఆయన ఏకంగా మరో రూ.55 కోట్ల ఎన్నికల బాండ్లు ఇచ్చారు'' అంటూ సంబంధిత వివరాలను మీడియాకు చూపించారు.

45 మందితో కాంగ్రెస్ నాలుగో జాబితా

వారణాసిలో మోదీ ప్రత్యర్థి అజయ్ రాయ్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో యూపీలోని వారణాసి నుంచి ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నుంచి పీసీసీ చీఫ్ అజయ్ రాయ్ బరిలో దిగుతున్నారు. ఆయనతో పాటు మొత్తం 45 మంది అభ్యర్థులతో నాలుగో జాబితాను కాంగ్రెస్ శనివారం విడుదల చేసింది. మధ్యప్రదేశ్‌లో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ రాజ్‌గఢ్ నుంచి పోటీ చేస్తున్నారు. తమిళనాడులో శివగంగ నుంచి కార్తీ చిదంబరం, విరుధ్‌నగర్ నుంచి మాణిక్కం ఠాగూర్ బరిలో దిగుతున్నారు. కాంగ్రెస్ ఇప్పటి దాకా 183 మంది అభ్యర్థులను ప్రకటించింది.

బీజేపీలోకి ఆ 9 మంది

న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభం కొనసాగుతోంది. అనర్హత వేటుపడిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, శాసనసభ సభ్యత్వాలకు శుక్రవారం రాజీనామా చేసిన ముగ్గురు స్వతంత్రులు శనివారం బీజేపీలో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఈ సందర్భంగా విమర్శించారు. ఈ తొమ్మిది మందీ ఇటీవలి రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయడం తెలిసిందే.

తప్పుకున్న ఇద్దరు బీజేపీ అభ్యర్థులు

అహ్మదాబాద్: లోక్‌సభ ఎన్నికల వేళ గుజరాత్ బీజేపీలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వడోదర టికెట్ దక్కిన సిట్టింగ్ ఎంపీ రంజన్ బెన్ ధనంజయ్, సబర్‌కాంత అభ్యర్థి భికాజీ ఠాకూర్ వ్యక్తిగత కారణాలతో పోటీనుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. రంజన్ బెన్ అభ్యర్థిత్వంపై స్థానిక బీజేపీ నేతలు అసంతృప్తితో ఉన్నారు. ఆమెకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి.

మహువా మొయిత్రా ఇళ్లలో సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ/కోల్‌కతా: లంచం తీసుకుని లోక్‌సభలో ప్రశ్నలడిగిన కేసు దర్యాప్తులో భాగంగా తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మహువా మొయిత్రా నివాసాల్లో సీబీఐ సోదాలు జరిపింది. కోల్‌కతాలోని నివాసం, నాదియా జిల్లా కృష్ణనగర్‌లోని అపార్టుమెంట్ సహా పలు ప్రాంతాల్లో భారీ బందోబస్తు నడుమ శనివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా తనిఖీలు జరిగాయని అధికారులు వెల్లడించారు. అనైతిక ప్రవర్తన కారణంగా గత డిసెంబర్‌లో మహువా లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఈ కేసులో ఆర్నెల్లల్లోగా నివేదిక అందజేయాలన్న లోక్‌పాల్ ఆదేశాల మేరకు సీబీఐ విచారణ జరుపుతోంది.



రంగుల పండగ వచ్చేసింది

రంగుల కేళి.. హోలీ వచ్చేస్తోంది. వివిధ రంగులతో ఆడిపాడే సరదాలను తీసుకొస్తోంది. నేడు కాముని దహనం కాగా.. సోమవారం హోలీ పండగ. - 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
కరీంనగర్	6.26	4.47
పెద్దపల్లి	6.06	4.41
రాజన్న సిరిసిల్ల	6.33	4.55
జగిత్యాల	6.33	4.54

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/23.0

జిల్లాలో ఈరోజు వాతావరణం సాధారణంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఉక్కపోత ఉంటుంది. రాత్రిపూట కాస్త చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



కరీంనగర్‌రూరల్: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్ అన్నారు. శనివారం కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో కరీంనగర్, కొత్తపల్లి, చొప్పదండి మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ, ఇరిగేషన్‌శాఖల అధికారులతో తాగునీటి ఎద్దడి నివారణపై సమావేశం నిర్వహించారు. సీఈవో మాట్లాడుతూ... గ్రామాల వారీగా తాగునీటి ఎద్దడిపై సమాచారాన్ని సేకరించి యాక్షన్‌ప్లాన్ రూపొందించాలన్నారు. గ్రామంలోతాగునీటి సరఫరా సక్రమంగా జరగకుంటే పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహిస్తారని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలను పంపిస్తే ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్‌రావు తెలిపారు. డీపీవో రవీందర్, ఎంపీడీవోలు వేణుగోపాల్‌రావు, ప్రభు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, మిషన్ భగీరథ డీఈ ప్రభాకర్, ఏడీఈ సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే టీఎన్జీవో పంతం



కరీంనగర్ అర్బన్: ఉద్యోగుల సంక్షేమమే టీఎన్జీవో సంఘం పంతమని సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పలు జిల్లా కార్యాలయాల్లో టీఎన్జీవో డైరీలను పంపిణీ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, సర్దార్ హర్మిందర్‌సింగ్, మారుపాక రాజేశ్‌భరద్వాజ్, సుమంత్‌రావు, హరిప్రియ, నారాయణ పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కరీంనగర్ కార్పొరేషన్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జిలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ బూత్ స్థాయిలో ఐదుగురు సభ్యులతో మూడురోజుల్లోగా కమిటీ వేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, పార్టీని విజయం వైపు నడిపించేందుకు క్షేత్రస్థాయిలో ఈ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. నాయకులు కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, దన్నసింగ్, జీడి రమేశ్, అస్తపురం రమేశ్, ఖమ్రొద్దిన్, మామిడి సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

సహజ రంగుల తయారీపై వర్క్‌షాప్

కరీంనగర్ సిటీ: హోలీ పండుగ రోజు సహజ రంగులు వినియోగించాలని ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ సూచించారు. శనివారం కాలేజీలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సహజ రంగుల తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. రసాయనాలతో కూడిన రంగుల్లో ఉండే కెమికల్స్ ఆరోగ్యానికి నష్టం కలిగిస్తాయన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు బీట్‌రూట్‌తో ఊదా, గోగి పువ్వుతో నారింజ, పాలకూరతో ఆకుపచ్చ, మందార పువ్వుతో ఎరుపు, పసుపుతో పసుపు రంగును తయారు చేశారు.

గ్రహణంమొర్రి చిన్నారులకు ఉచిత నిర్ధారణ శిబిరం

కరీంనగర్‌టౌన్: జిల్లాకేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిలో ఉన్న డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం గ్రహణంమొర్రితో బాధపడుతున్న 0–18ఏళ్లలోపు పిల్లలకు జీఎస్‌ఆర్ హాస్పిటల్, హైదరాబాద్ సౌజన్యంతో ఉచిత నిర్ధారణ శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌వో సుజాత మాట్లాడుతూ ఈ వ్యాధిని త్వరగా గుర్తిస్తే, శస్త్ర చికిత్స ద్వారా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు.36మంది చిన్నారులను గుర్తించి, 28మంది చిన్నారులను శస్త్ర చికిత్స కోసం జీఎస్‌ఆర్ హాస్పిటల్ హైదరాబాద్‌కు రెఫర్ చేయడం జరుగుతుందని తెలిపారు. డీఐవో సాజీదా అతహరి, ఆర్‌ఎంవో నవీన ఉన్నారు.

మత్తు జోరు.. బెట్టింగ్ హోరు



- ఉమ్మడి జిల్లాను పీడల్లా వెంటాడుతున్న జాఢ్యాలు
- జగిత్యాలలో వరుస ఘటనలతో కలవరం
- ఐపీఎల్‌తో మొదలైన ఆన్‌లైన్ బెట్టింగ్
- క్రెడిట్‌కార్డుల వినియోగం, ఆపై అప్పుల పాలు
- ఒత్తిడి పెరిగి డిప్రెషన్‌లోకి బెట్టింగ్‌బాబులు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యువతను రెండు జాఢ్యాలు వెంటాడుతున్నాయి. ఒకటి గంజాయి, మరోటి బెట్టింగ్. జగిత్యాలలో బాలిక గంజాయికి బానిసైన తీరు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. అదే సమయంలో కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఈ వారంలో ఆన్‌లైన్ గేమ్స్‌లో మితిమీరిన అప్పులు చేసి, తీర్చే మార్గం తెలియక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వాస్తవాలు వెల్లడించకపోయినా.. ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి. తక్కువ కాలంలో కోటీశ్వరులు కావాలన్న అత్యాశతో బెట్టింగ్ వైపు, మత్తులో విహరించి లోకాన్ని ఏలాలన్న కోరికతో కొంత మంది యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసకావడం ఆందోళన కలిగిస్తోంది.

లోన్ యాప్స్, క్రెడిట్ కార్డ్స్‌తో బెట్టింగ్..

ఇక ఉమ్మడి జిల్లా యువతలో కొందరు ఎదుర్కొంటున్న ప్రాణాంతక జాఢ్యం బెట్టింగ్. దీంతోపాటు ఆన్‌లైన్ గేమింగ్స్ కూడా. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ మొదలైంది. ఇది రెండునెలలపాటు సాగనుంది. ఇప్పటికే తెలివిగా బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు ప్రచారం ప్రారంభించారు. ఫలానా కూలీకి బెట్టింగ్‌లో ఇన్ని రూ.కోట్లు వచ్చాయని, బిచ్చగాళ్లు బిలియనీర్లు అయ్యారని సోషల్ మీడియాలో ప్రచారం. వాస్తవానికి యువతను యాప్స్ వైపు లాగేందుకు ఇదో ఎత్తుగడ. ఇందులో వీరు ప్రతీసారి సక్సెస్ అవుతుండటం గమనార్హం. సరే బెట్టింగ్ యాప్ డౌన్‌లోడ్ చేశాక..బెట్టింగ్ కోసం డబ్బు ఎలా? చేతిలో ఉన్నా డబ్బు సరిపోదు, అందుకే ఈ సమయంలోనే ఎలాంటి సంపాదన లేకుండా రూ.లక్షల కొద్దీ లిమిట్ ఇస్తూ ఉత్తపుణ్యానికి అంటగడుతున్న క్రెడిట్ కార్డ్స్, ఎలాంటి ష్యూరిటీ లేకుండా రూ.లక్షలు అప్పు ఇస్తున్న మనీలోన్ యాప్స్‌ను వీరు ఆశ్రయిస్తున్నారు.

తీర్చలేక తీవ్ర నిర్ణయాలు..

గంజాయికి అలవాటు పడ్డ వాళ్లు నేరాలు చేస్తూ బహిరంగంగానే దొరికిపోతున్నారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌కు చేతిలో డబ్బులు లేకున్నా.. లోన్‌యాప్స్, క్రెడిట్ కార్డ్స్‌లను వాడి రూ.లక్షలు అప్పులు చేస్తున్నారు. వీటిని తిరిగి తీర్చాలన్నపుడు అసలు కథ మొదలవుతుంది. కొందరు మరోచోట అప్పుచేసి కడుతుండగా మరికొందరు పోగొట్టుకున్న చోటే రాబట్టుకుందామన్న సిద్ధాంతంతోనే, లేక ఎలాగూ మునిగాం కదా అని మరింత అప్పు చేసి పీకల్లోతు ఊబిలోకి కూరుకుపోతున్నారు. ఈక్రమంలోనే వీరు ఒత్తిడికి గురవుతున్నారు. బ్యాచిలర్లయితే ఆత్మహత్యలకు పాల్పడటం లేదా వివాహితుల్లో కొందరు పెళ్లాం పిల్లలను చంపి తాము చావడం లాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. రూ.లక్షలు అప్పు చేస్తున్న వారంతా ఉన్నత విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు కావడం ఇక్కడ గమనార్హం.

గంజాయి విక్రేత అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ శివారులో శనివారం సాయంత్రం అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 260 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆరిఫ్ అలీఖాన్, రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటకు చెందిన మైదం అజయ్ శనివారం సాయంత్రం ధరూర్ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై సదాకర్ అక్కడకువెళ్లి అజయ్‌ని తనిఖీ చేయగా అతని వద్ద 260 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయిని స్వాధీనం చేసుకుని అజయ్‌పై కేసునమోదు చేసినట్లు సీఐ వివరించారు.

కలెక్టర్, ఎస్పీ సీరియస్

గంజాయికి బానిసైన బాలిక విషయంపై మీడియాలో భిన్న కథనాలు రావడంతో జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తీవ్రంగా పరిగణించారు. ఇటీవల ఇదే జిల్లాకేంద్రంలో ఓ ఈఎన్టీ ఆసుపత్రి వైద్యుడు మార్ఫిన్ ఇంజెక్షన్లను అడ్డదారిలో అమ్ముతూ దొరికిపోయిన విషయం తెలిసిందే. జిల్లాలో వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరం. నివారణ చర్యలు చేపట్టడంతోపాటు, జరుగుతున్న ప్రచారంపైనా నిశితంగా నిఘా ఉంచారు. బాలిక మతిస్థిమితం తప్పేంతలా గంజాయి వినియోగించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. బాలికకు అంత గంజాయి ఎలా వచ్చింది? ఎవరు విక్రయించారు? ఎవరు అలవాటు చేశారు? తదితరు విషయాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు. మరోవైపు కరీంనగర్ జిల్లాకేంద్రం, శివారులోని తిమ్మాపూర్, కొత్తపల్లి, చొప్పదండిలో వివిధ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు గంజాయికి అలవాటు పడ్డారు. చాలామంది కేవలం గంజాయి తాగేందుకే ప్రత్యేకంగా రూములు అద్దెకు తీసుకుంటున్నారంటే వీరి జల్సాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. గతంలో చొప్పదండిలో ఇలాంటి స్థావరాలపై పోలీసులు దాడి చేసినా.. గంజాయివీరుల తీరులో మార్పు రావడం లేదు. వీరిలో చాలామంది పోలీసులకు అనేకసార్లు పట్టుబడ్డారు. వీరిలో కొందరు దీన్నే వృత్తిగా స్వీకరించి, సులువుగా డబ్బు సంపాదించేందుకు శాశ్వతంగా గంజాయి పెడ్లర్ల అవతారమెత్తడం గమనార్హం. గంజాయి ఏజెన్సీ ప్రాంతాల నుంచి మంచిర్యాల, మంథని, భూపాలపల్లి మీదుగా జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్ తదిరల ప్రాంతాలకు సరఫరా అవుతోంది.

సాఫ్ట్‌వేర్ కంట్రోల్ చేస్తుంది



ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్స్ విషయంలో గమనించాల్సింది ఏంటంటే అవతల ఆడేది కంప్యూటరే. దానిలోని సాఫ్ట్‌వేర్ ముందు గెలిపించి, తరువాత ఓడిపోయేలా చేస్తుంది. ఈ విషయం తెలియక చాలా మంది ముందు తాము ఏదో గెలిచామన్న భావనతో అప్పులు చేసి గేమ్స్ ఆడుతారు. ఇదంతా పథకం ప్రకారం జరిగే ప్రక్రియ. ఒత్తిడి భరించలేక యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ప్రమాదకర బెట్టింగ్ యాప్స్‌పై ప్రభుత్వం సైతం అవగాహన కల్పించాలి. – వీరేందర్, సైకాలజిస్ట్

జైలును సందర్శించిన న్యాయసేవ కార్యదర్శి



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జిల్లా జైలును శనివారం జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేశ్ సందర్శించారు. జైలులో ఖైదీల యోగ క్షేమాలు, భోజన వసతులు, న్యాయసేవా, ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ పలు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా జైలును సందర్శించి మహిళా ఖైదీలతో వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ లాయరును పెట్టుకునే స్థోమత లేని ఖైదీలకు ప్రభుత్వ లాయర్‌ను నియమిస్తామని తెలిపారు. పర్యవేక్షణ అధికారి కే.శ్రీనివాస్, జైలర్ పి.శ్రీనివాస్, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ టి. మహేశ్ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో వేగం పెంచాలి

- అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ కార్పొరేషన్: ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో వారం రోజులే గడువు ఉన్నందున నగరంలో ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. శనివారం నగరపాలకసంస్థ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూళ్లు, బకాయిలపై సమీక్షించారు. ఇప్పటివరకు వసూలు అయిన మొత్తం, బకాయిలు, ఆర్థిక సంఘం నిధులు రావాలంటే కావాల్సిన కలెక్షన్ తదితర అంశాలపై ఆరా తీశారు. మరో రూ.1.90కోట్లు వసూలైతే ఆర్థిక సంఘం నిధులకు అర్హత సాధిస్తామని అన్నారు. నగరపాలకసంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, రెవెన్యూ అధికారి ఆంజనేయులు, ఆర్ఐలు పాల్గొన్నారు.

నేడు బల్దియాలో ప్రత్యేక కౌంటర్లు

ఆస్తి పన్ను బకాయి దారులు ఆదివారం కూడా చెల్లింపులు చేయొచ్చని కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ తెలిపారు. ఇందుకోసం నగరపాలకసంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

సమగ్రంగా పంటనష్ట వివరాల సేకరణ



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఖాసీంపేట, పారువెల్లలో పంటల పరిశీలన

గన్నేరువరం: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను సమగ్రంగా సేకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. గన్నేరువరం మండలం పారువెల్ల, ఖాసీంపేట గ్రామాల్లో అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలను శనివారం పరిశీలించారు. బాధిత రైతులు యాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గుజ్జ హరీశ్‌తో మాట్లాడారు. నష్టం వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, నివేదిక అందించాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. వచ్చే వర్షాకాలంలో కానుగ మొక్కల పెంపకంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లోని రహదారుల వెంట కానుగ మొక్కలు పెంచాలని, తద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో శంకర్, ఏవో కిరణ్మయి, ఏపీవో నర్సింహారెడ్డి, ఏఈవో అనూష, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



హుజూరాబాద్ హైస్కూల్ గ్రౌండ్‌లో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా, నవక్రాంతి, కేశవపూర్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎర్త్ అవర్ నిర్వహించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులను తగ్గించడానికి శనివారం రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్, సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు బండ శ్రీనివాస్, తాళ్లపల్లి శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, వద్దినేని రవీందర్ రావు, ముక్క రమేశ్, వేల్పుల రత్నం, పీఈటీ కొన్ని రాజిరెడ్డి, బీసీఐ ప్రాజెక్టు కోర్డినేటర్ బొట్ల సతీశ్ కుమార్ ,తిప్పారపు సతీశ్ కుమార్ తదితరులు ఉన్నారు.– హుజూరాబాద్

ధర్మారంలో తాగునీటి సరఫరా

సాక్షి స్పందన

శంకరపట్నం(మానకొండూర్): శంకరపట్నం మండలం ధర్మారం ఎస్సీకాలనీలో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మొగిలి గ్రామపంచాయతీ సిబ్బందితో మంచినీటి సరఫరా చేపించారు. 'పన్ను కట్టలేదని మంచినీళ్లు బంద్' అనే శీర్షికతో శనివారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ స్పందించారు. వెంటనే తాగునీరు సరఫరా చేయాలని ఏఈని ఆదేశించారు. సీఈ ఆదేశాల మేరకు ఏఈ మంచినీరు సరఫరా చేయించారు.

కలెక్టరేట్ కళాశాల

- అంతర శిక్షణలో ఒకేషనల్ విద్యార్థులు
- క్షేత్రస్థాయిలో విజ్ఞాన సముపార్జన



కలెక్టరేట్ ఆవరణలో విద్యార్థులు

కరీంనగర్ అర్బన్: అవును.. వీరికి కలెక్టరేటే కళాశాల. ఎందుకంటారా వృత్తివిద్యా కోర్సులో భాగంగా విద్యార్థులు కలెక్టరేట్‌లోని శాఖలనే తరగతి గదులుగా మలచుకోవాలన్న మాట. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను అవపోసన పడుతూ క్షేత్ర సందర్శనలో మరింత విజ్ఞానాన్ని పొందుతున్నారు. నగరంలోని ప్రభుత్వ ఒకేషనల్ కోర్సులలోని విద్యార్థులు నిత్యం కలెక్టరేట్‌లో ఫైళ్ల తీరును పరిశీలిస్తూ పరిపాలనను గమనిస్తున్నారు. నెలల తరబడి శిక్షణ కావడంతో అధికారులు శాఖల వారీగా బాధ్యతలు అప్పగించారు.

శిక్షణలో భాగం.. విషయ పరిజ్ఞానం

తెలంగాణ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ద్వారా ఒకేషనల్ కోర్సులు అందిస్తున్న విషయం తెలిసిందే. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సైన్స్ జూనియర్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులు నిర్వహిస్తున్నారు. సదరు విద్యార్థులకు కళాశాల తరగతులతో పాటు ఆయా కోర్సులకు సంబంధించిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆదేశానుసారం కళాశాల ప్రిన్సిపాల్ మధుమోహన్ రావు వృత్తి విద్యా శిక్షణలో ఆన్ ది జాబ్ ట్రైనింగ్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అంతరశిక్షణలో కలెక్టరేట్‌లో గల వివిధ విభాగాలలో ఆఫీస్ మెయింటెనెన్స్, రికార్డుల తయారీ పరిశీలన, కంప్యూటర్ ప్రోగ్రామ్స్, ప్రభుత్వ కార్యాలయాలలో కంప్యూటరీకరణ వంటి అంశాలు నేర్చుకుంటున్నారు. వివిధ ఆటోమొబైల్ షోరూంలు, సర్వీసింగ్ సెంటర్లలలో వాహనాల పనితీరు యంత్ర విడిభాగాలు వాటి నిర్వహణ, ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అంతర శిక్షణలో భాగంగా రక్త పరీక్ష నమూనాల సేకరణ, వ్యక్తిత్వ వికాసం, వృత్తిపరమైన నైపుణ్యతను మెరుగుపరచుకోవడానికి మెలకువలను నేర్పుతున్నారు.

చాలా బాగుంది



నేను చిన్నతనంలో ఉన్నప్పుడు కలెక్టరేట్ అంటే వింటుంటే వాడిని. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఉంటారంటే ఎప్పటికైనా చూడాలని అనుకునేవాణ్ని. కానీ నేడు విద్యాభ్యాసంలో భాగంగా కలెక్టరేట్‌లోనే నేర్చుకునే అవకాశం లభించడం ఆనందంగా ఉంది. – కల్యాణ్, విద్యార్థి

పరిపాలన తీరు తెలుస్తోంది



కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశాలు, సమీక్షలు చూస్తే తెలియని అనుభూతి. ప్రభుత్వ పథకాల అమలు, పురోగతి అంశాలను సమీక్షిస్తూ కలెక్టర్ సర్ అధికారులకు దిశానిర్దేశం చేయడం చూస్తే ప్రభుత్వ యంత్రాంగమంటే ఇలా ఉంటుందా..అని అర్థమైంది. జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిలో అధికారులు ఉంటారని తెలిసింది. – మాధవి, విద్యార్థిని

సహకారం మరువలేం



వృత్తివిద్యా కోర్సులో భాగంగా ఫైళ్ల తయారీ, కార్యాలయాల నిర్వహణ, కంప్యూటర్ ప్రోగ్రామ్స్ వంటి వాటిని అధికారులు చక్కగా వివరిస్తున్నారు. సంబంధిత సిబ్బందిని పురమాయించి మెలకువలు నేర్పుతున్నారు. ఫైలింగ్ ఎలా చేయాలి, కార్యాలయ నిర్వహణలో పద్ధతులను ప్రాక్టికల్‌గా చెబుతున్నారు. – టి.వర్ష, విద్యార్థిని

ఉజ్వల భవిత



ఒకేషనల్ కోర్సులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. త్వరగా ఉద్యోగాల్లో స్థిరపడాలనేవారికి చక్కని వేదిక కావడంతో విద్యార్థుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. తరగతి గదుల్లో బోధనతో పాటు ప్రాక్టికల్‌గా కార్యాలయాల్లో పని చేయాల్సి ఉంటుంది. నెలల తరబడి శిక్షణ ఉండటంతో అన్ని అంశాలను తెలుసుకోనున్నారు. – గంగాధరి తిరుపతి, లెక్చరర్

కేసీఆర్ కన్నా ఎక్కువ ఉద్యోగాలిచ్చారా..?

- ఇచ్చినట్లు నిరూపిస్తే నా పదవికి రాజీనామా చేస్తా
- 'పొన్నం'ను ఆవేశం స్టార్ అని పిలవాలనిపిస్తోంది
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కరీంనగర్: దేశంలో ఏ రాష్ట్రంలోనైనా కేసీఆర్ కన్నా ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానంటూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చాలెంజ్ చేశారు. శనివారం వినోద్ కుమార్ క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిప్పులు చెరిగారు. కల్యాణలక్ష్మి చెక్కుల ఆడియో లీక్ వ్యవహారంలో ఆర్డీవోను బలిచేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన తనను విస్మరిస్తే హుజూరాబాద్ ప్రజలు మంత్రిని క్షమించరన్నారు. పొన్నం కార్యాలయం నుంచే ఆడియో లీక్ అయిందని, ఈ వ్యవహారంలో మంత్రినే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సహనం కోల్పోయి ఆవేశంతో ఊగిపోతున్న పొన్నంప్రభాకర్‌ను ఆవేశంస్టార్ అని పిలవాలనిపిస్తోందన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి కమలాపూర్ మండలంలో 62చెక్కులు పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. నాయకులు బండ శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్, చల్లా హరిశంకర్, సంపత్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెడికోలకు పట్టాలు ప్రదానం



చైర్మన్ లక్ష్మీనర్సింహారావు చేతులమీదుగా పట్టా అందుకుంటున్న కావ్య

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు వైద్య కళాశాలలో 2018–24 బ్యాచ్ విద్యార్థులకు శనివారం వైద్య పట్టాల పంపిణీ కార్యక్రమం ఆనందోత్సవాల మధ్య జరిగింది. కళాశాల చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు విద్యార్థులకు పట్టాలు అందజేసి మాట్లాడారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అసీం అలీ, వైస్ ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.

ఏపీ తరహాలో ప్రమోషన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న సుధాకర్, చంద్రశేఖర్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఆంధ్రప్రదేశ్ తరహాలో ఖాళీగా ఉన్న డిప్యూటీ ఈవో, ఎంఈవో, జేఎల్, తత్సమాన పోస్టుల్లో అర్హత ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రమోషన్ ఇవ్వాలని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం మంకమ్మతోటలో సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వారివారి మేనేజ్‌మెంట్‌కు పంపించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు ప్రకటించాలని, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, సప్లమెంటరీ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, సీపీఎస్, సీసీఈలను రద్దు చేయాలన్నారు. ఇటీవల బదిలీ అయి, రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, ప్రతీ పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, అభిషేక్, కోశాధికారి శ్రీనివాస్, మహిళా కార్యదర్శి ప్రమీల, సంయుక్త కార్యదర్శి మమత, శిల్పారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీలపై తేనెటీగల దాడి

- 8 మందికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం

జూలపల్లి(పెద్దపల్లి): ఉపాధిహామీ కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఈఘటనలో 8 మందికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా మారింది. వేసవి దృష్ట్యా శనివారం ఉదయమే స్థానిక–డి 83 ఉప కాలువ 9ఆర్‌పై కొందరు కూలీలు తుమ్మచెట్లు నరుకుతున్నారు. ఈక్రమంలో అక్కడే ఉన్న తేనెటీగలు లేచి వారిపై దాడికి దిగాయి. దీంతో కూలీలు తలోదిక్కు పరుగులు తీశారు. ఇందులోని 8మందిని తేనెటీగలు వెంటాడి దాడిచేశాయి. గాయపడిన వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. వైద్యాధికారి సంపత్ రెడ్డి వారికి ప్రథమ చికిత్స అందించారు. ఏడుగురిని ఇంటికి పంపించారు. తీవ్రంగా గాయపడ్డ మెండె రాజవ్వను ఏపీవో సదానందం ఆధ్వర్యంలో 108 వాహనం ద్వారా కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్, లేదా హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు తీసుకెళ్లాలని సూచించారని ఏపీవో సదానందం తెలిపారు.

రంగుల పండుగ వచ్చేసింది..





- జోరుగా చిన్నారుల జాజిరి
- ఆటపాటలతో సంబురాలు
- నేడు కాముని దహనం
- రేపు హోలీ పండుగ

విద్యానగర్(కరీంనగర్)/జ్యోతినగర్ (రామగుండం): హైందవ పండుగల్లో పండుగకో ప్రత్యేకత ఉంది. ఒక్కో పండుగను ఒక్కో తీరుకగా జరుపుకుంటాం. హోలీ పండుగను రంగులు చల్లుకుని ఆనందంగా ఆడుకుంటాం.. పెద్ద ఎత్తున సంబురాలు చేసుకుంటాం. హోలీ వయసుతో సంబంధం లేకుండా జరుపుకునే ఏకైక వేడుక. ప్రతీ పండుగకు కొత్త బట్టలు కొనుక్కుని ధరిస్తాం. కానీ, రంగుల పండగకు సాధారణ దుస్తులు ధరించి రంగులు చల్లుకోవడం ఆనవాయితీ. ఈనెల 25వ తేదీన జిల్లాలో హోలీ వేడుక జరుపుకునేందుకు జిల్లావసులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

జాజిరి.. జాజిరి.. జాజిరే ఓయమ్మ..
జాజిరాటలాడుదామే రాధమ్మా
కట్టపొంటి కట్టపొంటి కర్రావు పాయే..
పందిని సంపింది ఎవడ్రా.. రావణాసుడి తమ్ముడ్రా..
కోతి పుట్టుదెందుకు.. కొమ్మలెక్కితందుకు..
ఈరన్నా బల్లికోడె.. ఈరగంధం పూసుకుని..

అని కర్రలు పట్టుకుని, లయబద్ధంగా ఆడుతూ.. ఊళ్లలో ఇంటింటా తిరుగుతున్నారు చిన్నారులు.



హోలీ పండుగ..

హోలీ పండుగకు ముందు పదిహేను రోజుల నుంచి అన్నివర్గాలు, పిల్లలు గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఉత్సవాలు జరుకుంటారు. ఇందులో తొలిఘట్టంల్లో జాజిరి ఆటలు ఆడుకోవడం ప్రత్యేకం. ఇంటింటా తిరుగుతూ వారు ఇచ్చే డబ్బులు, ఇతర వస్తుసామగ్రి పోగు చేసుకుంటారు. చివరిరోజు జాజిరి ఆడిన వారందరూ ఆ డబ్బు పంచుకుని, రంగులు కొనుగోలు చేసుకుని పరస్పరం చల్లుకుంటూ ఆనందంలో మునిగి తేలుతారు. తెలంగాణ ప్రాంతంలో హోలీ పండుగను కాముని పున్నమి అని పిలుస్తారు. కామదహనానికి ముందు జాజిరి ఆటలో ఆడిన కర్రలను ఒకచోట వేసి దహనం చేస్తూ పూజిస్తారు. తెల్లవారి హోలీ పండుగ జరుపుకుంటారు.

రూటు మారిన జాజిరి..

పట్టణాల్లో చాలా మందికి జాజి ఆట అంటే తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. కానీ, గ్రామాల్లో నేటికి కూడా జాజిరి ఆడుతున్నారు. కర్రలను చేతబట్టుకుని లయబద్ధంగా కొడుతూ పాటలు పాడుతూ ఇల్లిల్లూ తిరుగుతున్నారు. కొందరు కోలాటాలు వేస్తూ, నృత్యాలు చేస్తూ, మరికొందరు డప్పులు వాయించుకుంటూ జాజిరి ఆడుతున్నారు. ఏదిఏమైనా మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని వాటిని కొనసాగిస్తేనే మానవ మనుగడ కలకాలం హాయిగా ఉంటుందని సంప్రదాయవాదులు అభిప్రాయపడుతున్నారు.

ఆనాటి ఆటలు లేవు



ఆనాడు మేం ఆడుకున్న ఆటలు.. పాడుకున్న పాటలు నేడు కానరావడం లేదు. హోలీ పండుగ వస్తుందంటే వారం రోజులు నుంచి రోజూ రాత్రి మా దోస్తులతో ఇంటింటికీ వెళ్లి పాటలు పాడుతూ కోలలతో ఆడుకునే వాళ్లం. జబ్బకు సంచి ఉంచుకుని జోలె పట్టుకుని ఆడుకునే వాళ్లం. నేడు అవి కనిపిండం లేదు. అంతా సెల్‌ఫోన్ మాయలో పడి సంప్రదాయ ఆటలు మార్చిపోతున్నారు.

–రాజలింగు

జాజిరి ఆడుతున్నం



హోలీ పండుగ ఉందని జాజిరి అడుకుంటున్నం. మా తాత ఇంటి వద్ద చాలా మంది పిల్లలు కర్రలతో ఆడుకుంటున్నరు. నేను కూడా కర్రలు తీసుకుని వారితో జాజిరి ఆడేందుకు వెళ్తున్నం. చాలా ఆనందంగా ఉంది.

– శ్రేయాంశ్, విద్యార్థి, మేడిపల్లి సెంటర్

ధూంధామే..



హోలీ రోజు మాకాలనీ రంగులు, తీన్మార్ డ్యాన్స్‌లతో ధూంధాంగా ఉంటుంది, చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరం కలిసి కేకలు, కేరింతలతో రంగులు జల్లుకుంటూ ఆనందంగా రంగుల వేడుక జరుపుకుంటాం.

– సుచరిత, రాంనగర్, కరీంనగర్

అందరితో కలిసి ఆడుకుంటాం



నేను, మా వీధిలోని పిల్లలు, యువతులు, మహిళలతో కలిసి హోలీ ఆడుకుంటాం. వాళ్లందరు మా ఇంటికే వస్తారు. రంగులు, వాటర్ కేన్‌లతో రంగులు చల్లుకుంటాం. ఆటపాటలతో హోలీ జరుపుకుంటాం.

– వాసాల స్నేహ, వినాయక మార్కెట్, కరీంనగర్

నేడు కామదహనం



ఆదివారం కామదహనం, సోమవారం హోలీ పండుగా జరుపుకోవాలి. భౌతిక కామవాంఛలన్నీ తగులబెట్టి, ధర్మబద్ధంగా జీవితం గడపాలనే ఉద్దేశమే కామ దహనం పరమార్థం.

– నమిలకొండ రమణాచార్యులు, మయూరగిరి పీఠాధిపతి,

పండుగ విశిష్టత..

వసంత రుతువు ప్రారంభం కావడంతో చెట్ల ఆకులు రాలి చిగురిస్తాయి. ఈ కాలంలో చెట్లు వివిధ రకాలపూలు పూస్తాయి. మోదుగుచెట్ల పూలు ఎర్రగా, అందంగా కనిపిస్తాయి. సహజ సిద్ధమైన రంగులు తయారు చేసుకుని ఒకరిపై ఒకరు చల్లుకుంటారు.



సహజసిద్ధ రంగులు వాడాలి



ముదురు రంగులను శరీరంపై ఎక్కువ సేపు ఉంచుకోకుండా పది నిమిషాల్లో శుభ్రం చేసుకోవాలి. ఎక్కువ సేపు ఉంటే ఎలర్జీ వచ్చే ప్రమాదం ఉంది. ద్రవ రూప రసాయనాలు వాడొద్దు. ఆయిల్, గ్రీజ్ లాంటి పదార్థాలు ఉపయోగించడం క్షేమం కాదు.

– వి.సుమన్‌చందర్‌రావు, చర్మవ్యాధుల నిపుణుడు

కృత్రిమ రసాయనాలతో ప్రమాదం



రంగులు ఏవైనా కళ్లల్లో పడకుండా జాగ్రత్త పడాలి. హానికర రసాయనాలతో కూడిన రంగులతో రెటినా దెబ్బతినే ప్రమాదం ఉంది. అల్సర్లు, పుండ్లు ఏర్పడి శాశ్వతంగా కంటిచూపు దెబ్బతినే అవకాశం ఉంది.

– వి.రఘు, నేత్ర వైద్య నిపుణుడు, కరీంనగర్

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



సీరియల్ యూనిట్‌ను సన్మానిస్తున్న స్థానికులు

జమ్మికుంట(హుజూరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకం తీసుకరాగా ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ (టీజీపీఏ) అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ కోరారు. ఆటో బతుకులపై సైరన్ అనే యూ ట్యూబ్ చానల్ ద్వారా సీరియల్ ప్రదర్శిస్తున్న క్రమంలో.. ప్రజలకు ఆటో నడుపుకుంటూ జీవించే వారి బతుకులు తెలియజేస్తూ చిత్ర హీరో రవికుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్ర శనివారం జమ్మికుంట పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తొమ్మిది రోజులుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి రథయాత్ర చేస్తున్నామని, జమ్మికుంట మీదుగా కరీంనగర్‌కు చేరుకుంటుందన్నారు. ఆటో డ్రైవర్లు ఇల్లు కిరాయి, పిల్లల చదువుల ఫీజులు, కుటుంబాలు పోషించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలపై సీరియల్ చిత్రించామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బలమైన ప్రదర్శన నిర్వహించి, ఆటోడ్రైవర్ల శక్తిని చాటాలన్నారు. అనంతరం హీరో రవికుమార్, నటులు దార మధు, రామ్‌ప్రసాద్‌లను స్థానికులు సన్మానించారు. పబ్బు శ్రీనివాస్, అంబాల రాజు, సదరపు శంకర్, ఆటో డ్రైవర్లు అరవింద్‌స్వామి, శ్రీనివాస్, రమేశ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



నృసింహుని దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



తలనీలాల సమర్పణ..

ధర్మపురి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. నాలుగో రోజు శనివారం ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో వేలాది మంది భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. నృసింహునికి కోడె మొక్కు, కొబ్బరి బెల్లాలు, తలనీలాలు సమర్పించారు. అంతకుముందు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆదివారం కోనేరులో స్వామివారి తెప్పోత్సవ, డోలోత్సవ కార్యక్రమం వీక్షించాలనుకున్న పలువురు ఒక రోజు ముందుగానే ధర్మపురికి చేరుకున్నారు. వారికి పాత టీటీడీ కల్యాణ మండపంలో ఉచితంగా అన్నదానం చేపట్టారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ శాఖ, దేవాలయం తరఫున 20 చోట్ల చలివేంద్రాలు, నీడ వసతి ఏర్పాటు చేశారు.

ఆరోహణ–2024 ఓవరాల్ చాంపియన్ ‘అల్ఫోర్స్’

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం నిర్వహించిన మేనేజ్‌మీట్ ఆరోహణ–2024 ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సీతారాంపూర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల సొంతం చేసుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి తెలిపారు. శాతవాహన వర్సిటీ నిర్వహించిన ఆరోహణ–2024 పోటీల 7 అంశాల్లో బిజినెస్ క్విజ్, యాడ్‌మేకింగ్, రోల్‌ప్లే తదితర అంశాల్లో ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే వికల్ప–2024లో సైతం ఓవరాల్ చాంప్‌ను గెలుపొందడం జరిగిందన్నారు. చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ కార్యక్రజుమంలో ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ డా.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చాంపియన్‌షిప్ సాధించిన అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

కౌశిక్‌రెడ్డి.. నోరు అదుపులో పెట్టుకో

- డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న పద్మాకర్‌రెడ్డి

సైదాపూర్(హుస్నాబాద్): హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి అంజయ్యగౌడ్ హెచ్చరించారు. శనివారం మండలకేంద్రంలో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై కౌశిక్‌రెడ్డి చేసిన విమర్శలను ఖండించారు. కాంగ్రెస్ నాయకుడిగా ఎదిగి, బీఆర్ఎస్‌కు కోవర్టుగా పని చేసినందుకు కేసీఆర్ ఎమ్మెల్సీ ఇచ్చారని ఆరోపించారు. హుజూరాబాద్‌లో అప్పటి బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఉండగానే అధికారులను బెదిరించి ఎమ్మెల్సీగా కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశావని, అప్పుడు ఎమ్మెల్యే హక్కులను కాలరాసిన నీకు ఇప్పుడు ఎమ్మెల్యే పదవికి హక్కులున్నాయనడం విడ్డూరంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటామని, గెలిస్తే జైత్రయాత్ర, గెలవకుంటే శవయాత్ర అని ప్రచారం చేసుకొని గెలిచావని ఎద్దేవా చేశారు. మంత్రి పొన్నం పేరు ఎత్తే అర్హత పాడికి లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్, సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, మిట్టపెల్లి కిష్టయ్య, మాజీ సర్పంచ్ బాదావత్ బిక్షపతి, బొమ్మగాని రాజు, అనగోని శ్రీనివాస్, బానోత్ కిషన్‌నాయక్, తాళ్ళపల్లి వెంకటేశం, మ్యాకల రాజు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించండి



నిరసన తెలుపుతున్న వాసుదేవరెడ్డి, నాయకులు

కరీంనగర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు శనివారం తెలంగాణ చౌరస్తాలో సీపీఎం, సీపీఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధంగా ఎలాంటి రాగద్వేషాలు లేకుండా, స్వచ్ఛందంగా పనిచేసే కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఈడీ, ఐటీ, సీబీఐ లను తమ జేబు సంస్థలుగా బీజేపీ ప్రభుత్వం వాడుకుంటుందన్నారు. ప్రతిపక్ష నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తుందని విమర్శించారు.కార్యక్రమంలో నాయకులు కె.సృజన్‌కుమార్, డి.నరేశ్, పైడిపల్లి రాజు, కె.మల్లవ్వ, కె.బుచ్చన్న, తిప్పారపు సురేశ్, జి.తిరుపతినాయక్, పుల్లెల మల్లయ్య, గజ్జల శ్రీకాంత్, బి.మహేందర్, రాయికంటి శ్రీనివాస్, మచ్చ రమేశ్, సదాశివ, కె.అరవింద్, చందు, నవీన్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లి చెంతకు తప్పిపోయిన బాలిక

- తల్లికి తెలియకుండా తీసుకెళ్లిన తండ్రి
- వెతికి పట్టుకున్న పోలీసులు



బాలికను తల్లికి అప్పగిస్తున్న ఏసీపీ నరేందర్, సీఐ విజయ్‌కుమార్

కరీంనగర్‌క్రైం: తప్పిపోయిన బాలికను కరీంనగర్ టూటౌన్ పోలీసులు శనివారం రాత్రి తల్లి చెంతకు చేర్చారు. ఉత్తరప్రదేశ్ బస్తీ జిల్లాకు చెందిన షేర్ అలీ–నూర్ కొన్నేళ్ల క్రితం బొమ్మకల్‌కు వచ్చారు. షేర్‌అలీ పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తలు గొడవపడ్డారు. భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయి కూతురితో కలిసి మాతాశిశు ఆసుపత్రిలో ఉంటోంది. శనివారం సాయంత్రం తల్లి నూర్‌కు పాప అమీనా ఖాతూన్ కనిపించలేదు. దీంతో ఆమె సమీపంలోని కరీంనగర్ టూటౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఏసీపీ నరేందర్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. టెక్నాలజీ ఉపయోగించి, ఆసుపత్రికి సమీపంలోనే పాప అమీనా ఖాతూన్ తండ్రి షేర్ అలీతో ఉందని గుర్తించారు. తండ్రిని విచారించగా భార్యకు తెలియకుండా కూతురిని తానే తీసుకెళ్లానని అంగీకరించాడు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, పాపను అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. దర్యాప్తులో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, పోలీసులను అభినందించారు.

అలరించిన అల్ఫోర్స్ ‘పరివర్తన్’



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పక్కన చైర్మన్ నరేందర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో శనివారం సాయంత్రం పరివర్తన్ వేడుకలు అలరించాయి. కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

‘పారమిత’కు మెరిట్ సర్టిఫికెట్



సర్టిఫికెట్‌తో డా.ప్రసాదరావు తదితరులు

కొత్తపల్లి(కరీంనగర్): ఆర్యభట్ట గణిత చాలెంజ్‌లో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటినట్లు స్కూల్ చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు తెలిపారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) బోర్డు ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే ×ఆర్యభట్ట గణిత చాలెంజ్¤ పోటీలో దేశవ్యాప్తంగా ఐదు లక్షల 54 వేల మంది విద్యార్థులు పాల్గొనగా.. ఇందులో ప్రతిభ కనబరిచిన మొదటి 100 మందిలో పారమిత స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు జి.హర్షికాంత్, బి.విశాల్‌రెడ్డి, సీహెచ్.లక్ష్మీహాసిని ఉన్నారు. వీరి అత్యుత్తమ ప్రదర్శనకు సీబీఎస్ఈ బోర్డు పారమిత హెరిటేజ్ పాఠశాలను గణితశాస్త్ర ప్రమోషనల్ స్కూల్‌గా ప్రకటిస్తూ మెరిట్ సర్టిఫికెట్ అందించడం గర్వంగా ఉందన్నారు. ఈ ఘనత సాధనకు కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులను శనివారం అభినందించారు. హెచ్‌ఎం రితేశ్‌మెహతా, డైరెక్టర్లు రశ్మిత, అనుకర్ రావు, ప్రసూన, వినోదరావు, వీయుఎం ప్రసాద్, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయకర్త రాము, గైడ్ టీచర్ ఇ.సంపత్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో ఉద్యోగ అవకాశాలు

కరీంనగర్‌సిటీ: విద్యార్థులు శిక్షణతో ఉద్యోగ అవకాశాలు పొందుతారని టీఎస్‌కేసీ కో ఆర్డినేటర్ సీహెచ్.శోభారాణి తెలిపారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జి సెంటర్ (టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టీఏఎస్‌కే) సహకారంతో డాటా బేస్ విత్ ఎస్‌క్యూల్‌పై శిక్షణ కార్యక్రమం 21 నుంచి 23 వరకు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్.టి. శ్రీలక్ష్మి మాట్లాడుతూ, ఈ శిక్షణ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ట్రైనర్ బి.స్వప్న, టీఎస్‌కేసీ ఎఫ్‌టీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లాభ నష్టాలపై సమీక్ష


సమీక్ష సమావేశంలో ఆర్టీసీ అధికారులు

విద్యానగర్(కరీంనగర్): టీఎస్ఆర్టీసీలో లాభ నష్టాలపై రీజినల్ మేనేజర్లతో శనివారం కరీంనగర్ బస్‌స్టేషన్‌లోని సమావేశ మందిరంలో జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వినోద్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఆర్థిక సంవత్సరంలో లాభాలు పెంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచడం, బస్‌స్టేషన్‌లో కనీస సౌకర్యాలు మెరుగుపర్చడం తదితర అంశాలపై చర్చించారు. రీజినల్ మేనేజర్లు డి.సాలమన్, వెంకన్న, జె.శ్రీలత, కె.జానీరెడ్డి, కె.సత్యనారాయణ, డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్) ఎస్.భూపతిరెడ్డితో పాటు అధికారులు విలాస్‌రెడ్డి, సుగుణాకర్, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

కరీంనగర్‌కల్చరల్: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు గజ్జల శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రఘుపతి, నాయకులు అరవింద్, నరేశ్‌పటేల్, రఘుపతి, అంజి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు


ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని మంకమ్మతోటలో గల వేంకటేశ్వరస్వామి ఆలయం హుండీల ఆదాయం శనివారం లెక్కించారు. ఆరు నెలలకు గాను రూ.1,50,718 సమకూరిందని ఈవో ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి రమణరెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్, కూలర్ అందజేత


కూలర్ అందజేస్తున్న చకిలం స్వప్న

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రేకుర్తి వృద్ధాశ్రమంలో కూలర్‌ను, అంధుల పాఠశాలలో ఫ్యాన్‌లను అందజేశారు. సంస్థ నిర్వాహకురాలు చకిలం స్వప్న, శ్రీనివాస్, రూప, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ పరీక్షలకు విద్యుత్ కోత

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్ జిల్లా పరిషత్ పాఠశాలలోని ఎస్సెస్సీ పరీక్షా కేంద్రానికి శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎస్సీ కాలనీలోని విద్యుత్ కేబుల్‌ను కోతులు కొరికివేయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో జాప్యం కావడంతో పరీక్షా కేంద్రంలోని సీసీ కెమెరాలు, ఫ్యాన్లు పనిచేయలేదు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఉపాధ్యాయులు అధికారులకు సమాచారం ఇచ్చారు. చివరకు కేబుల్‌ను మరమ్మతు చేసి ఉ.11గంటల వరకు అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

భగత్‌సింగ్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు


ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో..


ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..


ఆల్ ఇండియా యూత్ లీగ్ ఆధ్వర్యంలో..


ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్‌టౌన్/సప్తగిరికాలనీ/కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్‌రూరల్: భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం నగరంలో వివిధ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. నగరంలోని భగత్‌సింగ్ విగ్రహాల వద్ద నివాళి అర్పించారు. దేశ విముక్తి కోసం ప్రజలు ఎంచుకోవాల్సిన సరైన మార్గం చూపడానికి తన చావునే ఈ దేశానికి ఇచ్చిన యోధుడు అని కొనియాడారు. ఆయన ఆశయాలతో ఉద్యమిస్తామని తెలిపారు. భగత్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు ములకల మారుతి, నాయకులు దేవేందర్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.
- పీఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగంధర్, నాయకులు చెంచుల మురళి, సదశివ, భాస్కర్, రాజు, మోహన్, జీవన్, సతీశ్, శ్రీనివాస్, సింగ్, తదితరులు పాల్గొన్నారు.
- టీయూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంద గణేశ్, నాయకులు రంజిత్, సాయి, నవీన్ తదితరులున్నారు.
- పీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంపెల్లి అరవింద్, గజ్జల శ్రీకాంత్, నాయకులు సుధీర్, సిద్ధూ, శివ, అనిల్ తదితరులున్నారు.
- పీఐఎఫ్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, నాయకులు హేమంత్, కసిరెడ్డి సందీప్‌రెడ్డి, వినయ్, సాయి, అనిరుధ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.
- తీగలగుట్టపల్లిలో నేషనల్ యూత్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటానికి కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎన్‌వైపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.యాదవరాజు, ప్రతినిధులు గడప భాస్కర్, రామన్న, శేఖర్, అరవింద్, అమరేందర్, శ్రావణ్, సాయికిరణ్, హరిహరన్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.
- ఆల్ ఇండియాయూత్ లీగ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బోయవాడలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆల్ ఇండియా యూత్ లీగ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రశాంత్‌కుమార్, బద్రినేత, జిల్లా ఉపాధ్యక్షుడు జనగాం రాజు తదితరులు పాల్గొన్నారు.
- భగత్‌నగర్‌లోని భగత్‌సింగ్ విగ్రహానికి డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేశ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా కమిటీ సభ్యులు విజయ్, ఆకలి సింగ్, నాయకులు రవీందర్‌సింగ్, బిల్లు సింగ్, తారా సింగ్, సికిందర్ సింగ్ మున్నాసింగ్,బల్జిత్‌సింగ్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.


యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..


తీగలగుట్టపల్లిలో నేషనల్ యూత్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో..

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని విదిషలో ఈనెల 23 నుంచి 27వరకు జరుగనున్న జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. ఈనెల 8 నుంచి 10వరకు వరంగల్ జిల్లా పైడిపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన సాయి కృష్ణ, చంద్రదీప్, చంటిలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, రమణ, ప్రభాకర్ తదితరులు అభినందించారు.

అభినందన



కరీంనగర్‌క్రైం: హైదరాబాద్ పుల్లెల గోపీచంద్ బాడ్మింటన్ అకాడమీలో జరిగిన 16వ ఆల్ ఇండియా పోలీస్ మీట్‌లో 55 ఏళ్ల విభాగంలో హెడ్ కానిస్టేబుల్ సత్యం కాంస్య పతకం సాధించాడు. ఈసందర్భంగా అతడిని సీపీ అభిషేక్ మహంతి శనివారం అభినందించారు.

మహా భీమ్ యాత్రను జయప్రదం చేయాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న గంగుల కమలాకర్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లో చేపట్టిన మహాభీమ్ యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ముద్రించిన బీఆర్ అంబేద్కర్ భీమ్ యాత్ర కరపత్రాన్ని శనివారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 14న కిసాన్‌నగర్ నుంచి కోర్టు చౌరస్తా వరకు భీమ్ యాత్ర నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, నాయకులు కరుణాకర్, దీపక్, సుమిత్, వినయ్‌సాగర్, సాయిచరణ్, రాకేశ్, కళ్యాణ్, వంశీ, డేవిడ్, శ్రీకృష్ణ, జయాకర్, చంటి, అజయ్, ప్రభాస్, రతన్, గణేశ్, శేఖర్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు

కష్టపడ్డ కార్యకర్తలకే 'నామినేటెడ్' ఇవ్వాలి


మాట్లాడుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: కష్టకాలంలో కాంగ్రెస్ వెంట ఉన్న కార్యకర్తలు, నాయకులకే నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ అన్నారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014లో తెలంగాణ ఏర్పడిన అనంతరం కాంగ్రెస్ గడ్డుకాలాన్ని ఎదుర్కొందన్నారు. కాంగ్రెస్‌లో ఉన్నోళ్లలో ఎక్కువ మంది అప్పటి టీఆర్ఎస్‌లోకి వెళ్లారన్నారు. పది సంవత్సరాల్లో ఎన్నో నిర్బంధాలు, దౌర్జన్యాలు ఎదుర్కొని పార్టీ వెంట నడిచారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి అవకాశం కల్పించొద్దని, ఫిరాయింపుదారులు, భూకబ్జాదారులు, దొంగలను పార్టీలో చేర్చుకోవద్దని అన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు మహమ్మద్ అమీర్, ఇమ్రాన్, సతీశ్, వసీం, పొరండ్ల రమేశ్, దన్నా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన


చెర్లభూత్కూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

కరీంనగర్‌రూరల్: పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో శనివారం స్వశక్తి సంఘాల మహిళలకు సంపూర్ణ పోషకాహారంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల మాట్లాడుతూ మిల్లెట్‌ఫుడ్‌తో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, భాగ్యలక్ష్మితో పాటు స్వశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

గణిత పరీక్షకు 35మంది గైర్హాజరు

సప్తగిరికాలనీ(కరీంనగర్): జిల్లావ్యాప్తంగా శనివారం పదోతరగతి గణిత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రెగ్యులర్ విద్యార్థులు 12,565 మందికిగా 12,551మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 65మందికి గానూ 44మంది హాజరుకాగా 21మంది, మొత్తంగా 35మంది గైర్హాజరైనట్లు డీఈవో సీహెచ్.జనార్దన్‌రావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీ బృందాలు 29సెంటర్లను, అదనపు కలెక్టర్ ఒక సెంటర్‌ను, డీఈవో మూడు సెంటర్లను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

క్షయ నివారణ అందరి బాధ్యత

కరీంనగర్‌టౌన్: జిల్లాలో క్షయ నివారణ అందరి బాధ్యత అని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుజాత అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది తమ, తమ పరిధిలో ఉన్న స్కూల్స్, యూనివర్సిటీలలో విద్యార్థులకు క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలని తెలిపారు. దగ్గు, స్వల్ప జ్వరం, ఛాతీ నొప్పి గల వారిని గుర్తించి శాంపిల్స్ సేకరించి, క్షయ వ్యాధి నిర్ధారణ కోసం పంపించాలని, వ్యాధి సోకిన వ్యక్తికి ఉచితంగా మందులు అందించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్నటువంటి నిక్షయ్ పోషణ యోజన పథకం కింద ప్రతి నెల రూ. 500 చొప్పున లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలో జమ చేయబడేలా చూడాలన్నారు.

సీఎంను కలిసిన రెడ్డి సంఘం సభ్యులు


సీఎంతో రెడ్డి సంఘం సభ్యులు

విద్యానగర్(కరీంనగర్): సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి కార్యవర్గసభ్యులతో కలిశారు. సీఎంను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లాలో రెడ్డి కులబాంధవుల కోసం, అనాథ వృద్ధుల ఆశ్రమం నిర్మాణానికి భూమిని కేటాయించాలని, రెడ్డి విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో నడుస్తున్న బీఈడీ కాలేజీ బాలికల వసతి గృహం అసంపూర్తిగా ఉందని, నిర్మాణం పూర్తి చేయడానికి రూ.2 కోట్ల నిధులు కేటాయించాలని విన్నవించారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని సంఘ సభ్యులు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో కరీంనగర్ జిల్లా కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, కోశాధికారి కాసర్ల మధూకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గన్ను మహేందర్‌రెడ్డి, రేకులపెల్లి రవీందర్‌రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, పెండ్యాల రాంరెడ్డి, సంయుక్త కార్యదర్శులు దారం జగన్నాథరెడ్డి, ద్యవ భాస్కర్‌రెడ్డి, దాసరి రామారెడ్డి, కార్యవర్గ సభ్యులు చింతల శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు చొక్కా రెడ్డి, న్యాలకొండ ప్రసన్న రెడ్డి, రావుల కిరణ్ రెడ్డి, నల్ల కొండల్ రెడ్డి, పెద్ధి లక్ష్మి మల్లారెడ్డిలున్నారు.

మూల్యాంకన కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

విద్యానగర్(కరీంనగర్): పదో తరగతి మూల్యాంకన కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, సరైన బెంచీలు, డెస్కులు ఏర్పాటు చేయాలని కోరుతూ టీఆర్టీఎఫ్ నాయకులు శనివారం డీఈవోకు వినతిపత్రం అందజేశారు. మూల్యాంకనం ప్రారంభంకు ముందే స్పాట్ రెమ్యూనరేషన్ చెల్లించాలని, అనారోగ్యం, దివ్యాంగత్వం తదితర ఇబ్బంది ఉన్న వారికి విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, రంజాన్ ఉపవాసాల దృష్ట్యా ముస్లిం మహిళా ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఆర్టీఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఖాజా మంజూర్‌అలీ, ప్రధాన కార్యదర్శి అశోక్‌రావు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సుంకిశాల ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయాకర్, రాష్ట్ర బాధ్యులు సలీం, ప్రవీణ్ ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం


రామకృష్ణ

కరీంనగర్‌క్రైం: కట్టరాంపూర్‌కు చెందిన కాళిదాసు రామకృష్ణ(45) ఈనెల 12 నుంచి కనబడుటలేదని అతని భార్య కాళిదాసు రాణి శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతనికి మతిస్థిమితం సరిగాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

58వ సారి రక్తదానం


రక్తదానం చేస్తున్న మధుసూదన్ రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బుర్ర మధుసూదన్ రెడ్డి శనివారం 58వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి నేటి యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. కవిగా సమాజ అవలక్షణాలను వేళెత్తి చూపుతూ, రక్తదాతగా ప్రతీ ఆరు మాసాలకు ఒకసారి రక్తదానం చేస్తూ, వివిధ స్వచ్ఛంద సంస్థల్లో సభ్యుడిగా సేవలందిస్తున్న మధుసూదన్‌రెడ్డిని పలువురు అభినందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి, ఎల్ఎస్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నడిపెల్లి ప్రసాదరావు, ఇనుగుర్తి రమేశ్, జగదీశ్వరా చారి, సత్యనారాయణ, అనంతరావు తదితరులు అభినందించారు.

అక్రమ లేఅవుట్లపై కార్యదర్శి ఫిర్యాదు

- పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు
- హద్దురాళ్లను తొలగించిన పంచాయతీ సిబ్బంది


బొమ్మకల్‌లో అక్రమ లేఅవుట్లలోని హద్దురాళ్లను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో అక్రమ లేఅవుట్లపై పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. అక్రమ లేఅవుట్లపై ఈనెల 19న గ్రామపంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో రాంబాబు విచారణ చేపట్టారు. మోఖాపై వెళ్లి కొన్ని సర్వేనంబర్లలో చేసిన లేఅవుట్ స్థలాలను పరిశీలించారు. అక్రమ లేఅవుట్లతో గ్రామపంచాయతీ ఆదాయానికి గండిపడుతుండటంతో రియల్టర్లపై కఠిన చర్యలు చేపట్టేందుకు ముందుకొచ్చారు. దీనిలో భాగంగా ముందుగా అక్రమంగా లేఅవుట్ చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు వీలుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. డీపీవో రవీందర్, డీఎల్‌పీవో రాంబాబు ఆదేశాలతో ఈనెల 21న పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లా అక్రమ లేఅవుట్లపై కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్వేనంబర్లు 9/బీ/2, 121,131, 142, 164/సీ, 176,679/9, 102/సీ, 195,201, 10,11,41,653, 654,672,673, 57, 97, 111లోని స్థలాల్లో అక్రమంగా లేఅవుట్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు 67, 168 ప్రకారం అక్రమ లేఅవుట్లపై చర్యలు చేపట్టేందుకు నిర్ణయించినట్లు వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లేఅవుట్ స్థలాల్లో ఏర్పాటు చేసిన హద్దురాళ్లను తొలగించేందుకు డీపీవో ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు.

హద్దురాళ్ల తొలగింపు

పోలీస్‌స్టేషన్‌లో అక్రమ లేఅవుట్లపై ఫిర్యాదు చేసిన అనంతరం పంచాయతీ అధికారులు హద్దురాళ్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. రెండు రోజుల నుంచి ఆయా సర్వేనంబర్లలోని స్థలాల్లో ఏర్పాటు చేసిన హద్దురాళ్లను కార్యదర్శి హిదైతుల్లా ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. ప్లాట్ల హద్దులు కనిపించకుండా చదును చేస్తున్నారు. అక్రమ కట్టడాలను జేసీబీతో కూల్చివేస్తున్నారు. అక్రమ లేఅవుట్లలో సిబ్బంది హద్దురాళ్ల తొలగించే ఫొటోలు, వీడియోలను తీసి పంచాయతీ, పోలీసు ఉన్నతాధికారులకు పంపించారు.

మళ్లీ ఏర్పాటు చేస్తే కేసు

అక్రమ లేఅవుట్లలోని హద్దురాళ్లు, కట్టడాలను పూర్తిగా తొలగించాం. తొలగించిన హద్దురాళ్ల ఫొటోలు, వీడియోలను సాక్ష్యంగా తీసి పోలీస్, పంచాయతీ అధికారులకు పంపించాం.మళ్లీ ఆయా సర్వేనంబర్లలోని స్థలాల్లో హద్దురాళ్లు ఏర్పాటు చేయడం, ఏదైనా కట్టడాలను నిర్మిస్తే నిర్మాణదారులపై పోలీసు కేసు నమోదు చేసేందుకు వీలుగా చర్యలు చేపట్టాం.

– సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి, ఎంపీవో, కరీంనగర్ మండలం

నేటి నుంచి వేంకటేశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


ప్రతిష్ఠోత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ బాధ్యులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ కొత్తపల్లిలోని చిన్నగుట్ట సచ్చిదానంద ఆశ్రమ ప్రాంగణంలో నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ బాధ్యులు ఎల్.రాజభాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యేక్ష పర్యవేక్షణలో జరిగే ఉత్సవాల్లో 24న ఆదివారం అంకురార్పణ, 25న భగవదనుజ్ఞ, సభాప్రార్థన, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్యంగ్రహణం, అగ్నిప్రతిష్ఠ, పంచగవ్యప్రోక్షణ, ఛాయాధివాసం, వాస్తు ఆరాదన, పర్యగ్నీకరణం, హవనం, క్షీర, జల, ఆధివాసం, విశేష అర్చన కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. 27న మృత్తికాస్నపనమ్, నేత్రోన్మీలనం, లాజాధివాసం, జపతర్పణాదులు, తత్త్వన్యాస హవనం, శాంతి హోమం, ధాన్య, పుష్ప, ఫల, శయ్యాదివాసం, గర్తపూజ, యంత్ర, బింబస్థాపన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 28న ద్వార బలిహరణ, మహాపూర్ణాహుతి, కుంభ యాత్ర, శ్రీచిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, మహాకుంభ సంప్రోక్షణ, దృష్టి కుంభ నీరాజనం, ప్రథమ ఆరాధన, నివేదన, ప్రదమ దర్శనం అనంతరం శ్రీభూనీళా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ బాధ్యులు నరహరి నారాయణరెడ్డి, బుర్ర మధుసూదన్‌రెడ్డి, తుమ్మల రమేశ్‌రెడ్డి, మనోహరచారి, సత్యనారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఎంఎల్ఎస్ రెడ్డి, కిషన్‌రెడ్డి, సుదర్శన్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

రేపు 131వ ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక (తెరవే) కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 131వ ఎన్నీల ముచ్చట్లు సాహిత్య కార్యక్రమాన్ని ఈనెల 25న ఉదయం 11 గంటలకు గట్టుదుద్దెనపల్లిలోని రైతు కవి, రచయిత పెంచాల రంగారావు తోటలో నిర్వహిస్తున్నట్లు తెరవే అధ్యక్షుడు సీవీ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ కవులు, కవయిత్రులు పాల్గొని విజయవంతం చేయలని కోరారు.


మానేరు స్కూల్‌లో హోలీ సంబరాలు


బ్లూ బెల్స్ స్కూల్‌లో..


భగవతిలో...

ముందస్తు హోలీ వేడుకలు

సప్తగిరికాలనీ/కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని పలు విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేడుకల్లో ఆయా విద్యాసంస్థల అధినేతలు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


వింధ్యావాలీలో..


మనోవికాస్‌లో..

షెల్ కంపెనీతో సీఎం రమేశ్ టోకరా

▶ మొదటి పేజీ తరువాయి



ఆయన సన్నిహితుడు పి. నాగేశ్వరరావు పక్కా స్కెచ్‌తో పాల్పడిన ఈ ఘరానా మోసంపై హైదరాబాద్‌లో కేసు నమోదైంది. సంతకాలు ఫోర్జరీ చేసి రిత్విక్ స్వాతి అనే బోగస్ కంపెనీ పేరిట సబ్‌కాంట్రాక్టు ఒప్పంద పత్రాలు సృష్టించి మరీ ఈ మోసానికి తెగబడ్డారు. ఈ మేరకు ప్రముఖ సినీ నటుడు, పీసీఎల్ ఇంటర్‌టెక్ లెన్‌హైడ్రో కాన్సార్షియం జాయింట్ వెంచర్ ఆథరైజ్డ్ సిగ్నేచరీగా ఉన్న తొట్టెంపూడి వేణు, కేంద్ర మాజీమంత్రి కావూరి సాంబశివరావు కుమారుడు కావూరి భాస్కర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు గత ఏడాదే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారిపై ఐపీసీ సెక్షన్లు 420, 468, 471 కింద కేసు నమోదు చేశారు. ఫోర్జరీ సంతకాలతో సీఎం రమేశ్ పాల్పడిన ఈ మోసానికి సంబంధించిన మరిన్ని కీలక ఆధారాలను తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కర్‌రావు హైదరాబాద్ పోలీసులకు శనివారం అందించారు. కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని కోరారు. ఈ ఘరానా మోసం వివరాలిలా ఉన్నాయి..

పీసీఎల్ కన్సార్షియంకు తెహ్రీ హైడ్రో ప్రాజెక్టు..

ఉత్తరాఖండ్‌లో తెహ్రీ హైడ్రో ప్రాజెక్టు వద్ద సివిల్ ప్రాజెక్టు కాంట్రాక్టును పీసీఎల్ ఇంటర్‌టెక్ కన్సార్షియం దక్కించుకుంది. ఈ మేరకు తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీహెచ్‌డీసీ)తో 2002లో ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం ఆ ప్రాజెక్టు వ్యవహారాలను నిర్వహించేందుకు పీసీఎల్ కన్సార్షియం తమ ప్రతినిధిగా కావూరి భాస్కర్‌రావును జనరల్ పవర్ ఆఫ్ అటర్నీ (జీపీఏ) ద్వారా నియమించింది. కొంతకాలం ప్రాజెక్టు పనులు చేపట్టిన తరువాత పీసీఎల్ కన్సార్షియంకు టీహెచ్‌డీసీతో విభేదాలు తలెత్తాయి. దీంతో ఆ వ్యవహారం న్యాయస్థానం ఆర్బిట్రేషన్‌కే చేరింది. ఢిల్లీ కోర్టులో ప్రస్తుతం వ్యాజ్యం కొనసాగుతోంది. పీసీఎల్ కన్సార్షియంకు చెల్లించాల్సిన బిల్లుల మొత్తాన్ని టీహెచ్‌డీఏ న్యాయస్థానంలో డిపాజిట్ చేసింది.

ఫోర్జరీ సంతకాలతో సీఎం రమేశ్ మోసం..

ఇలా ఓ వైపు ఈ న్యాయ వివాదం కొనసాగుతుండగా.. సీఎం రమేశ్ గుట్టుచప్పుడు కాకుండా ఓ కథ నడిపించారు. పి. నాగేశ్వరరావు అనే వ్యక్తి తమ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని పీసీఎల్ కన్సార్షియం 2011లో గుర్తించింది. ఆ మేరకు ఆయన ఓ జీపీఏను కూడా సృష్టించారని తెలుసుకుని షాక్‌కు గురైంది. అంతేకాదు.. తమ కన్సార్షియం ప్రతినిధిగా చెప్పుకుంటూ ఆయన సీఎం రమేశ్‌కు చెందిన బోగస్ కంపెనీ రిత్విక్ స్వాతికి టీహెచ్‌డీఏ ప్రాజెక్టు సబ్ కాంట్రాక్టును ఇచ్చినట్లు పత్రాలు సృష్టించారు. వాటిని చూపిస్తూ టీహెచ్‌డీఏ ప్రాజెక్టు బిల్లులు పొందేందుకు సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ స్వాతి కంపెనీ వ్యవహారం నడిపింది. పి. నాగేశ్వరరావు అనే వ్యక్తి కేవలం పరిమిత కాల జీపీఏతో పీసీఎల్ కన్సార్షియం ప్రతినిధిగా టీహెచ్‌డీఏ ప్రాజెక్టు పనులను పర్యవేక్షించారు. కానీ, ఆయన వ్యవహారశైలి నచ్చక ఆ జీపీఏ కాలపరిమితి ముగియగానే ఆయన్ని తొలగించారు. అయినాసరే.. తమ సంతకాలు ఫోర్జరీ చేసి మరోజీపీఏ సృష్టించుకోవడంతో పాటు.. సీఎం రమేశ్‌కు చెందిన బోగస్ కంపెనీ రిత్విక్ స్వాతితో తమ కంపెనీ పేరుతో సబ్ కాంట్రాక్టు ఒప్పందం చేసుకున్నట్లుగా పీసీఎల్ కన్సార్షియం గుర్తించింది. ఈ ఒప్పందంలో పి.నాగేశ్వరరావు తన చిరునామాలో ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేటను పేర్కొన్నారు. దీనిపై పీసీఎల్ కన్సార్షియం చిలకలూరిపేట పోలీసులను ఆశ్రయించగా ఆయన తప్పుడు చిరునామా ఇచ్చారని గుర్తించారు. అసలు చిరునామాను కూడా గుర్తించి వెల్లడించారు. షెల్ కంపెనీ ద్వారా నిధులు కొల్లగొట్టేందుకు ఉద్దేశించిన ఆ బోగస్ సబ్ కాంట్రాక్టు ఒప్పందం ద్వారా సీఎం రమేశ్, పి.నాగేశ్వరరావు ఈ మోసానికి పాల్పడ్డట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో పీసీఎల్ కన్సార్షియం ఈ విషయాన్ని ఈ–మెయిల్ ద్వారా టీహెచ్‌డీఏ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందిందని టీహెచ్‌డీఏ ఉన్నతాధికారులు నిర్ధారించారు.

సీఎం రమేశ్ రూ.450 కోట్లు కొల్లగొట్టారు : కావూరి భాస్కర్‌రావు

‘పీసీఎల్ జాయింట్ వెంచర్ కంపెనీకి సంబంధించి సీఎం రమేశ్ ఫోర్జరీకి పాల్పడ్డారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ఏసీపీ ఎదుటు హాజరై వాంగ్మూలం ఇచ్చాను. దాదాపు అరగంట పాటు నా స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. ఈ ఫోర్జరీ ద్వారా సీఎం రమేశ్ దాదాపు రూ.450 కోట్లు స్వాహా చేశారు. దీనికి సంబంధించి కోర్టులోనూ ఓ కేసు నడుస్తోంది. సీఎం రమేశ్‌పై సీబీఐ దర్యాప్తు జరిగితే రూ.వేల కోట్ల స్కాంలకు సంబంధించిన విషయాలు బయటకొస్తాయి’.. అని కావూరి భాస్కర్‌రావు మీడియాకు చెప్పారు.

మరోవైపు.. ఆ సబ్ కాంట్రాక్టు ఒప్పంద పత్రాలను కావూరి భాస్కర్‌రావు ట్రూత్‌ల్యాబ్ అనే ప్రైవేటు సంస్థ ద్వారా ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించారు. పి. నాగేశ్వరరావు, రిత్విక్ స్వాతి కంపెనీ ఉద్దేశపూర్వకంగా సంతకాలు ఫోర్జరీ చేసినట్లు ఆ పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఈ అంశాన్ని పీసీఎల్ కన్సార్షియం ప్రతినిధులైన తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కర్‌రావు హైదరాబాద్ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం రమేశ్‌కు చెందిన రిత్విక్ స్వాతి కంపెనీ ప్రధాన కార్యాలయంలోనే ఫోర్జరీ సంతకాలతో బోగస్ సబ్ కాంట్రాక్టు ఒప్పందం చేసుకున్నారని తేలింది. దీంతో జూబ్లీహిల్స్ పోలీసులకు గత ఏడాది నవంబరు 4న ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి ఫోర్జరీ సంతకాల విషయాన్ని నిర్ధారించాలని కోరారు. తప్పుడు ఒప్పందంతో తమ కంపెనీని మోసం చేసిన సీఎం రమేశ్, పి. నాగేశ్వరరావులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీరి మోసానికి సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉండటంతో వారిపై హైదరాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తొట్టెంపూడి వేణు, కావూరి భాస్కర్‌రావు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాసరెడ్డిని శనివారం కలిసి ఈ కేసు దర్యాప్తు వేగవంతం చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కేసుకు సంబంధించి తాము సేకరించిన మరిన్ని కీలకపత్రాలను కూడా పోలీసులకు అందించారు.

ఫోరెన్సిక్ పరీక్షల్లో ఫోర్జరీ నిర్ధారణ..

సరైన కారణం ఉండాలి

▶ మొదటి పేజీ తరువాయి

కారణంతో జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 69 కింద నిర్బంధం సరికాదని వ్యాఖ్యానించారు. జీఎస్టీ అంశంలో వ్యాపారులను అరెస్టు చేయడానికి అనుమతించే ముందు అందుకు కారణాలను లిఖితపూర్వకంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. శనివారం ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ (సౌత్‌జోన్), తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ పన్నుల సదస్సుకు జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ‘ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడం రెండు రకాల సంతోషానిచ్చింది. పన్ను అంశంపై అనుభవం ఉన్న న్యాయవాదిగా ఇంత మంది ట్యాక్స్ ప్రాక్టీషనర్ల మధ్య పాల్గొనడం ఒకటైతే.. హైదరాబాద్‌ను సందర్శించడం మరొకటి. ఇక్కడ న్యాయమూర్తిగా, ప్రధాన న్యాయమూర్తిగా పనిచేయడంతో నగరంతో అనుబంధం ఏర్పడింది. హైదరాబాద్ వస్తే ఇంటికి వచ్చినట్లే ఉంటుంది. ఇలాంటి అవకాశాలు వచ్చినప్పుడు వీలున్నంత వరకు నగరాన్ని సందర్శిస్తా’అని చెప్పారు. ఎవరైనా ఆదాయపు పన్ను నివేదిక సమర్పిస్తే.. అది తప్పుడు నివేదిక అని పూర్తిగా నమ్మితే మాత్రమే అసెస్‌మెంట్‌ను తిరిగి ప్రారంభించాలని సుప్రీంకోర్టు గతంలో పేర్కొందని ఆయన వివరించారు.

‘ఆయుధాన్ని’దుర్వినియోగం చేయొద్దు..

‘సీజీఎస్టీలోని సెక్షన్ 69, సెక్షన్ 83.. రాష్ట్ర జీఎస్టీలోని ఇవే నిబంధనలు అధికారులకు కఠిన అధికారాలను అందించాయి. ఈ రెండు నిబంధనలు రెవెన్యూ చేతిలో బలమైన ఆయుధాలు. వీటిని జాగ్రత్తగా, తక్కువగా ఉపయోగించాలి. ఆయుధాన్ని అతిగా ప్రయోగించినా.. దుర్వినియోగపరచినా.. దాని శక్తిని కోల్పోతుందని మనకు తెలుసు. ఇదే జరిగితే అధికారులపై నమ్మకం పోతుంది. ఒక నిబంధన ఎంత కఠినంగా ఉంటే న్యాయపరమైన పరిశీలన కూడా అంతే కఠినంగా ఉంటుందన్న విషయం గుర్తుంచుకోవాలి’అని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ సూచించారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. ‘పన్ను వసూలు అనేది సమాజానికి నాడు, నేడు కీలకమైన అంశాల్లో ఒకటి. ఇది ఏ దేశంలో అయినా ప్రభుత్వాన్ని నడపడానికి ఎంతో అవసరం. శతాబ్దాల నుంచి పన్ను విధింపు చట్టాలు మారుతూ వస్తున్నాయి. ఒక తేనెటీగ పువ్వు నుంచి మకరందాన్ని ఎలా సేకరిస్తుందో పన్ను వసూలు కూడా అంతే సున్నితంగా జరగాలని కౌటిల్యుడు వందల సంవత్సరాల క్రితమే చెప్పాడు. ఆధునిక భారత్‌లో కొత్త పన్ను విధానాలతో దేశం పురోగతిలో పయనిస్తోంది’అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తుకారాంజీ, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి, జస్టిస్ అనిల్‌కుమార్, అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నరసింహ శర్మ, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయ్‌దేవ్, టీటీపీఏ అధ్యక్షుడు కె.నర్సింగ్‌రావు, ఏఐఎఫ్‌టీపీ (సౌత్‌జోన్) చైర్మన్ రామరాజు శ్రీనివాస్‌రావు, సుదీర్ వీఎస్, మహమ్మద్ ఇర్షాద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చదరపు మీటర్‌కు రూ.6 వేలు చెల్లించండి

- ‘ఏపీఐఐసీ’ ప్లాట్ లబ్ధిదారుకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జీడిమెట్ల లోని ఇండస్ట్రియల్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్–2లో ప్లాట్ పొందిన లబ్ధిదారు రష్మీ అభిచందని చదరపు మీటర్‌కు రూ.6 వేలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. మార్కెట్ విలువ గజానికి రూ.12 వేలుగా ఉండగా, ఇప్పటికే రూ.6 వేలు చెల్లించారు కాబట్టి మిగిలిన మొత్తాన్ని 3 నెలల్లో చెల్లించాలని అభిచందణికి స్పష్టం చేసింది. ‘జీడిమెట్లలోని ఇండస్ట్రియల్ హౌసింగ్ కాంప్లెక్స్ ఫేజ్–2లో రష్మీ అభిచందనికి 523 గజాల ప్లాట్‌ను (నంబర్ 12) తక్కువ ధరకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) కేటాయించడం చట్టవిరుద్ధం. ఏపీఐఐసీ ఉద్యోగి అభిచందని ప్రొబేషన్ పీరియడ్‌లో ఉండగా ప్లాట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తొలుత ఆమెకు 265 చదరపు మీటర్ల ప్లాట్ నం.15ను తాత్కాలికంగా కేటాయించారు. చదరపు మీటర్‌కు రూ.6,000 చెల్లించారు. తర్వాత 523.50 చదరపు మీటర్ల ప్లాట్ నంబర్ 12కోసం ఆమె అభ్యర్థించగా కేటాయించారు. మొత్తం రూ.31,41,000 చెల్లించి సేల్ డీడ్ పొందారు. చట్టవిరుద్ధంగా ప్లాట్ పొందినందున.. సదరు ప్లాట్‌కు బహిరంగ వేలం నిర్వహించేలా ఏపీఐఐసీకి ఆదేశాలు ఇవ్వాలి. మోసానికి పాల్పడిన రష్మి, మరో ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకోవాలి’ అంటూ న్యాయవాది పాశం కృష్ణారెడ్డి తరఫున న్యాయవాది గాడిపల్లి మల్లారెడ్డి 2011లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. ‘పిటిషనర్‌కు గతంలోనే ఇళ్లు, రెండు ప్లాట్లు ఉన్నాయి. భూసేకరణ జరిపి ఏపీఐసీసీ పరిశ్రమలకు కేటాయించాలి తప్ప.. ఇళ్ల స్థలాలు ఇవ్వడం కూడా సరికాదు. అది కూడా ప్రొబేషన్‌లో ఉన్న ఉద్యోగికి కేటాయించడం సమర్థనీయం కాదు. ఇలా ప్లాట్ కేటాయించడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది’ అని వాదనలు వినిపించారు. అభిచందని తరఫు న్యాయవాది వాదిస్తూ.. పిటిషన్‌ను ఉద్దేశపూర్వకంగా దాఖలు చేశారని, ప్రజా ప్రయోజనం లేదని వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. భూమి కేటాయింపులో ఎలాంటి జోక్యం అవసరం లేదని అభిప్రాయపడింది. ప్లాట్ మార్కెట్ విలువలో సగం మొత్తాన్ని గతంలో చెల్లించినందున.. మిగిలిన మొత్తాన్ని 3 నెలల్లోగా చెల్లించాలని లబ్ధిదారును ఆదేశించింది.

వసతి గృహాల బకాయిలు రూ.343 కోట్లు!

- తొమ్మిది నెలలుగా విడుదల కాని డైట్ చార్జీలు
- దీంతో నిర్వహణ కష్టంగా మారిందంటున్న అధికారులు
- అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనం పెడుతున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: సంక్షేమ వసతి గృహాల్లో బకాయిలు పేరుకుపోయాయి. తొమ్మిది నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణ తలకుమించిన భారంగా మారిందంటూ వసతిగృహ సంక్షేమాధికారులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల విడుదలకు గ్రీన్‌చానల్ ఏర్పాటు చేస్తామని చెప్పినా.. ఇప్పటి వరకు పైసా విడుదల కాని పరిస్థితి ఉందని అంటున్నారు. సంక్షేమ వసతిగృహాలకు కనీసం డైట్ చార్జీలకు సంబంధించిన బిల్లులు కూడా ప్రభుత్వం ఇవ్వలేదు. మరో వారం రోజుల్లో 2023–24 ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో ఆలోపు నిధులు విడుదల కోసం వసతిగృహాల నిర్వహణ అధికారులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలో 1,550 హాస్టళ్లున్నాయి. వీటి పరిధిలో 2.28 లక్షల మంది విద్యార్థులున్నారు. ఈ మూడు సంక్షేమ శాఖలకు సంబంధించిన హాస్టళ్ల బిల్లులు దాదాపు రూ.343 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

అప్పులు చేసి నిర్వహణ..

వసతిగృహాల నిర్వహణకు సంబంధించి చెల్లింపులను ప్రభుత్వం గ్రీన్‌చానల్ పద్ధతిలో ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది. అయితే ఈ నిర్ణయం ఇప్పటివరకు అమలు కాలేదు. ఇది వరకు వసతిగృహాలకు సంబంధించిన చెల్లింపులు ప్రతి త్రైమాసికంలో ఒకసారి జరిగేవి. ఒక్కోసారి చెల్లింపులు నిలిచినప్పటికీ.. ఆ తర్వాతి త్రైమాసికంలో ప్రాధాన్యత క్రమంలో నిధులను విడుదల చేయడంతో నిర్వాహకులకు కొంత ఊరట దక్కేది. కానీ గత తొమ్మిది నెలలుగా సంక్షేమ వసతిగృహాలకు సంబంధించిన బిల్లులు క్లియర్ కాలేదు. గతేడాది జూన్‌లో నిధులను విడుదల చేసిన ప్రభుత్వం.. ఆ తర్వాతి నుంచి చెల్లింపులన్నీ నిలిపివేసింది. దీంతో నిర్వాహకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెలా కిరాణా సరుకులు, కూరగాయలు, ఇతర సరుకుల కోసం వసతిగృహ సంక్షేమాధికారులు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. కొన్నిచోట్ల వ్యాపారులకు తర్వాత డబ్బులు చెల్లిస్తామని ఇప్పటివరకు సరుకులు తీసుకోగా.. ఇప్పుడు బకా యిలు చెల్లిస్తేనే సరుకులిస్తామని వ్యాపారులు తేల్చిచెప్పడంతో సంక్షేమాధికారులు తలపట్టుకుంటున్నారు.

విద్యార్థుల భోజనంపై ప్రభావం..

హాస్టళ్లకు నిధులు విడుదల చేయకపోవడంతో ఆ ప్రభావం విద్యార్థులకు అందించే భోజనంపైన తీవ్రంగా పడుతోంది. అరువు పద్ధతిలో సరుకులు తీసుకువస్తున్నప్పటికీ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వారంలో రెండ్రోజులు ఉడికించిన గుడ్లు, ఒక రోజు మాంసాహారం ఇవ్వాల్సి ఉండగా.. చాలా హాస్టళ్లలో పప్పు, చారు, కూరగాయలతో కూడిన ఆహారాన్నే అందిస్తున్నారని వాపోతున్నారు.

మావోయిస్టుల కదలికలపై నిరంతర నిఘా

- మూడు రాష్ట్రాల సరిహద్దు అధికారులతో సమావేశం
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల అలర్ట్
- హాజరైన రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్



ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర పోలీసు అధికారులతో రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్

గోదావరిఖని/మంచిర్యాలక్రైం : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులతో గడ్చిరోలి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ అంకిత్‌గోయల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మావోయిస్టుల కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి సుదీర్ఘంగా చర్చించారు. మావోయిస్టుల కదలికలు, సమాచారం పరస్పరం పంచుకోవాలని నిర్ణయించారు. ఫలితంగా వారిని కట్టడి చేయడం సులభతరమవుతుందని అభిప్రాయపడ్డారు. మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలు సజావుగా సాగేలా కృషిచేయాలని సీపీ అన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలన్నారు. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలతో సరిహద్దులో వున్న సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఎన్‌బీడబ్ల్యూ వారెంట్ల విషయంలో మూడు రాష్ట్రాల పోలీసులు పరస్పరం సహకరించుకోవాలని ఆయన కోరారు.

హెలికాప్టర్‌లో సమావేశానికి..

మూడు రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశానికి మన రాష్ట్రం నుంచి పలు జిల్లాల అధికారులు పాల్గొన్నారు. హెలికాప్టర్ ద్వారా రామగుండం సీపీ శ్రీనివాస్ సమావేశానికి బయలు దేరివెళ్లారు. రామగుండం సీపీ, ఆసిఫాబాద్, భూపాల్‌పల్లి ఎస్పీలు, మంచిర్యాల డీసీపీ రామగుండం సీపీ ప్రాంగణంలోని హెలిప్యాడ్ నుంచి గడ్చిరోలికి వెళ్లి సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో జగదీశ్ ఎన్ మీనా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఆపరేషన్స్), గడ్చిరోలి, నీలోత్పల్, గడ్చిరోలి ఎస్పీ నిఖిల్ పింగళే, ఎస్పీ గోండియా, కిరణ్‌ఖరే, భూపాల్‌పల్లి ఎస్పీ సురేశ్‌కుమార్, ఆసిఫాబాద్ఎస్పీ అశోక్‌కుమార్, మంచిర్యాల డీసీపీ కుమార్‌చింత, ఏడీ ఎస్పీ, గడ్చిరోలి(అడ్మిన్) తదితరులు పాల్గొన్నారు.

సాత్నాల, మత్తడివాగు.. డెడ్‌స్టోరేజ్!





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. మార్చి మొదటి వారం నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఓవైపు భూగర్భ జలాలు అడుగంటుతుండగా.. ప్రాజెక్టులు నీరు లేక వెలవెలబోతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని మత్తడివాగు, జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ అడుగంటిపోయి డెడ్‌స్టోరేజీకి చేరాయి. మైదానాలను తలపిస్తుండటం ఎండల తీవ్రతకు అద్దం పడుతోంది. సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 286.50 మీటర్లు కాగా ప్రస్తుతం 2807.75 మీటర్లుగా ఉంది. అలాగే మత్తడివాగు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు. ప్రస్తుతం 272.90 మీటర్లుగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాంకిషన్



మాట్లాడుతున్న ఆకుల రాంకిషన్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆకుల రాంకిషన్ అన్నారు. శనివారం ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీంలో మార్పులు కోరుతూ, కొత్త రివైజ్డ్ వేత నం ఇవ్వాలన్నారు. ఈవిషయంలో కార్పొరేట్ యా జమాన్యానికి వినతిపత్రం అందించాలని, మిని మం పింఛన్ రూ.1,000 నుచి రూ.7,500కు పెంచా లని, నేషనల్ ఆజిటేషన్ కమిటీ సంవత్సరం నుంచి చేపట్టే కార్యక్రమాలకు మద్దతు అందించాలని, కనీస మద్దతు ధర కోసం దేశవ్యాప్తంగా రైతు సంఘాలు చేస్తున్న ఆందోళనలకు మద్దతు తెలియజేయాలని, ఈపీఎఫ్ ద్వారా ఈపీఎస్–95 పింఛన్లు సత్వరమే చెల్లించేలా ఎన్టీపీసీపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈడీకి వినతి పత్రం అందించాలని తీర్మానించారు. ఎన్టీపీసీలో విధులు నిర్వహించి కేంద్ర ప్రభుత్వం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులుగా నియమి తులైన వడ్డెపల్లి రాంచందర్, ఎన్టీపీసీ ఎస్సీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, కార్పొరేటర్ కొలిపాక సుజాతను సన్మానించాలని తీర్మానించినట్లు స్పష్టం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి సత్తు ముత్యాలు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ సురేందర్, ఉపాధ్యక్షులు దేవ లాలయ్య, అంబటి సత్యనారాయణ, నర్సయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ప్రజలను మాయచేసి గెలిచిన కాంగ్రెస్

- బీఆర్‌ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల తిరస్కరణకు గురై ఓడిపోలేదని, కాంగ్రెస్ పార్టీ.. వారిని మాయలో పడేసి గెలిచిందని బీఆర్‌ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం మార్కండేయ కాలనీలోని లక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. రైతులకు అనేక రకాల ప్రయోజనాలను చేకూర్చిందని తెలిపారు. అయినా ప్రజలు మరేదో కొత్తదనం కోరుకుని బీఆర్‌ఎస్‌ను ఓడించారని వివరించారు. మూడు నెలల తర్వాత కొత్తదనం భూటకమని తెలుసుకొని ఓడించినందుకు బాధపడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటుతుందన్నారు. ఇందుకోసం ప్రతీ కార్యకర్త శ్రమిస్తే బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు సులభమతరమవుతుందని అన్నారు. కొప్పుల ఈశ్వర్ ఒక్కడే ఈప్రాంత బిడ్డగా ప్రజల కష్టాలు తెలిసినవారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండగట్టు ఆలయ ఈవో సస్పెన్షన్



వెంకటేశ్

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయ ఈవో వెంకటేశ్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. కొద్దిరోజులుగా కొండగట్టులో భారీఎత్తున అక్రమాలు జరగడం.. రూ.52 లక్షలు దుర్వినియోగం కావడం.. ఇతరత్రా ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో రెండురోజుల క్రితం దేవాదాయ అడిషనల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి విచారణ చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ నివేదిక మేరకు వెంకటేశ్‌ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో కరీంనగర్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌ను నియమించారు. ఇటీవల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసాచారి, తాజాగా ఈవో వెంకటేశ్వర్ సస్పెన్షన్ కావడం చర్చనీయాంశంగా మారింది. నెలరోజుల వ్యవధిలోనే ఇద్దరు అధికారులు సస్పెండ్ కావడంతో అధికారుల పనితీరుపై భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎర్త్ అవర్‌పై అవగాహన



ముధోల్: బాసర ఆర్జీయూకేటీలో శనివారం ఎర్త్‌అవర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 500 మంది విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొన్నారు. విద్యుత్ పొదుపుపై స్పెషలాఫీసర్ సృజన, కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ విజయ్‌కుమార్, రామారావు, రమాదేవి, రాములు, శ్రావణ్‌కుమార్, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ దత్తు, అధ్యాపకులు ప్రకాశ్, స్వప్నిల్, వలంటీర్లు పాల్గొన్నారు.

తండ్రి కళ్లెదుటే కొడుకు దుర్మరణం

- కారు ఢీకొని మూడేళ్ల బాలుడు మృతి



మహర్షి(ఫైల్)

కడెం: కన్న తండ్రి కళ్లెదుటే కొడుకు ప్రాణం పోయింది. కారు రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. నిర్మల్ జిల్లా కడెం మండలం కొత్తమద్దిపడగ గ్రామంలో శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మోతె లక్ష్మి, నర్సయ్య దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. నర్సయ్య తన కుమారుడు మహర్షి(3)తో కలిసి ఇంటి ముందు ఉన్నాడు. అదే సమయంలో కొద్ది దూరం నుంచి సాదుల మహేష్ తన కారును రివర్స్ తీస్తున్నాడు. కారు నెమ్మదిగా రావాలని నర్సయ్య కేకలు వేస్తుండగానే.. వెనుక వైపు వేగంగా వచ్చి మహర్షిపై నుంచి వెళ్లి గోడను ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో మహర్షి అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన సాదుల మహేష్ గత రెండు నెలలుగా కొత్తమద్దిపడగలో ఉంటూ ఆర్ఎంపీగా చేస్తున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.

ప్రాణహితలో సాచ్చిరేవులు





వేమనపల్లి: తెలంగాణ జలప్రదాయని ప్రాణహిత నదికి వరద తీవ్రత గణనీయంగా తగ్గడంతో పలుచోట్ల కాలినడక సాచ్చి రేవులు మొదలయ్యాయి. నదిపై వంతెనలు లేకపోగా సాచ్చిరేవులతో రాకపోకలు కొనసాగిస్తున్నారు. వార్ధా, వైన్‌గంగా సంగమంతో కౌటాల మండలం తుమ్మిడిహెట్టి పైభాగంలో ప్రాణహిత నది ఆవిర్భవించింది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరోంచ అహేరి తాలూక పరిధిలోని సరిహద్దు గ్రామాలకు, ఆసిఫాబాద్ జిల్లా కౌటాల, బెజ్జూర్, దహెగాం, మంచిర్యాల జిల్లా వేమనపల్లి, కోటపల్లి మండలాల సరిహద్దుగా ప్రాణహిత ప్రవహిస్తోంది. దీంతో ఈ సరిహద్దు గ్రామాలకు ఏడాదిలో ఎనిమిది నెలలు పడవ ప్రయాణం, నాలుగు నెలలు కాలినడకన సాచ్చి రేవుల ద్వారానే రాకపోకలు కొనసాగుతాయి. వంతెన నిర్మాణం చేపట్టి దూరభారం తగ్గించాలని సరిహద్దు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైరల్




నా స్టూడెంట్ టీచర్ అయింది!

'ఎక్స్'లో రేవ్ అనే టీచర్ తన స్టూడెంట్ ఆలిషా గురించి చేసిన పోస్ట్ వైరల్ అయింది. స్కూల్ రోజుల్లో ఆలీషా అల్లరిపిల్ల. రేవ్ మాటల్లోనే చెప్పాలంటే రెబెల్. 'ఈ అమ్మాయి భవిష్యత్ ఎలా ఉండబోతుందో' అంటూ ఆలీషా గురించి బెంగపడేది రేవ్. కట్ చేస్తే... ఆలిషా ఇప్పుడు ముంబైలోని ఒక స్కూల్‌లో స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్స్‌కు టీచర్. 'మొండిఘటం. ఏ పనీ చేయలేదు... అని నా గురించి రేవ్ టీచర్‌కు చెప్పేవారు. అయితే టీచర్ మాత్రం నన్ను ఎప్పుడూ ప్రేమగా చూసుకునేది. అలాంటి ప్రేమను స్పెషల్ నీడ్స్ చిల్డ్రన్స్‌కు పంచాలనుకుంటున్నాను' అంటుంది అలీషా.



ఈ హోలీ రంగులను హాయిగా తినవచ్చు!

ముంబైకి చెందిన ఇద్దరు సోదరుల ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ నెటిజనులను ఆకట్టుకుంటోంది. గౌరంగ్, సౌరభ్ అనే సోదరులు 'మాంక్స్ బూఫీ' బ్రాండ్‌పై 'అబీర్ హోలి కలర్స్' పేరుతో సహజ రంగులను మార్కెట్‌లోకి తీసుకువచ్చారు. పువ్వులు, మొక్కజొన్న పిండి... మొదలైన వాటితో భిల్ తెగ గిరిజనులు తయారు చేసిన ఈ రంగులను తినవచ్చు కూడా!



లియాండర్ పేస్... ప్రముఖ డ్యాన్సర్!

'ఎక్స్'యూజర్ పృథ్వీ తన చిన్నారి మేనకోడలు వర్క్‌బుక్ నుంచి పోస్ట్ చేసిన స్నాప్‌చాట్ నెట్‌లోకంలో నవ్వులు పూయిస్తోంది. ఈ వర్క్‌బుక్‌లో'మ్యాచ్ ది ఫాలోయింగ్' శీర్షిక కింద ఎడమవైపు ప్రముఖుల పేరు, కుడివైపు ఆయా రంగాలకు సంబంధించిన బొమ్మలు ఇచ్చారు. ఏ వ్యక్తి ఏ రంగానికి చెందిన వారో జత చేయాలి. విరాట్ కోహ్లీ-క్రికెటర్, లతా మంగేష్కర్-సింగర్... ఇలా అన్నిటికీ కరెక్ట్‌గానే జత చేసింది ఆరు సంవత్సరాల చిన్నారి. అయితే లియాండర్ పేస్ దగ్గరే వచ్చింది పేచీ. ప్రభుదేవాతో పాటు లియాండర్ పేస్‌ను కూడా డ్యాన్సర్‌ని చేసింది. ఇది చూసి సరదాకారులు ఊరుకుంటారా ఏమిటి? మీమ్సే మీమ్స్!

వేడి వేడి ప్రెషర్ కుకర్ ఉండగా... ఐరన్ బాక్స్ దండగా

'లిమిటెడ్ రీసోర్స్ నుంచే కొత్త ఐడియాలు జనించునోయి' అని మరో సారి చెప్పడానికి ఈ వైరల్ వీడియో క్లిప్ సాక్ష్యం. కోల్‌కతాకు చెందిన మౌమితా చక్రవర్తి వేడి వేడి ప్రెషర్ కుక్కర్‌ను ఉపయోగించి షర్ట్‌ను ఐరన్ చేస్తున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ట్విట్టర్‌లో రీపోస్ట్ చేసిన ఈ వీడియో రెండు లక్షల యాభై వేల వ్యూస్‌ను దాటింది.





లవ్ స్కానింగ్

ముంబైలోని మహాలక్ష్మి రేస్‌కోర్స్ ప్రాంతంలో జరిగిన మ్యూజిక్ ప్రోగ్రామ్‌కు హాజరైన ఒక యువకుడి టీ షర్ట్ అందరి దృష్టిని ఆకర్షించింది. 22 సంవత్సరాల హార్దిక్ టీ షర్ట్ వెనకాల ఐ-క్యాచింగ్ మెసేజ్ 'ఫర్ సింగిల్ పీపుల్ వోన్లీ'తోపాటు క్యూ ఆర్ కూడా ఉంది. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే నేరుగా అతడి టిండర్ ప్రొఫైల్‌లోకి తీసుకువెళుతుంది. హార్దిక్ డిజిటల్ ఫ్లర్టింగ్ అనేది టాకింగ్ పాయింట్ కావడమే కాదు సోషల్ మీడియాలో వైరల్ అయింది

బయోపిక్

సినిమాలు పాత కథలను తవ్వి పోస్తున్నాయి.
చరిత్ర గతిని వెండి తెర మీద పునఃసృష్టిస్తున్నాయి.
స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో ఘట్టాలు. ఎందరో త్యాగమూర్తులు.
కాని పురుషుల బయోపిక్‌లు వచ్చినట్టుగా స్త్రీలవి రాలేదు.
తాజాగా విడుదలైన 'అయ్ వతన్ మేరే వతన్' సినిమా
నాటి వీర వనిత ఉషా మెహతా జీవితాన్ని చూపింది.
బ్రిటిష్‌కు వ్యతిరేకంగా సీక్రెట్ రేడియో నడిపిన ఉషా మెహతా ఎవరు?

వెండి తెర మీద రహస్య రేడియో


ఉషా మెహతా

'దిసీజ్ కాంగ్రెస్ రేడియో కాలింగ్ ఆన్ 42.34 మీటర్స్ సమ్‌వేర్ ఇన్ ఇండియా'... ఈ అనౌన్స్‌మెంట్ బ్రిటిష్ వారిని గడగడలాడించింది. మునికాళ్ల మీద పరిగెత్తిచ్చింది. ఒక బుల్లి రహస్య రేడియో స్టేషన్‌ని, దాని నిర్వాహకులను అరెస్ట్ చేయడానికి పిచ్చెక్కినట్టు తిరిగేలా చేసింది. మూడు నెలల పాటు బ్రిటిష్‌వారిని ముప్పుతిప్పలు పెట్టిన ఆ రేడియో నిర్వాహకురాలి పేరు ఉషా మెహతా.

గాంధీ పిలుపు విని...

ఉషా మెహతా గుజరాత్‌లోని సూరత్ సమీపంలో ఉన్న సారస్ అనే ఊళ్లో 1920లో జన్మించింది. ఐదేళ్ల వయసులో గాంధీజీని అహ్మదాబాద్‌లో చూసింది. 8 ఏళ్ల వయసులో వాళ్ల ఊరి దగ్గర గాంధీజీ చరఖా కార్యక్రమం నిర్వహిస్తే ఉషా పాల్గొని కొద్దిసేపు చరఖా తిప్పింది. బాల్యంలోనే గాంధీజీ మీద గొప్ప భక్తి పెంచుకున్న ఉషా 12 ఏళ్ల వయసులో తండ్రి వృత్తిరీత్యా బొంబాయికి మారడంతో తన దేశభక్తిని చాటుకునే అవకాశం పొందింది.


'అయ్ వతన్ మేరే వతన్'లో సారా అలీఖాన్

డూ ఆర్ డై

1942 ఆగస్టు 8న బొంబాయిలో గాంధీజీ క్విట్ ఇండియా పిలుపునిచ్చారు. 'డూ ఆర్ డై' లేదా 'కరో యా మరో' నినాదాలు మిన్నంటాయి. 'ఇక భారత ప్రజలు నాయకుల కోసం ఎదురు చూడొద్దు. ప్రజలే నాయకులు' అని గాంధీజీ పిలుపునిచ్చారు. 22 ఏళ్ల ఉషా మెహతా తన స్నేహితులైన విఠల్ దాస్ ఖాకడ్, చంద్రకాంత్ ఝావేరీ, బాబూభాయ్ ఠక్కర్‌లతో కలిసి ఆ మీటింగ్‌కు వెళ్లింది. ఉత్తేజితురాలైంది. అప్పటికే స్వతంత్రోద్యమ వార్తల మీద బ్రిటిష్ ప్రభుత్వం నిషేధం విధించింది. ఉద్యమం ఉధృతం కావాలంటే రేడియో మాధ్యమం ద్వారా వార్తలు అందించాల్సిన అవసరం ఉందని ఉషా మెహతా తన స్నేహితులతో చెప్పింది. దేశం కోసం ఏ త్యాగానికైనా సిద్ధపడాలని పిలుపునిచ్చింది.

రహస్య కాంగ్రెస్ రేడియో

బ్రిటిష్ ప్రభుత్వంలో జడ్జిగా పని చేస్తున్న తండ్రి నివారించినా వినకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఉషా బొంబాయిలో షికాగో రేడియో ట్రాన్స్‌మిషన్‌ను చూస్తున్న మరో మిత్రుడు మోత్వాని సహాయంతో సొంత ట్రాన్స్‌మిటర్‌ను సంపాదించింది. మిత్రులతో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకుని రేడియో స్టేషన్‌గా మలిచింది. ఆగస్టు 27, 1942న మొదటి చరిత్రాత్మక ప్రసారాన్ని సొంత గొంతుతో చేసింది. 'దిసీజ్ కాంగ్రెస్ రేడియో 42.34 మీటర్స్ సమ్‌వేర్ ఇన్ ఇండియా'... అంటూ స్వాతంత్రోద్యమ వార్తలు వినిపించింది. ఆ క్షణం నుంచి ఆ రహస్య రేడియో కోసం బ్రిటిష్ అధికారులు, పోలీసులు కంటి మీద కునుకు లేకుండా వెతకసాగారు. ప్రసారాలు బొంబాయి నుంచే నిర్వహిస్తున్నా దేశంలో ఎక్కడి నుంచి అవుతున్నాయో తెలియక గింజుకున్నారు.

మూడు నెలలు

రహస్య రేడియో ప్రసారాలు మూడు నెలలు సాగాయి. కాని పరికరాలు సమకూర్చిన మోత్వాని లొంగిపోయి రేడియో స్టేషన్ చిరునామా చెప్పేశాడు. నవంబర్ 12, 1942న పోలీసులు దాడి చేసి ఉషా మెహతాను అరెస్ట్ చేశారు. ఆరు నెలల పాటు ఆమెను ఇంటరాగేట్ చేశారు. 4 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఉషా ఏ మాత్రం జంకలేదు. 1946 నాటి మధ్యంతర ప్రభుత్వ హయాంలో మురార్జీ దేశాయ్ హోమ్ మినిస్టర్‌గా ఉండగా ఆమె విడుదల జరిగింది. కాని జైలు జీవితం ఆమె ఆరోగ్యాన్ని బాగా దెబ్బ తీసింది. బయటకు వచ్చాక ఆమె చదువు కొనసాగించి ముంబై యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసి 1980లో రిటైర్ అయ్యింది. గాంధీజీ భావజాలాన్ని ప్రచారం చేస్తూ 2000 సంవత్సరంలో తుది శ్వాస విడిచింది.

ఉషా మెహతా జీవితం ఆధారంగా నిర్మించిన బయోపిక్ 'అయ్ వతన్ మేరే వతన్' అమేజాన్‌లో మార్చి 21న విడుదలైంది.

హెల్త్

వృత్తిపరమైన శబ్దాలు... వినికిడి సమస్యలు!

చెవులకు హెడ్‌ఫోన్స్ తగిలించుకుని... కళ్లను కంప్యూటర్ స్క్రీన్‌కు అప్పగించి గంటలు గంటలు ఉద్యోగం చేసే వాళ్లను ఐటీ ఆఫీసుల్లో చూస్తుంటాం. పైకి స్టయిలిష్‌గా కనిపించినా దీర్ఘకాలంలో ఇలాంటి ఉద్యోగాలు వినికిడి శక్తిని దెబ్బతీస్తాయి. ప్రకంపనలు నేరుగా చెవుల్లోకి చొచ్చుకెళ్లి కర్ణభేరిని తాకుతుండటం వల్ల వినికిడి వ్యవస్థ (ఆడిటరీ సిస్టమ్)కు హాని జరిగే అవకాశాలు ఎక్కువ. వృత్తిపరంగా వచ్చే ఈ వినికిడి సమస్యల నివారణ, దానిని అధిగమించడం ఎలా అనే దానిపై అవగాహన కోసం ఈ కథనం.



పని ప్రదేశమంటే పట్టణాలు, నగరాల్లో రకరకాల వస్తు తయారీ పరిశ్రమలు, గనుల తవ్వకం, భారీ యంత్రసామగ్రి, ఉపకరణాల చప్పుళ్లే కాదు... పల్లెల్లోని వ్యవసాయ పనుల్లోనూ మోటర్ల వాడకం... వంటివి శబ్దాలకు కారణమై దీర్ఘకాలంలో వినికిడి సమస్యలకు దారితీసేవి. దీనికి తోడు నిశ్శబ్దంగా ఉండే పని ప్రదేశంలోనూ హెడ్‌ఫోన్స్, ఇయర్‌ఫోన్స్ వాడకమూ పెరగడంతో వినికిడి సమస్యలు వచ్చే అవకాశాలూ పెరిగాయి.

మరికొన్ని అంశాలు...

- శబ్దాల తీవ్రత : శబ్దాల తీవ్రత 85 డెసిబుల్స్‌కు మించడం.
- శబ్దాలకు ఎక్స్‌పోజ్ అయ్యే వ్యవధి : శబ్దాలకు ఎంత ఎక్కువగా ఎక్స్‌పోజ్ అయితే వినికిడి సమస్యకు అంతగా అవకాశం ఎక్కువ.
- తమ ప్రమేయం లేకుండానే మరికొన్ని అంశాలు కూడా వృత్తిపరమైన వినికిడి సమస్యకు కారణమవుతాయి. ఉదాహరణకు జన్యుపరంగా వచ్చే సమస్యల తోపాటు వయసు పెరుగుతున్న కొద్దీ వినికిడి శక్తి తగ్గడం వంటివి


డాక్టర్ మోగంటి అశోక్ పృథ్వీరాజు,
కన్సల్టెంట్ ఈఎన్‌టీ సర్జన్

వృత్తిపరమైన వినికిడి సమస్యలు ప్రభావాలూ - పర్యవసానాలు

- కమ్యూనికేషన్స్ కష్టం కావడం : మాటలు అర్థంగాక కమ్యూనికేషన్‌కు అవరోధాలు ఏర్పడతాయి. ఫలితంగా చేయాల్సిన పనులు కుంటుపడతాయి.
- వృత్తిపరమైన సామర్థ్యాలు తగ్గడం : వినికిడి సమస్యలు పెరగడంతో వృత్తిపరమైన సామర్థ్య లోపాలు కనిపిస్తాయి.
- భద్రతలో ముప్పు : కొన్ని శబ్దాలు వినిపించకపోవడం లేదా కొన్ని హెచ్చరికలను వినలేకపోవడంతో పని ప్రదేశంలో ప్రమాదాలకు గురికావడం, గాయపడటం వంటి ముప్పు ఉంటుంది.
- మానసికమైన దుష్ప్రభావాలు : తమకు సరిగా వినిపించడం లేదన్న వాస్తవం చాలామందిని సామాజిక ఒంటరితనంలోకి నెడుతుంది, యాంగ్జైటీ, డిప్రెషన్‌కు లోనవుతారు.

నివారణ...

వినికిడి సమస్యలు రెండు రకాలు. మొదటిది తాత్కాలికం. రెండోది శాశ్వతం. తాత్కాలిక సమస్య తగ్గేందుకు అవకాశాలు ఎక్కువే అయినా ఒకసారి వినికిడి సమస్య ఏర్పడితే అది పూర్తిగా నయం కావడం కష్టం. శాశ్వత వినికిడి సమస్యకు దారితీసే అవకాశాలు ఎక్కువ. అందుకే నివారణకు ముందు నుంచే తగిన చర్యలు తీసుకోవాలి. అవి...

- ఇంజనీరింగ్ కంట్రోల్స్‌తో : శబ్దాలు తక్కువగా వచ్చేలాంటి యంత్రాల రూపకల్పన, ఆ మేరకు మార్పులు, సౌండ్‌ప్రూఫింగ్, మెటీరియల్ మార్చడం ద్వారా తక్కువ శబ్దాలు వచ్చే ఉపకరణాల తయారీ వంటి జాగ్రత్తలు పాటించడం.
- వ్యక్తిగతమైన రక్షణ ఉపకరణాలు : శబ్దాల విపరీతంగా వినిపించే చోట చెవులను రక్షించే కొన్ని సాధనాలు (ఉదాహరణకు ఇయర్ ప్లగ్స్ లాంటివి) వాడటం.
- శిక్షణ - అవగాహనలు : పెద్ద శబ్దాలతో చెవులు, వినికిడి విషయంలోనే గాక ఇతరత్రా ఆరోగ్య అంశాల్లో కలిగే చేటు వంటి అంశాలపై అవగాహన కల్పించడం, వాటి నివారణకు అవసరమైన చర్యల్లో శిక్షణ ఇవ్వడం, శబ్దాలను ఎలా నియంత్రించాలో తెలపడం, వినికిడి తగ్గినట్లుగా తెలుసుకునే లక్షణాలను గుర్తించడమెలా అన్న విషయంపై అవగాహన కల్పించడం, ఆ తర్వాత చేయాల్సిన పనులు, డాక్టర్లను కలవాల్సిందెప్పుడో తెలుసుకునేలా వివరించడం.

నిర్ధారణ పరీక్షలు...

ఆడిటరీ పరీక్షలు అని పిలిచే కొన్ని రకాల వినికిడి సామర్థ్య పరీక్షలతో పాటు మరికొన్ని ఇతరత్రా సాధారణ ఆరోగ్య పరీక్షలు.

చికిత్స...

- తాత్కాలిక వినికిడి సమస్యలు కలిగినప్పుడు వెంటనే డాక్టర్‌ను కలిస్తే వారు తగిన చర్యలను సూచించి, పరిస్థితి మరింత దిగజారకుండా చేస్తారు.
- కొన్నిసార్లు కాక్లియాలో సమస్యలు వచ్చినప్పుడు (సడన్ హియరింగ్ లాస్ లేదా కాక్లియార్ మైక్రో సర్క్యులేషన్ డిస్టర్బెన్సెస్ వంటి కేసుల్లో) కొన్ని రకాల స్టెరాయిడ్స్ ద్వారా వినికిడిని మెరుగుపరచేందుకు ప్రయత్నిస్తారు.
- కొన్ని రకాల వినికిడి సమస్యలకు తగిన వినికిడి ఉపకరణాలను బాధితులకు తగిన ఫ్రీక్వెన్సీలో అమర్చడం ద్వారా సమస్యను చక్కదిద్దుతారు.
- మరికొన్ని రకాల వినికిడి సమస్యలకు చివరి పరిష్కారంగా శస్త్రచికిత్స కూడా అవసరం పడవచ్చు.

మెడి టిప్

పాదాల నొప్పి తగ్గడం ఎలా?



మడమ కింది భాగం నుంచి కాళ్ల వేళ్ల వద్ద ఉండే ఎముకల వరకు... మొత్తం పాదాన్నంతా 'ప్లాంటార్ ఫేషియా' అంటారు. అది ఎముకనూ, కండరాలనూ కలుపుతుంది. దీనికి సాగే గుణం ఎక్కువ. ఈ ఫేషియాకు గాయం తగిలినా లేదా వయసు పెరిగే కొద్దీ ఫేషియా సాగే గుణం తగ్గడం వల్ల పాదాల నొప్పి రావడం సాధారణం.

పాదాల నొప్పుల తగ్గడానికి కొన్ని సూచనలు...

- పాదంపై పడే భారాన్ని బాగా తగ్గించి, తగినంత విశ్రాంతినివ్వాలి.
- పాదం మధ్యలో ఒంపు తిరిగి ఉన్న భాగానికి సపోర్ట్ ఇచ్చేలా ఉండే పాదరక్షలను ఎంచుకోవాలి.
- ఫేషియాను సాగేలా చేసేవీ, కాలి కండరాలను బలపరిచేవీ అయిన కొన్ని రకాల వ్యాయామాల సహాయంతో పాదాల నొప్పులు తగ్గుతాయి. ఈ సూచనలు పాటించాక కూడా నొప్పి తగ్గకపోతే అప్పుడు డాక్టర్‌ను తప్పక సంప్రదించాలి.

ప్రతి మహిళా గర్భం ధరించినప్పటినుంచి కొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. మరికొన్ని గర్భవతి కాకముందే తీసుకోవాల్సినవీ ఉంటాయి. అలాగే గర్భవతులు అసలు తీసుకోకూడని వ్యాక్సిన్లు కూడా ఉండవచ్చు. అందుకే ఇన్ఫెక్షన్లు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన వ్యాక్సిన్ల గురించి మహిళలకు... ముఖ్యంగా కుటుంబ సభ్యులకు అవగాహన ఉండాలి. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) మార్గదర్శకాల ప్రకారం... గర్భిణులూ - వారు తీసుకోవాల్సిన వ్యాక్సిన్లపై అవగాహన కోసం ఈ కథనం.

గర్భిణులు... వ్యాక్సిన్‌లు!

ముందే తీసుకోవలసిన వ్యాక్సిన్లు

ప్రెగ్నెన్సీకి ప్లాన్ చేసుకున్నప్పుడే మీజిల్స్, మంప్స్, రుబెల్లా, చికెన్ పాక్స్ వంటి వ్యాక్సిన్లను తీసుకోవాలి. ఎందుకంటే గర్భం ధరించిన తర్వాత ఈ వ్యాక్సిన్లు తీసుకోవడం మంచిది కాదు. రొటీన్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా మీజిల్స్, మంప్స్, రుబెల్లా (ఎమ్ఎమ్ఆర్) వంటి వ్యాక్సిన్‌లను చిన్నప్పుడు తాము తీసుకున్నారా లేదా అనే సందేహం ఉంటే ఆ విషయాన్ని డాక్టర్‌తో తప్పక చెప్పాలి. అప్పుడు ఒక రక్తపరీక్ష ద్వారా ఆ మహిళ ముందుగానే ఎమ్ఎమ్ఆర్ వ్యాక్సిన్ తీసుకొని ఉన్నారా, లేదా నిర్ధారణ చేసి అంతకుముందు తీసుకుని ఉండకపోతే ఇస్తారు.

- గర్భిణికి వారిసెల్లా (చికెన్‌పాక్స్) వైరస్ వల్ల బిడ్డలో పుట్టుకతోనే కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఒక చిన్న రక్తపరీక్షతో గతంలోనే చికెన్‌పాక్స్ వ్యాక్సిన్ తీసుకున్నారో లేదో తెలుసుకుని, తీసుకోకపోతే ప్రెగ్నెన్సీ ప్లానింగ్‌కు నెల రోజుల ముందే దాన్ని తీసుకోవడం మంచిది.
- హ్యూమన్ పాపిలోమా వైరస్: హెచ్‌పీవీ అని పిలిచే ఈ వ్యాక్సిన్‌ను అమ్మాయిలు తమ పన్నెండేళ్ల వయసు నాటి నుంచి 45 ఏళ్ల వరకు ఎప్పుడైనా తీసుకోవచ్చు. అయితే గర్భం దాల్చకముందే దీన్ని తీసుకోవాలి. గర్భంతో ఉన్నప్పుడు తీసుకోకూడదు. అవసరమైతే ఆ తర్వాత (అంటే ప్రెగ్నెన్సీ లేని టైమ్‌లో) తీసుకోవచ్చు.

ప్రతి గర్భిణీ తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌లు...

- ఇన్‌ఫ్లుయెంజా (ఫ్లూ) వ్యాక్సిన్: మహిళలందరూ దీన్ని తీసుకోవాలి, గర్భవతులు తప్పనిసరిగా తీసుకోవాలి. గర్భధారణ సమయంలో దీన్ని తీసుకోవడం వల్ల పిండంపై దుష్ప్రభావం పడుతుందా లేదా అనే దిశగా ఎటువంటి అధ్యయనాలు లేవు. అయితే గర్భం ధరించి ఉన్నప్పుడు తీసుకుంటే బిడ్డ పుట్టాక మొదటి ఆర్నెల్లపాటు చిన్నారికీ అది రక్షణ ఇస్తుంది. కాబట్టి నిర్భయంగా తీసుకోవచ్చు. ఫ్లూ వల్ల గర్భవతిలో చలి జ్వరం, కండరాల నొప్పులు, దగ్గు, గొంతు బొంగురు పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.
- టిటనస్, డిఫ్తీరియా, పెర్టుసిస్ (డీపీటీ) వ్యాక్సిన్ : బాధితుల్లో ఒకవేళ టిటనస్ వచ్చినట్లయితే కండరాలు బిగుసుకు పోయి నట్లుగా అయ్యి, అసాధారణంగా ప్రవర్తిస్తాయి. డిఫ్తీరియా వస్తే గొంతు లోపల వెనక భాగంలో ఒక మందపాటి పొరగా ఏర్పడి, శ్వాస సమస్యలకు కారణమవుతుంది. ఆగకుండా వచ్చే 'కోరింత దగ్గు' (పెర్టుసిస్) మహిళల్ని ఎంతో బాధిస్తుంది. అందుకే ఈ మూడు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించుకోడానికి గర్భవతి విధిగా డీపీటీ వ్యాక్సిన్ తీసుకోవాలి.

టీ డాప్ అంటూ సంక్షిప్తంగా పిలిచే ఈ వ్యాక్సిన్‌ను గర్భం ధరించిన ప్రతిసారీ... గర్భధారణ తర్వాత 20 వారాలప్పుడు తీసుకోవాలి. కుదరని పక్షంలో 27వ వారం నుంచి 36వ వారం మధ్య లోనూ తీసుకోవచ్చు.



హెపటైటిస్ బి వ్యాక్సిన్ : కాలేయానికి ఇన్‌ఫ్లమేషన్ (వాపు, మంట) కలగజేసే హెపటైటిస్ బి వైరస్ చాలా తీవ్రమైనది. అందుకే హెపటైటిస్ బిని నివారించడానికి ఇప్పుడు బిడ్డ చిన్నవయసులో ఉండగానే మూడు మోతాదుల హెపటైటిస్ బి ఇవ్వడం మొదలైంది. ఈ వ్యాక్సిన్ తీసుకుంటే గర్భస్థ శిశువుకు హాని జరిగినట్టు ఎటువంటి అధ్యయనాలూ లేవు కాబట్టి నిర్భయంగా ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చు.


డా. కావ్యప్రియ వజ్రాల,
కన్సల్టెంట్ అబ్‌స్టెట్రీషియన్ అండ్ గైనకాలజిస్ట్

కోవిడ్ వ్యాక్సిన్ : కోవిడ్ వ్యాక్సిన్ ఎప్పుడైనా తీసుకోవచ్చు. ప్రెగ్నెన్సీ టైమ్‌లో తీసుకున్నా ఇబ్బంది లేదు.

రెస్పిరేటరీ సిన్సీషియల్ వైరల్ వ్యాక్సిన్: ఈ వ్యాక్సిన్‌ను కూడా 32 వారాల నుంచి 36 వారాల ప్రెగ్నెన్సీ సమయంలో తీసుకోవచ్చు.

కొందరికి మాత్రమే వాడాల్సిన వ్యాక్సిన్లు...

కొంతమంది గర్భవతులకు కొన్ని అంశాల్లో ముప్పును నివారించడానికి వారి పరిస్థితిని బట్టి వాళ్లు నిర్దిష్టంగా తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌లు ఇవి...

న్యూమోకాకస్ వ్యాక్సిన్: న్యూమోకాక్సీ అనేది ఒక రకం బ్యాక్టీరియా. దీనివల్ల నిమోనియాతో పాటు మరెన్నో ఇన్ఫెక్షన్లు రావచ్చు. ఉదాహరణకు చెవి ఇన్ఫెక్షన్స్, మెనింజైటిస్ వంటివి. కొందరు హై రిస్క్ మహిళలకు న్యూమోకాకల్ ఇన్ఫెక్షన్స్ సోకకుండా ఈ వ్యాక్సిన్ వాడాలి. వాస్తవానికి ఈ వ్యాక్సిన్‌ను గర్భధారణకు ముందే ఇవ్వడం మంచిది. అయితే... ఇది గర్భధారణ తర్వాత మొదటి మూడు ట్రైమాసికాలలో ఎప్పుడైనా తీసుకోవచ్చు.

ఎల్లో ఫీవర్ వ్యాక్సిన్ : ఇది విదేశాలకు చెందిన దోమల ద్వారా వ్యాపించే ఒక రకం వైరల్ జ్వరం. దీని వల్ల కాలేయం, కిడ్నీలు దెబ్బతినడమే కాదు... ఒక్కోసారి తీవ్ర అంతర్గత రక్తస్రావంతో మరణం కూడా సంభవించవచ్చు. ఈ వ్యాధి మన దేశంలో లేదు గానీ... గర్భధారణ సమయంలో వృత్తిపరంగా కొన్ని ఆఫ్రికా దేశాలకు వెళ్లాల్సిన మహిళలు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలి. ఇందుకోసం సాంక్రమిక వ్యాధుల (ఇన్ఫెక్షియస్ డిసీజెస్)కు చికిత్స చేసే నిపుణుల ఆధ్వర్యంలో తీసుకోవడం మంచిది.

గర్భిణికి ఇవ్వకూడని వ్యాక్సిన్

జీవించి ఉండే వైరస్‌తో తయారు చేసే వ్యాక్సిన్ అయిన జోస్టర్ వ్యాక్సిన్‌ను గర్భవతికి ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకూడదు. మామూలుగా దీన్ని 50 ఏళ్లు, అంతకు పైబడిన లేదా గర్భధారణ వయసు మీరిన వారికే ఎక్కువగా సిఫార్సు చేస్తుంటారు.

ఇవిగాక మరికొన్ని... ఇవేకాకుండా గర్భవతులు అవసరాన్ని బట్టి మరికొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు కలరా, మెనింగోకోకస్, రేబీస్, జపనీస్ ఎన్‌కెఫలైటిస్, టైఫాయిడ్, హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా బీ వంటి వ్యాక్సిన్లను... ఆయా మహిళల వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని బట్టి... డాక్టర్ల సూచనలకు లోబడి తీసుకోవాల్సి ఉంటుంది.

వెర్‌స్టాపెన్‌కు పోల్

ఫార్ములా వన్ సీజన్‌లో మూడో రేసు ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రిలో మ్యాక్స్ వెర్‌స్టాపెన్ పోల్ పొజిషన్‌ను సాధించాడు. మెల్‌బోర్న్‌లో శనివారం జరిగిన ప్రధాన క్వాలిఫయింగ్ రేసును రెడ్‌బుల్ డ్రైవర్ వెర్‌స్టాపెన్ 1 నిమిషం 15.915 సెకన్లలో పూర్తి చేశాడు. ఫెరారీ డ్రైవర్ కార్లోస్ సెయింజ్ రెండో స్థానంలో (1 నిమిషం 16.185 సె.) రెండో స్థానంలో నిలవగా...ల్యాండో నోరిస్ (మెక్‌లారెన్ – 1 నిమిషం 16.315 సె.)కు మూడో స్థానం దక్కింది. తొలి రెండు క్వాలిఫయింగ్‌లలో ముందంజలో నిలిచిన సెయింజ్‌నుంచి గట్టి పోటీ ఎదురైనా ఆ తర్వాత వెర్‌స్టాపెన్ దూసుకుపోయాడు. వెర్‌స్టాపెన్ ఎఫ్1 కెరీర్‌లో ఇది 35వ పోల్ పొజిషన్ కావడం విశేషం. గత సౌదీ అరేబియా రేసుకు ముందు అపెండిసైటిస్ బారిన పడి శస్త్ర చికిత్స చేయించుకున్న సెయింజ్ సత్తా చాటాడు. పేలవ ప్రదర్శన కనబర్చిన లూయిస్ హామిల్టన్ (మెర్సిడెజ్) 11వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.



చెన్నైలో ఐపీఎల్ ఫైనల్

ఐపీఎల్ తాజా సీజన్ తుది పోరుకు చెన్నైని వేదికగా నిర్ణయించారు. ప్లే ఆఫ్స్‌లో ఒక క్వాలిఫయర్, ఎలిమినేటర్ మ్యాచ్‌లకు అహ్మదాబాద్ ఆతిథ్యం ఇవ్వనుండగా మరో క్వాలిఫయర్ మ్యాచ్ కూడా చెన్నైలోనే జరుగుతుంది.

జాతీయ మహిళల హాకీ విజేత హరియాణా



పుణే: జాతీయ సీనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌ను హరియాణా సొంతం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో షూటౌట్ ద్వారా హరియాణా 3–0తో ఆతిథ్య మహారాష్ట్రను ఓడించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1–1 గోల్స్‌తో సమంగా నిలిచాయి. హరియాణా తరఫున దీపిక పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ సాధించగా...మహారాష్ట్ర తరఫున అక్షత గోల్‌తో స్కోరు సమం చేసింది. షూటౌట్‌లో హరియాణా ప్లేయర్లలో నవనీత్ కౌర్, ఉష, సోనిక స్కోర్ చేయగా... మహారాష్ట్ర ప్లేయర్లలో ప్రియాంక, ఆకాంక్ష, రుతుజ గోల్ చేయడంలో విఫలమయ్యారు.

బంగ్లాదేశ్ 188 ఆలౌట్


విశ్వ ఫెర్నాండో

సిల్హెట్: ఆతిథ్య బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో రెండో రోజే శ్రీలంక పట్టు బిగించింది. శనివారం రెండో రోజు 32/3 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 51.3 ఓవర్లలో 188 పరుగులకే ఆలౌటైంది. తైజుల్ ఇస్లామ్ (47; 6 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. విశ్వ ఫెర్నాండో 4, కసున్ రజిత, లహిరు కుమార చెరో 3 వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో లంకకు 92 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక ఆట నిలిచే సమయానికి 36 ఓవర్లలో 5 వికెట్లకు 119 పరుగులు చేసింది. ఓపెనర్ దిముత్ కరుణరత్నే (52; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా (23 బ్యాటింగ్, 3 ఫోర్లు), విశ్వ ఫెర్నాండో (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. బంగ్లా బౌలర్ నహిద్ రాణాకు 2 వికెట్లు దక్కాయి.


కోల్‌కతా జట్టు గెలుపు సంబరం

ఆఖరి బంతికి...

4 పరుగులతో ఓడిన హైదరాబాద్

కోల్‌కతా: సన్‌రైజర్స్ హైదరాబాద్ బోణీ కొట్టాలంటే కొండంత లక్ష్యాన్ని కరిగించాలి. ఒక దశలో గెలవడానికి 24 బంతుల్లో 76 పరుగులు కావాలి. దీంతో కోల్‌కతా విజయం లాంఛనమే అనిపించింది. కానీ హెన్రిచ్ క్లాసెన్ (29 బంతుల్లో 63; 8 సిక్స్‌లు) భారీ సిక్సర్లు ఒక్కసారిగా హైదరాబాద్ విజయానికి ఊపిరిపోశాయి. 17, 18, 19వ ఓవర్లలో వరుసగా 16, 21, 26 పరుగులు వచ్చాయి. వరుణ్ 3 సిక్సర్లు ఇవ్వగా...స్టార్క్ ఓవర్లో క్లాసెన్ 3, షహబాజ్ ఒక సిక్సర్ బాదారు! అంతే ఆఖరి 6 బంతులకు 13 పరుగులు సన్‌రైజర్స్ వైపు మొగ్గేలా చేసింది. హర్షిత్ రాణా వేసిన ఈ ఓవర్లో తొలి బంతికే క్లాసెన్ సిక్స్ బాదడంతో 5 బంతుల్లో 7 పరుగులు హైదరాబాద్‌ను సంబరాల్లో ముంచింది. కానీ హర్షిత్ (3/33) వైవిధ్యమైన బంతులతో రెండే పరుగులిచ్చి షహబాజ్ (16; 1 ఫోర్, 2 సిక్స్‌లు), క్లాసెన్‌లను అవుట్ చేశాడు. చివరి బంతికి గెలవాలంటే 5 పరుగులు కావాల్సి ఉండగా కమిన్స్ సింగిల్ కూడా తీయలేకపోయాడు. దాంతో కోల్‌కతా 4 పరుగులతో అనూహ్య విజయం సాధించింది. దీంతో గెలుపుదారిలో పడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమితో ఈ ఐపీఎల్ సీజన్‌ను ప్రారంభించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా రెండో ఓవర్ నుంచే కష్టాల్లో పడింది. నరైన్ (2), వెంకటేశ్ అయ్యర్ (7), శ్రేయస్ అయ్యర్ (0), నితీశ్ రాణా (9) చేతులెత్తేశారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (40 బంతుల్లో 54; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించగా... 14వ ఓవర్లో అతనూ అవుటయ్యాడు. కోల్‌కతా స్కోరు 119/6. అప్పుడు క్రీజులోకి వచ్చిన రసెల్ (25 బంతుల్లో 64 నాటౌట్; 3 ఫోర్లు, 7 సిక్సర్లు) చాన్నాళ్ల తర్వాత విధ్వంసరచన చేశాడు. దీంతో కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్లకు 208 పరుగుల భారీస్కోరు చేసింది. మిగిలిన 6.1 ఓవర్లలోనే జట్టు 89 పరుగులు చేస్తే అందులో రసెల్ ఒక్కడివే 64 పరుగులంటే... హైదరాబాద్ బౌలర్లు కూడా ప్రేక్షకులు కావాల్సివచ్చింది. రసెల్ 20 బంతుల్లో అర్ధసెంచరీ చేశాడు. నటరాజన్ 3, మయాంక్ మార్కండే 2 వికెట్లు తీశారు. అనంతరం సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 204 పరుగులు చేసి ఓడింది. మయాంక్ (21 బంతుల్లో 32; 4 ఫోర్లు, 1 సిక్స్), అభిషేక్ (19 బంతుల్లో 32; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మంచి ఆరంభాన్నిచ్చారు. అయితే స్వల్ప వ్యవధిలో మార్క్‌రమ్ (18), రాహుల్ త్రిపాఠి (20) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి) జాన్సెన్ (బి) మార్కండే 54; నరైన్ రనౌట్ 2; వెంకటేశ్ (సి) జాన్సెన్ (బి) నటరాజన్ 7; శ్రేయస్ (సి) కమిన్స్ (బి) నటరాజన్ 0; నితీశ్ (సి) త్రిపాఠి (బి) మార్కండే 9; రమణ్‌దీప్ (సి) మార్కండే (బి) కమిన్స్ 35; రింకూ సింగ్ (సి) మార్కండే (బి) నటరాజన్ 23; రసెల్ నాటౌట్ 64; స్టార్క్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 208. వికెట్ల పతనం:** 1–23, 2–32, 3–32, 4–51, 5–105, 6–119, 7–200. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–51–0, జాన్సెన్ 3–0–40–0, నటరాజన్ 4–0–32–3, కమిన్స్ 4–0–32–1, మార్కండే 4–0–39–2, షహబాజ్ 1–0–14–0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: మయాంక్ (సి) రింకూ (బి) హర్షిత్ 32; అభిషేక్ (సి) వరుణ్ (బి) రసెల్ 32; త్రిపాఠి (సి) హర్షిత్ (బి) నరైన్ 20; మార్క్‌రమ్ (సి) రింకూ (బి) వరుణ్ 18; క్లాసెన్ (సి) సుయశ్ (బి) హర్షిత్ 63; సమద్ (సి) వెంకటేశ్ (బి) రసెల్ 15; షహబాజ్ (సి) శ్రేయస్ (బి) హర్షిత్ 16; జాన్సెన్ నాటౌట్ 1; కమిన్స్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 204. వికెట్ల పతనం:** 1–60, 2–71, 3–107, 4–111, 5–145, 6–203, 7–204. **బౌలింగ్:** స్టార్క్ 4–0–53–0, హర్షిత్ రాణా 4–0–33–3, వరుణ్ 4–0–55–1, నరైన్ 4–0–19–1, రసెల్ 2–0–25–2, సుయశ్ 2–0–18–0.

పంజాబ్ గెలుపు బోణీ

- రాణించిన స్యామ్ కరన్
- 4 వికెట్లతో ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్

ముల్లన్‌పూర్: కొత్త సీజన్‌లో, కొత్త మైదానంలో పంజాబ్ కింగ్స్ భాంగ్రా ఆడుకుంది. తొలి పోరులో చక్కటి విజయంతో బోణీ చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 4 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. షై హోప్ (25 బంతుల్లో 33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అభిషేక్ పొరేల్ (10 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం పంజాబ్ 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 177 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్యామ్ కరన్ (47 బంతుల్లో 63; 6 ఫోర్లు, 1 సిక్స్), లయమ్ లివింగ్‌స్టోన్ (21 బంతుల్లో 38 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఐదో వికెట్‌కు 42 బంతుల్లో 67 పరుగులు జోడించి గెలిపించారు.

అంతా అంతంతమాత్రంగా...

ఢిల్లీ ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు డేవిడ్ వార్నర్ (21 బంతుల్లో 29; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (12 బంతుల్లో 20; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంగా ప్రారంభించారు. తొలి 3 ఓవర్లలో వీరిద్దరు 33 పరుగులు రాబట్టారు. మార్ష్ వెనుదిరిగినా...కెరీర్‌లో తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్న హోప్ కూడా కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. 10.3 ఓవర్లలో స్కోరు 94/3తో మెరుగ్గా అనిపించింది. అయితే ఈ దశలో బ్యాటింగ్ తడబడింది. పంత్ (18) ప్రభావం చూపలేకపోగా... భుయ్ (3), స్టబ్స్ (5) విఫలమయ్యారు. అక్షర్ పటేల్ (13 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని పరుగులు జోడించగలిగాడు. అయితే చివర్లో పొరేల్ దూకుడు ఢిల్లీకి చెప్పుకోదగ్గ స్కోరు అందించింది. స్కోరు 137/7 వద్ద క్రీజ్‌లోకి వచ్చిన అతను హర్షల్ వేసిన ఆఖరి ఓవర్లో చెలరేగిపోయాడు. ఈ ఓవర్లో అతను వరుసగా 4, 6, 4, 4, 6 బాదడంతో మొత్తం 25 పరుగులు వచ్చాయి.


స్యామ్ కరన్

రాణించిన లివింగ్‌స్టోన్...

ఖలీల్ అహ్మద్ వేసిన తొలి ఓవర్లోనే 4 ఫోర్లతో శిఖర్ ధావన్ (16 బంతుల్లో 22; 4 ఫోర్లు) జోరు ప్రదర్శించాడు. అయితే అతనితో పాటు బెయిర్‌స్టో (9) ఐదు బంతుల వ్యవధిలో వెనుదిరగ్గా...ప్రభ్‌సిమ్రన్ సింగ్ (17 బంతుల్లో 26; 5 ఫోర్లు) జట్టును ఆదుకున్నాడు. కానీ ప్రభ్‌సిమ్రన్‌తో పాటు జితేశ్ శర్మ (9) తన వరుస ఓవర్లలో అవుట్ చేసి కుల్దీప్ ఆశలు పెంచాడు. గెలుపు కోసం 51 బంతుల్లో 75 పరుగులు చేయాల్సిన దశలో కరన్, లివింగ్‌స్టోన్ జత కలిశారు. 33 పరుగుల వద్ద కరన్ ఇచ్చిన క్యాచ్‌ను స్టబ్స్ వదిలేయడం కలిసొచ్చింది. వీరిద్దరిని కొద్ది సేపు ఢిల్లీ బౌలర్లు నిలువరించగలిగారు. అయితే మార్ష్ వేసిన 15వ, 17వ ఓవర్లలో కలిపి మొత్తం 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో పంజాబ్ 36 పరుగులు రాబట్టడంతో ఆట స్వరూపం మారిపోయింది. విజయానికి పది పరుగుల దూరంలో కరన్ అవుటైనా...లివింగ్‌స్టోన్ మిగతా పనిని పూర్తి చేశాడు. మిడ్‌వికెట్ వద్ద ఫీల్డింగ్ చేస్తూ ఆరో ఓవర్లోనే ఇషాంత్ గాయపడటం కూడా ఢిల్లీని దెబ్బ తీసింది. ప్రధాన బౌలర్ దూరం కావడంతో ప్రత్యామ్నాయం లేక పరుగులు ఇస్తున్నా సరే మార్ష్‌తో బౌలింగ్ చేయించాల్సి వచ్చింది.

స్కోరు వివరాలు:

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి) జితేశ్ (బి) హర్షల్ 29; మార్ష్ (సి) చహర్ (బి) అర్‌్షదీప్ 20; హోప్ (సి) బ్రార్ (బి) రబాడ 33; పంత్ (సి) బెయిర్‌స్టో (బి) హర్షల్ 18; భుయ్ (సి) జితేశ్ (బి) బ్రార్ 3; స్టబ్స్ (సి) శశాంక్ (బి) చహర్ 5; అక్షర్ (రనౌట్) 21; సుమీత్ (సి) జితేశ్ (బి) అర్‌్షదీప్ 2; పొరేల్ (నాటౌట్) 32; కుల్దీప్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 174. వికెట్ల పతనం** : 1–39, 2–74, 3–94, 4–111, 5–111, 6–128, 7–138, 8–147, 9–174. **బౌలింగ్:** స్యామ్ కరన్ 1–0–10–0, అర్‌్షదీప్ 4–0–28–2, రబాడ 4–0–36–1, హర్‌ప్రీత్ బ్రార్ 3–0–14–1, రాహుల్ చహర్ 4–0–33–1, హర్షల్ 4–0–47–2.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ధావన్ (బి) ఇషాంత్ 22; బెయిర్‌స్టో (రనౌట్) 9; ప్రభ్‌సిమ్రన్ (సి) వార్నర్ (బి) కుల్దీప్ 26; స్యామ్ కరన్ (బి) అహ్మద్ 63; జితేశ్ (స్టంప్డ్) పంత్ (బి) కుల్దీప్ 9; లివింగ్‌స్టోన్ (నాటౌట్) 38; శశాంక్ (సి) పంత్ (బి) అహ్మద్ 0; బ్రార్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (19.2 ఓవర్లలో 6 వికెట్లకు) 177. వికెట్ల పతనం:** 1–34, 2–42, 3–84, 4–100, 5–167, 6–167. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4–0–43–2, ఇషాంత్ 2–0–16–1, మార్ష్ 4–0–52–0, అక్షర్ 4–0–25–0, కుల్దీప్ 4–0–20–2, సుమీత్ 1.2–0–19–0.

వెల్‌కమ్‌బ్యాక్ పంత్...



ఢిల్లీ ఇన్నింగ్స్ ఎనిమిదో ఓవర్ చివరి బంతికి వార్నర్ అవుటయ్యాడు. ఆ తర్వాత అందరి దృష్టీ డగౌట్‌పై పడింది. రిషభ్ పంత్ హెల్మెట్ సరి చేసుకుంటూ మైదానంలోకి అడుగు పెట్టాడు. దాంతో ఒక్కసారిగా ముల్లన్‌పూర్ స్టేడియం మొత్తం మార్మోగిపోయింది. అభిమానులంతా నిలబడి స్టాండింగ్ ఒవేషన్‌తో స్వాగతం పలికారు. దాదాపు 15 నెలల విరామం తర్వాత క్రికెట్‌లోకి అడుగు పెట్టిన పంత్‌లో కూడా భావోద్వేగాలు కనిపించాయి. బ్రార్ ఓవర్లో తన రెండో బంతికి సింగిల్ తీసి అతను పరుగుల ఖాతా తెరవడంతో అంతా చప్పట్లతో అభినందించారు. స్కోరుపరంగా పంత్ గొప్పగా ఆడకపోయినా...దాదాపు చావుకు చేరువైన కారు ప్రమాదంనుంచి కోలుకున్న తర్వాత ఇప్పుడు పూర్తి ఫిట్‌గా, కీపింగ్‌లోనూ చురుగ్గా కనిపించడం సానుకూలాంశం.

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ X లక్నో
వేదిక: జైపూర్
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

గుజరాత్ X ముంబై
వేదిక: అహ్మదాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా


శివ... శివా...

భక్తి కలిసిన చిత్రాల్లో స్టార్స్ కనిపించడం చాలా తక్కువ. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది. డివోషన్ ప్లస్ కమర్షియల్ మిక్స్ అయిన కథలకు డిమాండ్ పెరుగుతోంది. ఈ తరహా చిత్రాల్లో నటించడానికి స్టార్ హీరోలు ముందుకొస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న చిత్రాల్లో 'శివుడు' నేపథ్యంలో సాగే కథలు, శివుడి ప్రస్తావన కాసేపు ఉండే కథలు ఉన్నాయి. 'శివ... శివా...' అంటూ శివుడి నేపథ్యంలో భక్తి భావంతో రానున్న ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.


● 'కన్నప్ప'లో విష్ణు మంచు

కన్నప్ప

విష్ణు మంచు హీరోగా రూపొందుతోన్న పాన్ ఇండియన్ చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ మూవీలో మోహన్‌బాబు, ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శివ భక్తుడైన భక్త కన్నప్ప కథను 'కన్నప్ప' ద్వారా వెండితెరకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో శివుడి పాత్రలో ప్రభాస్ నటించనున్నారని సమాచారం. ఈ వార్తలు ఆ మధ్య హల్ చల్ చేయగా 'హర హర మహాదేవా' అంటూ రిప్లై ఇస్తూ పరోక్షంగా హింట్ ఇచ్చారు విష్ణు మంచు. ఈ విషయం గురించి మేలో అధికారిక ప్రకటన రావొచ్చని కూడా తాజాగా విష్ణు మంచు స్పందించారు. దీంతో 'కన్నప్ప'లో శివుడి పాత్రలో ప్రభాస్ నటించడం ఖాయమని తెలుస్తోంది. ఇప్పటి వరకు మాస్ యాక్షన్ హీరోగా, లవర్ బాయ్‌గా నటించిన ప్రభాస్ ఇటీవలే 'ఆదిపురుష్' సినిమాలో రాముడిగా కనిపించారు. ఇప్పుడు 'కన్నప్ప' చిత్రంలో శివుడిగా కనిపించనున్నారు. ఇక శివుడి పాత్రలో ప్రభాస్ ఎలా ఉంటారో అంటూ ఏఐ టెక్నాలజీ సాయంతో శివుడి రూపంలో ఉన్న ప్రభాస్ పోస్టర్లను డిజైన్ చేసి, నెట్టింట షేర్ చేస్తున్నారు ఆయన అభిమానులు. ఈ ఫొటోలు చూసిన నెటిజన్స్ శివుడి రూపంలో ప్రభాస్ లుక్ సూపర్‌గా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ చిత్రంలో పార్వతీదేవి పాత్రలో నయనతార కనిపిస్తారట. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో 'కన్నప్ప' విడుదల కానుంది.


● 'కుబేర'లో ధనుష్

కుబేర

ధనుష్, నాగార్జున అక్కినేని లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మల్టీస్టారర్ ఫిల్మ్ 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్న కథానాయికగా నటిస్తున్నారు. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మహాశివరాత్రి కానుకగా ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. అయితే ఫస్ట్ లుక్ మాత్రం టైటిల్‌కు భిన్నంగా ఉండటంతో పాటు ఆశ్చర్య పరిచేలా ఉంది. కుబేరుడు డబ్బులు ప్రసాదించే దేవుడు. కాగా ఫస్ట్ లుక్‌లో ధనుష్ సరైన కాస్ట్యూమ్ లేని పేదవాడిలా కనిపిస్తారు, ఆహార దేవత అన్నపూర్ణాదేవి నుంచి శివుడు భిక్ష తీసుకుంటున్న ఫొటో కూడా పోస్టర్‌లో ఉంది. అంటే ఈ కథలో శివుడి గురించి ఏదో ఒక లైన్ టచ్ చేసి ఉంటారని ఊహించవచ్చు. పైగా మహా శివరాత్రి కానుకగా ప్రత్యేకించి ఆ పోస్టర్ విడుదల చేయడం కూడా శివుడి నేపథ్యం ఉంటుందనుకోవచ్చు.


● 'హరోం హర'లో సుధీర్‌బాబు

హరోం హర

ఎప్పటికప్పుడు వైవిధ్యమైన సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నారు హీరో సుధీర్ బాబు. తాజాగా ఆయన నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'హరోం హర'. 'ది రివోల్ట్' అనేది ట్యాగ్‌లైన్. 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మాళవికా శర్మ హీరోయిన్‌గా నటించారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ జి. నాయుడు నిర్మించిన ఈ సినిమా కథనం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నేపథ్యంలో సాగుతుంది. పైగా ఈ మూవీలో హీరో పేరు కూడా సుబ్రహ్మణ్యమే కావడం విశేషం. ఈ చిత్రానికి 'హరోం హర' టైటిల్ ఫిక్స్ చేశారంటే శివుడి నేపథ్యం ఎంతో కొంత ఉంటుందని ఊహించవచ్చు. ఎందుకంటే.. పరమశివుడి తనయుడే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి. పుత్రుడి కథ చెప్పే క్రమంలో తండ్రి కథని టచ్ చేసుంటారనుకోవచ్చు. చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో సాగే 'హరోం హర'లో సుధీర్ బాబు చిత్తూరు యాసలోనే మాట్లాడతారు. ఈ వేసవిలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.


● 'ఓదెల 2'లో తమన్నా

ఓదెల 2

తమన్నా పేరు చెప్పగానే గ్లామరస్ హీరోయిన్ గుర్తొస్తారు. తన నటన.. ప్రత్యేకించి తన అద్భుతమైన డ్యాన్సుతో ప్రేక్షకుల మనసుల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు తమన్నా. ప్రస్తుతం ఆమె శివుడి నేపథ్యంలో రూపొందుతున్న 'ఓదెల 2' మూవీలో లీడ్ రోల్ చేస్తున్నారు. 'ఓదెల రైల్వేస్టేషన్' వంటి హిట్ సినిమాకి సీక్వెల్‌గా 'ఓదెల 2' తెరకెక్కుతోంది. అశోక్ తేజ దర్శకత్వంలో డైరెక్టర్ సంపత్ నంది క్రియేటర్‌గా ఈ మూవీ రూపొందుతోంది. మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్‌లపై డి. మధు ఈ మూవీ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ కాశీలో మొదలైంది. ఈ చిత్రంలో శివశక్తిగా తమన్నా నటిస్తున్నారు. శివరాత్రి కానుకగా 'ఓదెల 2' నుంచి శివశక్తిగా తమన్నా ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. ఒక చేతిలో దండకం, మరో చేతిలో డమరుకంతో నాగసాధువు వేషంలో కనిపించారు తమన్నా. తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఓదెల మల్లన్న స్వామి ఎలా కాపాడాడు? అనే అంశంతో 'ఓదెల 2' తెరకెక్కుతోంది. మల్లన్న స్వామి అంటే శివుడే అని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ సినిమాని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నారు మేకర్స్. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్. సింహ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, పూజా రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో ఈ చిత్రం రూపొందుతోంది.

హ్యాపీ హాలిడేస్


● మహేశ్‌బాబు

వీలైనప్పుడల్లా ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళుతుంటారు మహేశ్ బాబు. ఈ వేసవి వెకేషన్ కోసం కుటుంబంతో కలిసి మహేశ్‌బాబు ఫారిన్ వెళ్లారు. 'హ్యాపీ హాలిడేస్.. ఫ్యామిలీ టైమ్' అంటూ జర్నీ ఫొటోలను ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేశారు మహేశ్ సతీమణి నమ్రత. ఈ వెకేషన్ పూర్తి చేసుకుని వచ్చిన తర్వాత రాజమౌళితో చేయనున్న సినిమా షూటింగ్‌లో పాల్గొంటారట మహేశ్‌బాబు. షూటింగ్ గురించిన వివరాలను త్వరలోనే రాజమౌళి వెల్లడించనున్నట్లుగా తెలిసింది.

ఆరంభం అప్పట్నుంచేనా..?


● వెంకటేశ్

'ఎఫ్ 2', 'ఎఫ్ 3' (వరుణ్ తేజ్ మరో హీరో) చిత్రాల తర్వాత హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుందనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో హీరోయిన్‌గా త్రిష, మృణాల్ ఠాకూర్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ సినిమాకు 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను మే చివర్లో లేదా జూన్ మొదటి వారంలో ప్రారంభించాలని చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోందని తెలిసింది. అలాగే ఈ సినిమాను 'దిల్' రాజు నిర్మించనున్నారని, సంక్రాంతికి రిలీజ్ చేయాలన్నది చిత్ర యూనిట్ టార్గెట్ అని సమాచారం.

మా కోసం మలేసియాలో ఉత్సవం


● విష్ణు మంచు

''ప్రస్తుతం తెలుగు చిత్రపరిశ్రమలో స్వర్ణ యుగం నడుస్తోంది. మెగాస్టార్ చిరంజీవిగారికి పద్మవిభూషణ్ రావడం గొప్ప విషయం. దేశంలోనే అత్యధిక పారితోషికం తీసుకుంటున్న నటుడు ప్రభాస్.. నా బ్రదర్ అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు వచ్చింది. కీరవాణిగారికి ఆస్కార్ అవార్డు వచ్చింది. దేశంలోనే అత్యధిక బడ్జెట్‌తో మహేశ్‌బాబు–రాజమౌళి సినిమా రాబోతోంది. ఇలా ఎన్నో సాధిస్తున్నాం. తెలుగు సినిమా 90 సంవత్స రాలు పూర్తి చేసుకుంటోంది. ఇలాంటి తరుణంలో 'మా' నిధుల సేకరణ కోసం మలే సియాలో 'నవతిహి ఉత్సవం'కు ఏర్పాట్లు జరుగుతుండటం సంతోషంగా ఉంది'' అని 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు అన్నారు. తెలుగు సినిమా 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా తెలుగు సినిమా చరిత్రను తెలియజేసేలా మలేసియాలో 'నవతహి ఉత్సవం' పేరిట ఓ ఫండ్ రైజింగ్ ఈవెంట్‌ను జూలైలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో విష్ణు మంచు మాట్లాడారు.

యాక్షన్‌తో స్టార్ట్


● సల్మాన్‌ఖాన్

మేలో యాక్షన్ స్టార్ట్ చేయనున్నారు సల్మాన్ ఖాన్. తమిళ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ తెరకెక్కించనున్న సినిమాలో సల్మాన్ ఖాన్ హీరోగా నటించనున్న సంగతి తెలిసిందే. ఈ యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ చిత్రీకరణ మేలో ముంబైలో ప్రారంభం కానుందని బాలీవుడ్ సమాచారం. ముందుగా ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించాలని ప్లాన్ చేస్తున్నారట మురుగదాస్. ఈ సినిమాలోఅదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు ఓ సామాజిక సందేశం కూడా ఉందని ఇటీవల మురుగదాస్ వెల్లడించిన సంగతి తెలిసిందే. సాజిద్ నడియాద్‌వాలా నిర్మించనున్న ఈ చిత్రం 2025 రంజాన్ సందర్భంగా విడుదల కానుంది.

ఫైట్ చేశా!


● అప్సర

అప్సరా రాణి ప్రధాన పాత్రలో అశోక్ కుమార్, అజయ్ ఘోష్, విజయ కరణ్ కీలక పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ ఫిల్మ్ 'తలకోన'. నగేష్ నారదాసి దర్శకత్వంలో దేవర శ్రీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా అప్సరా రాణి మాట్లాడుతూ –''నేను ఇప్పటివరకూ చేయని ఫైట్ సీక్వెన్స్‌లు ఈ సినిమా కోసం చేశాను'' అన్నారు. ''ఫారెస్ట్ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో పాలిటిక్స్, మీడియా అంశాలను మిక్స్ చేశాం'' అన్నారు శ్రీధర్. ''విభిన్నమైన చిత్రం ఇది'' అన్నారు నగేష్.

మ్యూజికల్ జోకర్


● జోకర్–2 పోస్టర్

హాలీవుడ్ సైకలాజికల్ థ్రిల్లర్ 'జోకర్' 2019లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. జోక్విన్ ఫీనిక్స్ లీడ్ రోల్ చేసిన ఈ సినిమాకు టాడ్ ఫిలిప్స్ దర్శకత్వం వహించారు. ప్రస్తుతం జోక్విన్, ఫిలిప్స్ కాంబినేషన్‌లోనే 'జోకర్: ఫోలీ ఏ డ్యూక్స్' (జోకర్ 2) చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ఆర్థర్ ఫ్లెక్ అలియాస్ జోకర్ పాత్రలో జోక్విన్, హార్లే క్విన్‌గా లేడీ గగా కనిపిస్తారు. ఈ ఏడాది అక్టోబరులో 'జోకర్ 2' చిత్రం విడుదల కానుంది. కాగా ఈ సినిమాలో దాదాపు 15 కవర్ సాంగ్స్ (రీమిక్స్ తరహాలో) ఉంటాయని హాలీవుడ్ సమాచారం. 'ది బ్యాండ్ వాగన్' (1953) సినిమా నుంచి 'దట్స్ ఎంటర్‌టైన్‌మెంట్' పాట, 'మమ్మా మియా' (2008) చిత్రంలోని ఓ పాట.. ఇలా పలు పాటలు 'జోకర్ 2'లో కవర్ సాంగ్స్‌గా వినిపిస్తాయట. అంతే కాదు.. ఈ కవర్ సాంగ్స్‌లో కొన్నింటిని జోక్విన్, లేడీ గగా పాడనున్నారని హాలీవుడ్ టాక్. 'జోకర్ 2' సినిమాకు ఐజీ హిల్డర్ స్వరకర్త.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్ల పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

అభ్యర్థులపై మళ్లీ సర్వే చేయిస్తా

కూటమి అభ్యర్థుల వర్క్‌షాప్‌లో చంద్రబాబు



సాక్షి, అమరావతి : రాజకీయాల్లో కొత్తగా పొలిటికల్ రీ ఇంజనీరింగ్ చేయాల్సి వస్తోందని, అందుకే సోషల్ రీ ఇంజనీరింగ్ చేసి, వెతికి మరీ అభ్యర్థులకు సీట్లిచ్చానని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చెప్పారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో ఆయన శనివారం విజయవాడలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం బీజేపీతో పొత్తు పెట్టుకోలేదని చెప్పారు. అభ్యర్థులు ఈ నెల రోజులూ జాగ్రత్తగా ఉండాలని, అందరిపైనా మళ్లీ సర్వేలు చేయిస్తామని చెప్పారు. ఏ మాత్రం తేడా వచ్చినా ఫోన్లు వస్తాయని హెచ్చరించారు. సీట్లు రాని అభ్యర్థులు మూడు పార్టీల్లో ఉన్నారని, అధికారంలోకి రాగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వారికి మంచి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. పవన్ కళ్యాణ్ పద్ధతైన వ్యక్తి అని కొనియాడారు. పొత్తులో భాగంగా అందరికీ టికెట్లు ఇవ్వలేకపోయామని, దాదాపు 31 మంది ముఖ్య నేతలకు సీట్లు ఇవ్వలేదని చెప్పారు. పురందేశ్వరి తమ కుటుంబ సభ్యురాలే అయినా ఆమె 30 ఏళ్లుగా వేరే పార్టీలో ఉన్నారని, దాన్నీ రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఏపీని జగన్ డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని ఆరోపించారు. తనకు, పురందేశ్వరికి పూర్ణచంద్రరావు బంధువు అని విజయసాయిరెడ్డి స్టేట్‌మెంట్ ఇస్తున్నాడని విమర్శించారు. 160కి పైగా స్థానాలతో ఏపీలో అధికారంలోకి రాబోతున్నామని, 24 లోక్‌సభ స్థానాలు గెలవబోతున్నామన్నారు. కడప పార్లమెంట్ స్థానాన్ని కూడా తామే గెలుస్తామని చెప్పారు. త్వరలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామన్నారు.

మద్యం స్కాంలో కవిత ప్రధాన కుట్రదారు

రూ. 292.8 కోట్ల లావాదేవీల్లో ఆమె భాగస్వామ్యం

- ఫోన్లోని సమాచారాన్ని ఆమె డిలీట్ చేశారు
- విచారణలో తప్పించుకొనేలా సమాధానాలు ఇస్తున్నారు
- స్కాం సొమ్ము బదిలీలో ఆమె ఆడపడుచు అల్లుడి పాత్ర గుర్తించాం
- కస్టడీ పొడిగింపు అప్లికేషన్‌లో ఈడీ వెల్లడి
- 3 రోజుల కస్టడీకి అనుమతించిన ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రధాన కుట్రదారు అని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. ఇప్పటివరకు జరిగిన విచారణ ప్రకారం ఈ కుంభకోణం సూత్రధారుల్లో కవిత ఒకరుగా తేలిందని పేర్కొంది. ఈ కేసులో కవితను అరెస్టు చేసి ఐదు రోజుల కస్టడీకి తీసుకున్న ఈడీ.. మరో ఐదు రోజులపాటు ఆమె కస్టడీ పొడిగించాలని కోరుతూ శనివారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో దరఖాస్తు సమర్పించింది. అందులో పలు ఆరోపణలు చేసింది.

తప్పించుకొనేలా సమాధానాలు ఇస్తున్నారు..

ఢిల్లీలో మద్యం లైసెన్సుల్లో భారీ వాటాను చేజిక్కించుకొనేందుకు 'సౌత్ గ్రూప్' ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి చెల్లించిన రూ. 100 కోట్ల ముడుపుల్లో కవిత పాత్ర ఉందని ఈడీ ఆరోపించింది. ముడుపులు చెల్లించినందుకు మద్యం పాలసీ రూపకల్పనలో తనకు అనుకూలంగా మార్పులు చేయాలని కవిత కోరారని తెలిపింది. తన బినామీ అరుణ్ పిళ్లై ద్వారా ఎలాంటి పెట్టుబడి లేకుండానే 'ఇండోస్పిరిట్స్'లో కవిత పార్టనర్‌షిప్ పొందారని... రూ. 100 కోట్ల ముడుపుల చెల్లింపులు, మనీలాండరింగ్‌లో ఆమె చురుకైన పాత్ర పోషించారని వివరించింది. ఇండో–స్పిరిట్స్‌లో కవిత



కోర్టు వద్ద కవిత

బినామీ ద్వారా రూ. 192.8 కోట్ల మేర నేరం జరిగిందని... మొత్తంగా రూ. 292.8 కోట్ల మేర నేరాల సొమ్ముకు సంబంధించిన లావాదేవీల్లో కవిత భాగస్వామ్యం ఉందని ఈడీ ఆరోపించింది. ఈ నేరాలకుగాను పీఎంఎల్‌ఏ సెక్షన్ 3 కింద కవిత దోషి అని, అందుకే పీఎంఎల్ సెక్షన్ 19 కింద అరెస్టు చేశామని కోర్టుకు ఈడీ తెలిపింది. అరెస్టుకు సంబంధించిన కారణాలు విడిగా రికార్డు చేశామని, అరెస్టు చేసిన విషయాన్ని కవిత భర్తకు వ్యక్తిగతంగా తెలియజేసినట్లు తెలిపింది. కస్టోడియల్ విచారణ సమయంలో కవిత తప్పించుకొనేలా సమాధానాలు ఇస్తున్నారని ఈడీ ఆరోపించింది. ఈ నెల 17 నుంచి మార్చి 22 వరకు ఆమె స్టేట్‌మెంట్లు తీసుకున్నామని, దీంతోపాటు మరో నలుగురు నిందితులకు సంబంధించి నాలుగు వాంగ్మూలాలు తీసుకున్నామని తెలిపింది. సహ నిందితుల స్టేట్‌మెంట్లను చూపి వాటిలోని అంశాల ఆధారంగా కవితను ప్రశ్నించామని ఈడీ పేర్కొంది. అలాగే జప్తు చేసిన కవిత ఫోన్‌లోని డేటా ఫార్మాటింగ్‌కు గురైనట్లు తేల్చిన ఫోరెన్సిక్ నివేదికను ముందుపెట్టి విచారించామని తెలిపింది.

బంధువు ప్రమేయం గురించి తెలియదంటూ..

కవిత వాంగ్మూలం ఇచ్చే సమయంలో ఆడపడుచు అఖిల అల్లుడు మేక శరణ్ గురించిన వివరాలు చెప్పాల్సిందిగా కోరగా 'తెలియదు' అని కవిత ముక్తసరిగా బదులిచ్చారని ఈడీ పేర్కొంది. కానీ ఈ నెల 15న కవిత నివాసంలో సోదాల సమయంలో మేక శరణ్ అక్కడే ఉన్నారని.. దీంతో ఆయన ఫోన్‌ను కూడా జప్తు చేశామని వివరించింది. అనుమానాస్పద లావాదేవీలు ఉండొచ్చన్న అభిప్రాయంతో ఆయన్ను విచారణకు రావాలని రెండుసార్లు సమన్లు పంపగా రాలేదని ఈడీ తెలిపింది. గత వారం రోజులుగా చేపట్టిన దర్యాప్తులో మద్యం స్కాంలో ఆర్జించిన సొమ్ము బదిలీ లేదా వినియోగంలో శరణ్ ప్రమేయం ఉన్నట్లు వెలుగులోకి వచ్చిందని.. కానీ అతను విచారణకు సహకరించనందున అతని ఇంట్లో శనివారం సోదాలు చేపట్టినట్లు ఈడీ కోర్టుకు తెలిపింది. మరోవైపు శరణ్ ద్వారా జరిగిన నగదు బదిలీకి సంబంధించిన వివరాలు రాబట్టేందుకు ఇప్పటికే అరెస్టు చేసిన ఇండో–స్పిరిట్స్ ప్రమోటర్ సమీర్ మహేంద్రును మరింత లోతుగా ప్రశ్నించాల్సిన అవసరం ఉందని.. అందుకు అనుమతించాలని ఈడీ కోరింది. ఈ నేపథ్యంలో పాత షరతులతోనే కవితను మరో ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని ఈడీ విజ్ఞప్తి చేసింది.

బెయిల్ మంజూరు చేయాలి: కవిత న్యాయవాది

కవిత తరఫు న్యాయవాది నితేష్ రాణా వాదనలు వినిపిస్తూ కవిత నుంచి ఈడీ కొన్ని డాక్యుమెంట్లు కోరుతోందని, అయితే కస్టడీలో ఉన్న కవిత వాటిని ఎలా ఇవ్వగలరని ప్రశ్నించారు. బెయిల్ ఇస్తేగానీ ఆ డాక్యుమెంట్లు అందజేయలేరని పేర్కొన్నారు. ఈ మేరకు బెయిల్ కోరుతూ దరఖాస్తు దాఖలు చేశారు. అయితే బెయిల్‌ను ఈడీ తరఫు న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వ్యతిరేకించారు. ఈ సమయంలో ఆ అప్లికేషన్ మెయింటైనబిలిటీ ఉండదని కోర్టుకు తెలిపారు. దీంతో కవిత ఈడీ కస్టడీ ముగియగానే బెయిల్ పిటిషన్ విచారించాలని రాణా కోర్టును అభ్యర్థించారు. వాదనలు విన్న న్యాయమూర్తి కావేరీ బవేజా కవితను 3 రోజుల ఈడీ కస్టడీకి అనుమతించారు. ఈ నెల 26న ఉదయం 11 గంటలకు తిరిగి హాజరుపరచాలని ఆదేశించారు.

ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలి: కవిత

తనపై అక్రమ కేసులు పెట్టారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రౌస్ అవెన్యూ కోర్టులోకి వెళ్లే క్రమంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈడీ విచారణలో అడిగిన ప్రశ్నలనే పదేపదే అడుగుతున్నారని చెప్పారు. ఏడాది కాలంగా అడిగిన ప్రశ్నలే మళ్లీ అడుగుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులను అరెస్టు చేయడంపై కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. తన అరెస్టుపై న్యాయస్థానాల్లో పోరాడతానని కవిత పేర్కొన్నారు..

కవిత బంధువుల ఇళ్లలో ఈడీ సోదాలు

తెరపైకి ఆడపడుచు అల్లుడు మేక శరణ్ పేరు

- కవిత అరెస్టు సమయంలో అతని ఫోన్ సైతం స్వాధీనం
- అందులో స్కాం సొమ్ము లావాదేవీలు గుర్తింపు!
- కవిత ఆడపడుచు కుటుంబం పేరిట షెల్ కంపెనీలు?

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ పాలసీ కుంభకోణం కేసులో ఈడీ అధికారులు వేగం పెంచారు. ఈ కేసులో ఇప్పటికే బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేసిన ఈడీ అధికారులు ఆమె ఇంట్లో సోదాల సందర్భంగా లభించిన ఆధారాల మేరకు శనివారం హైదరాబాద్‌లో మరోమారు తనిఖీలు చేపట్టారు. ఉదయం 6 గంటల నుంచి ఏడుగురు అధికారులతో కూడిన ఈడీ బృందం మాదాపూర్ డీఎస్‌ఆర్ అపార్ట్‌మెంట్స్‌లోని కవిత ఆడపడుచు అఖిల ఫ్లాట్‌తోపాటు ఇతర బంధువుల ఇళ్లలో ఏకకాలంలో తనిఖీలు ప్రారంభించింది. ఈ సోదాల్లో కవిత ఆడపడుచు అఖిల అల్లుడు మేక శరణ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. కవిత అరెస్టు సందర్భంగా హైదరాబాద్‌లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టిన సమయంలోనూ కవిత భర్త అనిల్‌తోపాటు శరణ్ సైతం అక్కడే ఉన్నారు. సోదాల సమయంలో ఈడీ అధికారులు కవిత, ఆమె భర్త అనిల్, శరణ్‌తోపాటు కవిత పీఏలు రాజేశ్, రోహిత్‌రావు ఇతరుల ఫోన్లను సీజ్ చేశారు. శరణ్ తీరుపై అనుమానాలు ఉండటంతో ఫోన్లను తనిఖీ చేయగా స్కాంకు సంబంధించిన పలు ఆర్థిక లావాదేవీల అంశాలు బయటపడ్డట్లు సమాచారం. తమ కస్టడీలో కవిత నుంచి సేకరించిన సమాచారం.. గతంలో ఫోన్లలో వెలుగు చూసిన అంశాలను ఆధారంగా చేసుకొనే ఈడీ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. లిక్కర్ పాలసీ కుంభకోణంలో పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు ఈడీ అధికారులు ఇప్పటికే ఆధారాలు సేకరించారు. ప్రధానంగా గోవా, పంజాబ్ ఎన్నికల సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీకి హైదరాబాద్ నుంచే రూ. కోట్లు సమకూరినట్లు ఆధారాలు లభించాయి. ఈ కేసులో సౌత్ గ్రూప్‌లో కీలకంగా వ్యవహరించిన వారిపై ఈడీ అధికారులు దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా కవితను అరెస్టు చేసిన ఈడీ అధికారులు ఆమె నుంచి సేకరిస్తున్న సమాచారంతో మరికొందరి పాత్రను బయటకు తెస్తున్నారు. ఆర్థిక లావాదేవీల కోసం ఏర్పాటు చేసిన షెల్ కంపెనీలన్నీ కవిత ఆడపడుచు కుటుంబ సభ్యుల పేరిట ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై మరింత లోతుగా ఆరా తీస్తే కొత్త కోణాలు వెలుగు చూస్తాయని ఈడీ అధికారులు భావిస్తున్నారు.



మాదాపూర్‌లోని కవిత ఆడపడుచు అఖిల ఇంటి వద్ద ఈడీ అధికారులు



శ్రీశైలంలో శాస్త్రోక్తంగా కామ దహనం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో పాల్గుణ శుద్ధ చతుర్దశిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద శాస్త్రోక్తంగా కామ దహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు. ఆ తర్వాత గడ్డితో చేసిన మన్మథ రూపాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో హరిదాసు, పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ముఖరా(కె) మాజీ సర్పంచ్‌కు 'ఎన్‌డీటీవీ' అవార్డు



ఇచ్చోడ (ఆదిలాబాద్ జిల్లా): తన ఊరుని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దిన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా(కె) పంచాయతీ మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షికి ఎన్‌డీటీవీ ఇండియన్ అవార్డు లభించింది. ఢిల్లీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ మాజీ సర్పంచ్ మీనాక్షికి అవార్డును అందజేశారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి ఎన్‌డీటీవీ ఇండియన్ అవార్డులను ప్రకటించింది. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ... తన పదవీ కాలం పూర్తయిన తర్వాత కూడా ఈ అవార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు.

రూ.1.19 కోట్ల డ్రగ్స్ పట్టివేత

బొల్లారం మెడికెమ్ పరిశ్రమలో స్వాధీనం



జిన్నారం (పటాన్‌చెరు): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని బొల్లారం పారిశ్రామికవాడ డ్రగ్స్ తయారీకి అడ్డాగా మారింది. రెండు రోజుల కిందట రూ.9 కోట్ల విలువైన డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మరో పరిశ్రమపై అధికారులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. డ్రగ్ కంట్రోల్, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా బొల్లారం పారిశ్రామిక వాడలోని మెడికెమ్ ల్యాబ్స్‌లో దాడులు జరిపి రూ.1.19 కోట్ల విలువైన 2.850 కిలోల ఆల్ఫా పీహెచ్‌పీ నిషేధిత డ్రగ్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలోని పరిశ్రమలపై నిఘా పెంచుతామని డ్రగ్ కంట్రోల్, ఎక్సైజ్ శాఖ అధికారులు రాము, లక్ష్మీనారాయణ, అనిల్, శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు తెలిపారు.

వృద్ధురాలి దరఖాస్తు మేరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వండి

విద్యుత్ అధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఓ వృద్ధురాలు దరఖాస్తు చేసుకున్న మేరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటూ విద్యుత్ శాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. అదేవిధంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు నిరాకరించిన సదరు అధికారులకు హైకోర్టు అక్షింతలు వేసింది. సికింద్రాబాద్ సీతాఫల్‌మండీకి చెందిన వృద్ధు రాలు గోపు నాగమణి శంకర్‌హిల్స్ లే అవుట్‌లో ఉ న్న స్థలంలో విద్యుత్ కనెక్షన్ కోసం గత సెప్టెంబర్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే భూ యాజమాన్య విషయానికి సంబంధించి వివాదం ఉందంటూ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు అధికా రులు నిరాకరిస్తున్నారు. దీంతో గోపు నాగమణి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా... న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్ విచారణ చేపట్టి పై విధంగా తీర్పునిచ్చారు. యాజమాన్య హక్కుల భూ వివాదంలో ప్రతిపాదిత ప్రతివాదులైన జైహింద్‌రెడ్డి, మరో ఇద్దరి వాదన సరికాదని న్యాయమూర్తి అభిప్రాయపడుతూ... ప్రతివాదులుగా ఉన్న ముగ్గురికి రూ.1000 చొప్పున జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని 10 రోజుల్లోగా హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీలో డిపాజిట్ చేయాలని స్పష్టం చేశారు. ఒకవేళ కనెక్షన్ ఇవ్వకుంటే ఈ కేసు తిరిగి తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీకి సూచించారు.

పాపికొండల్లో అరుదైన మిత్రుడు

రంపచోడవరం జలపాతం వద్ద గుర్తించిన డయార్డ్స్ బ్లైండ్ స్నేక్ (ఫైల్)



రంపచోడవరం జలపాతం వద్ద 'డయార్డ్స్ స్నేక్'

- ఇది సంచరిస్తే పర్యావరణం పరిఢవిల్లుతున్నట్టు లెక్క
- 1839లో జావా దీవుల్లో తొలిసారిగా గుర్తింపు
- 2022 సెప్టెంబర్‌లో రంపచోడవరం జలపాతం వద్ద లభ్యం
- డీఎన్‌ఏ పరీక్షల ద్వారా ఇది డయార్డ్స్ స్నేక్ అని తేల్చిన శాస్త్రవేత్తలు

పర్యావరణ మిత్రునిగా పిలిచే అరుదైన డయార్డ్స్ బ్లైండ్ స్నేక్ (గుడ్డి పాము) జాడ నిజమేనని మంచినీటి జీవశాస్త్ర ప్రాంతీయ కేంద్రమైన హైదరాబాద్‌లోని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గుంటూరులోని బయోడైవర్సిటీ బోర్డు పాపికొండలు సమీపంలోని రంపచోడవరం జలపాతం వద్ద 2022 సెప్టెంబర్ 8న చనిపోయిన డయార్డ్స్ బ్లైండ్ స్నేక్ మృతదేహాన్ని కనుగొన్నారు. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన శాస్త్రవేత్తలు దీపా జైస్వాల్, బి.భరత్, ఎం.కరుతాపాండి, శ్రీకాంత్ జాదవ్, కల్యాణి, కుంటేలు గుడ్డిపాము కళేబరాన్ని రసాయనాలతో హైదరాబాద్ జూలాజికల్ మ్యూజియంలో భద్రపరిచారు. అప్పటినుంచి పరిశోధనలు చేసి చివరకు డీఎన్‌ఏ పరీక్ష ద్వారా దీనిని అరుదైన డయార్డ్స్ బ్లైండ్ స్నేక్‌గా నిర్ధారించారు. - కైకలూరు

ఐయూసీఎన్ ఆందోళన

ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) తగ్గుతున్న జీవుల జాబితా అయిన రెడ్ లిస్ట్‌లో డయార్డ్స్ బ్లైండ్ స్నేక్‌ను చేర్చింది. భారతీయ వన్యప్రాణి (రక్షణ) సవరణ చట్టం షెడ్యూల్-2లో దీనిని చేర్చారు. వర్షారణ్యాలు, పొదలు, గడ్డి భూముల్లో ఇవి నివసిస్తాయి. ఇవి ఎక్కడ సంచరిస్తే అక్కడ పర్యావరణం పరిఢవిల్లుతుందని శాస్త్రవేత్తలు భావిస్తారు. తూర్పు కనుమల ప్రాంతమైన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రాంతాల్లో కేవలం పాపికొండలు వద్ద ఈ జాతిని గుర్తించడంతో ఈ ప్రాంతాల్లో మరింతగా వీటి జాడ ఉండవచ్చని పర్యావరణవేత్తలు భావిస్తున్నారు.

1839లో జావా దీవుల్లో గుర్తింపు

డయార్డ్స్ బ్లైండ్ స్నేక్‌ను 1839లో ఇండోనేషియాలోని జావా దీవుల్లో తొలిసారిగా గుర్తించారు. ఫ్రెంచ్ ప్రకృతి శాస్త్రవేత్త పియరి మోడర్డ్ డియార్డ్ గౌరవార్థం దీనికి డయార్డ్స్ అని నామకరణం చేశారు. ఆర్గిరోఫిస్ డయార్టి శాస్త్రీయ నామం కలిగిన ఇది టైఫ్లోపిడే కుటుంబంలో విషపూరితం కాని పాము జాతికి చెందినది. ఇవి అడుగు వరకు పొడవు పెరుగుతాయి. భారతదేశంలో ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం, హరియాణా, బిహార్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర ప్రాంతాల్లో వీటి జాతి ఉంది. మొదటిసారి ఏపీలోని పాపికొండలు అభయారణ్య ప్రాంతమైన రంపచోడవరం జలపాతం వద్ద దీనిని కనుగొన్నారు. వానపాములు భూసారాన్ని పెంపొందించడంలో ఏ విధంగా సాయపడతాయో అంతకంటే ఎక్కువగా పర్యావరణాన్ని కాపాడటంలో గుడ్డిపాములు దోహదపడతాయి.

విషపూరితమైనవి కావు



డయార్డ్స్ బ్లైండ్ స్నేక్ విషపూరితమైనవి కావు. క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుంటాయి. వానపాములు ఏ విధంగా సంతానోత్పత్తి చేస్తాయో అదేవిధంగా వీటి సంతతిని వృద్ధి చేసుకుంటాయి. పంట పొలాల్లో రసాయనాలు అధిక వినియోగం వల్ల వీటి సంతతి నశిస్తోంది. పర్యావరణ పరిరక్షణలో వీటి పాత్ర గణనీయంగా ఉంటుంది. వీటిని పరిరక్షించుకోవాలి.

– బి.భరత్, జూనియర్ రీసెర్చ్ ఫెలో, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్

వోల్వో.. వద్దు

- ప్రస్తుతం 14 లక్షల కి.మీ. దాటినా నడుపుతున్న ఆర్టీసీ
- చిన్న మరమ్మతు వచ్చినా కంపెనీ ఇంజనీర్లతోనే రిపేర్లకు ప్రతిసారీ రూ. మూడు, నాలుగు లక్షల్లో బిల్లులు
- దీంతో వాటిని పక్కన పెట్టాలని తాజాగా నిర్ణయం
- లహరి స్లీపర్ కమ్ సీటర్ బస్సులతో భర్తీ
- ఇక కనుమరుగు కానున్న గరుడ ప్లస్ కేటగిరీ బస్సులు

తాజాగా ఆర్టీసీ నుంచి 20 బస్సులు ఔట్.. త్వరలో మరో 40



సాక్షి, హైదరాబాద్: గరుడ ప్లస్ కేటగిరీ బస్సులు కనుమరుగు కానున్నాయి. ఆ పేరుతో ఆర్టీసీలో తిరుగుతున్న ఒక్కో వోల్వో బస్సుకు నెలకు సగటున రూ.లక్షకు పైగా నిర్వహణ ఖర్చు వస్తోంది. పైగా చిన్న రిపేరు చేయాల్సి వచ్చినా.. కంపెనీకి తరలించాల్సి రావటం, ఒక్కో పనికి రూ.3–4 లక్షల వరకు బిల్లు వస్తుండటంతో వాటిని వదిలించుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది. తాజాగా 20 వరకు బస్సులను పక్కన పెట్టేసింది. త్వరలో మరికొన్నింటిని తుక్కు కింద మార్చబోతోంది. వాటి స్థానంలో అశోక్ లేలాండ్ కంపెనీ నుంచి కొంటున్న లహరి స్లీపర్, స్లీపర్ కమ్ సీటర్ బస్సులను నడపబోతోంది.

సామర్థ్యానికి మించి నడపటంతోనే..

ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు ఎప్పటికప్పుడు ఆధునిక బస్సులు అందుబాటులోకి తెస్తుండటంతో ఆర్టీసీ కూడా ఆ శ్రేణి బస్సులను సమకూర్చటం అనివార్యమైంది. రెండు దశాబ్దాల క్రితం గరుడ పేరుతో బస్సులు ప్రారంభించారు. ఆకర్షణీయంగా ఉండేలా మెర్సిడస్ బెంజ్, ఇసుజు కంపెనీల బస్సులు నడిపారు. ఆ తర్వాత మల్టీ యాక్సెల్ బస్సులను గరుడ ప్లస్ పేరుతో ప్రవేశపెట్టారు. ఈ కేటగిరీలో వోల్వో, స్కానియా బస్సులు వాడారు. 2016–17లో కొత్త వోల్వో బస్సులు కొన్నారు. సాధారణంగా ఆ కంపెనీ బస్సులు ఏడెనిమిది లక్షల కిలోమీటర్ల వరకు తిప్పొచ్చని నిపుణులు చెబుతారు. అంతకంటే ఎక్కువ తిప్పితే సమస్యలు ఏర్పడతాయి. ఒక్కో బస్సు ధర రూ.1.3 కోట్ల వరకు ఉండటంతో వెంటవెంటనే కొత్తవి సమకూర్చటం కుదరదు. అంత ధర పెట్టి కొని తక్కువ కిలోమీటర్లు తిప్పి తుక్కు కింద మార్చటానికి ఆర్టీసీ అధికారులకు మనస్కరించటం లేదు. దీంతో ఏకంగా 14 లక్షల నుంచి 15 లక్షల కి.మీ. వరకు తిప్పుతున్నారు. దీంతో ఆ బస్సుల్లో తీవ్ర సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. సాధారణంగా ఆర్టీసీ బస్సుల మరమ్మతులను సొంత సిబ్బందే చేస్తుంటారు. కానీ వోల్వో కంపెనీలో ఆయిల్ మార్చటం లాంటి చిన్నచిన్న పనులు తప్ప మిగతా సాంకేతిక సమస్యలన్నీ ఆ కంపెనీ ఇంజనీర్లే సరిదిద్దాల్సి ఉంటుంది. సాంకేతిక సమస్య తలెత్తితే బస్సును నిలిపివేసి ఆ కంపెనీ నిపుణులకు కబురు పెట్టాల్సిందే. వారొచ్చి మరమ్మతు చేసి రూ.మూడు నాలుగు లక్షల బిల్లు వేసి వెళుతున్నారు. ఇది ఆర్టీసీ చేతి చమురు వదిలిస్తోంది. ఒక్కో బస్సుకు ప్రతినెలా రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో 14 లక్షల కి.మీ. దాటిన బస్సులను పక్కన పెట్టాలని తాజాగా నిర్ణయించి అమలు ప్రారంభించింది. ఆ కంపెనీ బస్సులు కొనటం ఆర్థికంగా ఇబ్బందిగా మారటంతో అశోక్ లేలాండ్ కంపెనీ నుంచి సమకూర్చుకుంటున్న లహరి స్లీపర్ కమ్ సీటర్ బస్సులను వాటి బదులు తిప్పుతోంది. ఇటీవలే 16 లహరి బస్సులను వాటికి చేర్చింది. త్వరలో 40 వోల్వో బస్సులను పక్కన పెట్టాలని నిర్ణయించింది. మిగతా వాటిని దశలవారీగా ఆపేయనుంది.

పోటీని తట్టుకోగలదా..?

ప్రస్తుతానికి బహుళజాతి కంపెనీ బస్సులు కొనొద్దని ఆర్టీసీ నిర్ణయించింది. కానీ ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు బెంగళూరు, షిర్డీ, చెన్నై లాంటి దూర ప్రాంతాలకు బహుళజాతి కంపెనీలకు చెందిన ఆధునిక బస్సులు సమకూర్చుకుంటున్నాయి. ఆ కేటగిరీ బస్సులు ఆర్టీసీలో లేకపోవటం వెలితిగానే మారనుంది. ఇది ప్రయాణికుల ఆదరణపై ప్రభావం చూపే అవకాశముంది. అప్పటి పరిస్థితిని పరిశీలించి వాటిని కొనాలని ప్రభుత్వం నిర్ణయిస్తే తప్ప ఇప్పట్లో వాటిని కొనొద్దని ఆర్టీసీ నిర్ణయించటం గమనార్హం.



తెప్పపై మలయప్ప స్వామి అభయం

వైభవంగా శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. నాలుగో రోజు శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారు తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై రాత్రి ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు ఆశీనులై పుష్కరిణిలో ఐదు చుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల వేదపారాయణం, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంకీర్తనల నడుమ తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఎస్ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

25న పౌర్ణమి గరుడ సేవ

తిరుమల: పౌర్ణమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 25న గరుడసేవ జరుగనుంది. ఇందులో భాగంగా రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి వారు గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరించనున్నారు.

యువకుడికి 60 ఏళ్ల జైలు శిక్ష

ముగ్గురు బాలికలను వంచించిన ఫలితం

ఒక్కో కేసులో 20 ఏళ్ల చొప్పున..

మూడు కేసుల్లో కోర్టు సంచలన తీర్పు



జగిత్యాలరూరల్: చిన్నారులకు మాయ మాటలు చెప్పి.. అశ్లీల చిత్రాలు చూపించి వంచించిన ఓ యువకుడికి మూడు కేసుల్లో ఒక్కో కేసుకు 20 ఏళ్ల చొప్పున 60 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా సెషన్స్ జడ్జి నీలిమ శనివారం సంచలన తీర్పునిచ్చారు. అలాగే బాధిత బాలికలకు రూ.3 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం దట్నూరు గ్రామానికి చెందిన కొడిమ్యాల హరికృష్ణ అలియాస్ హరీశ్ (27) గ్రామంలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఆయన షాపునకు వచ్చే ముగ్గురు బాలికలకు సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుకోమని ఇచ్చి వారి పక్కన కూర్చుని బూతు వీడియోలు, ఫొటోలు చూపిస్తూ వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న బాలికల తల్లిదండ్రులు హరీశ్‌పై గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మూడు పోక్సో కేసులు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ప్రకాశ్, సీఐ బిల్లా కోటేశ్వర్, ఎస్సై శ్రీధర్‌రెడ్డి ఆధారాలు సేకరించి.. కోర్టుకు సమర్పించారు. నేరం రుజువుకావడంతో నిందితుడికి ఒక్కో కేసులో 20 ఏళ్ల జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. అలాగే ఒక్కో బాలికకు రూ.3 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. మూడు కేసుల్లో శిక్షను ఏకకాలంలో అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు.

ఎలుగుబంటి దాడిలో ఇద్దరు జీడి రైతులు మృతి

మరో మహిళ పరిస్థితి విషమం



వజ్రపుకొత్తూరు రూరల్: పొట్టకూటి కోసం జీడిమామిడి తోటలో పనిచేస్తున్న ఇద్దరు రైతులపై ఓ ఎలుగుబంటి దాడి చేయడంతో ఘటనాస్థలంలోనే మృతిచెందిన ఘటన శ్రీకాకుళం జిల్లా ఉద్దాన ప్రాంతంలో శనివారం చోటుచేసుకుంది. గాయపడిన మరో మహిళ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల వివరాల ప్రకారం.. వజ్రపుకొత్తూరు మండలం చీపురపల్లి పంచాయతీ పరిధిలోని అనకాపల్లి గ్రామానికి చెందిన జీడి రైతులు శనివారం పనులకు వెళ్లారు. అకస్మాత్తుగా ఎలుగుబంటి వచ్చి దాడికి తెగబడటంతో చిడిపల్లి లోకనాథం (47), అప్పికొండ కూర్మారావు (49) అక్కడికక్కడే మృతి చెందగా లోకనాథం భార్య సావిత్రి తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల్లో ఒకడైన కూర్మారావు పంచాయతీ వార్డు మెంబర్ కూడా. దాడి చేసిన ఎలుగుబంటిని గ్రామస్తులు వెంటాడి హతమార్చారు. ఉద్దానం ప్రాంతంలో ఇప్పటికే అనేక సార్లు ఎలుగులు దాడులు చేయడంతో పలువురు రైతులు మృత్యువాత పడ్డారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ రూ.23 కోట్ల ఆస్తుల జప్తు


అల్ప్రాజోలం దందాలో కూడబెట్టిన వైనం

ఖలీల్‌వాడి: మత్తు పదార్థాలు అమ్మి ఎక్సైజ్ కానిస్టేబుల్ కూడబెట్టిన కోట్లాది రూపాయల ఆస్తులను బుధవారం అధికారులు జప్తు చేశారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం లింగంపల్లికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ రమేశ్, రంగారెడ్డి జిల్లా షాబాద్‌కు చెందిన గుండుమల్ల వెంకటయ్య కలిసి అల్ప్రాజోలం దందా చేసేవారు. డిసెంబర్ 25న వెంకటయ్య అల్ప్రాజోలం అమ్ముతుండగా రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీన్యాబ్) అధికారులు, స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎన్‌డీపీఎస్ కింద కేసు నమోదు చేశారు. నిందితులు అల్ప్రాజోలం అమ్మి కూడబెట్టుకున్న ఆస్తులను పోలీసులు గుర్తించారు. ఇద్దరి వద్ద కలిసి రూ.23 కోట్ల విలువ చేసే ఆస్తులను జప్తు చేశారు. ఇందులో వెంకటయ్య పేరు మీద షాద్‌నగర్ వద్ద ఉన్న నాలుగు ప్లాట్లు, 21.26 ఎకరాల భూమి, షాబాద్ మండలంలో 13.04 ఎకరాల భూమి, ఆయన భార్య పేరు మీద 2.22 ఎకరాల భూమి, బ్యాంకులోని రూ.4.29 లక్షల నగదు ఉన్నాయి. ఎక్సైజ్ కానిస్టేబుల్ రమేశ్‌కు చెందిన మారుతి షిఫ్ట్‌కారు, బ్యాంక్ ఖాతాల్లోని రూ.2.21 లక్షల నగదు సీజ్ చేశారు.



రాజ్‌భవన్, సచివాలయంలో ఎర్త్ అవర్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా శనివారం రాత్రి నిర్వహించిన ఎర్త్ అవర్‌లో భాగంగా రాజ్‌భవన్, సచివాలయాల్లో రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు గంట పాటు విద్యుద్దీపాలను ఆర్పివేశారు. రాజ్‌భవన్‌లో అక్కడి సిబ్బంది, సచివాలయంలో అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి సూర్య భాస్కర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ సంస్థ ప్రతినిధులు 60 నంబర్ ఆకృతిగా ఏర్పడి కొవ్వొత్తులు ప్రదర్శించారు. పలువురు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, పలు వ్యాపార సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టే ఇలాంటి కార్యక్రమాలు వాతావరణ కాలుష్యాన్ని కొంతవరకైనా తగ్గిస్తాయని అభిప్రాయపడ్డారు.



మూడురోజులు మరింత ఎండలు

సగటున 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. సగటున 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేర పెరుగుతాయని సూచించింది. శనివారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే గరిష్ట ఉష్ణోగ్రత భద్రాచలంలో 38.6 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 20.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గత నాలుగు రోజులుగా రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతల కంటే సగటున 3 డిగ్రీల మేర తక్కువగా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వివరించారు. రానున్న మూడు రోజులు మాత్రం సాధారణం కంటే 3 డిగ్రీల మేర అధికంగా నమోదవుతాయని, రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతుందని సూచిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి దక్షిణ దిశ నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నాయి.

ఆర్టీసీ ఉద్యోగుల వేతన సవరణ లెక్కలు తేలాయ్!

డీఎం, ఆపై స్థాయి అధికారులకు త్వరలో ఖరారు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగుల వేతన సవరణ లెక్కలు తేలాయి. 2017 వేతన సవరణను అమలు చేయాలని వారం క్రితం ప్రభుత్వం నిర్ణయించి 21 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించడం తెలిసిందే. 2018 నుంచి 16 శాతం ఇంటెరిమ్ రిలీఫ్ (ఐఆర్)ను కొనసాగిస్తున్నందున దాన్ని తొలగించి ఆ స్థానంలో కొత్త ఫిట్‌మెంట్‌ను చేర్చి ఏ ఉద్యోగికి ఎంత మేర వేతనాన్ని సవరించాలో తాజాగా అధికారులు లెక్కలు సిద్ధం చేశారు. డిపో మేనేజర్, ఆ పైస్థాయి అధికారులకు సంబంధించిన సవరణ లెక్కలను విడిగా ఖరారు చేయనున్నారు. డిపో మేనేజర్ స్థాయి కంటే తక్కువ హోదా ఉన్న ఉద్యోగుల లెక్కలను సిద్ధం చేసి శనివారం ఆయా డిపోలకు పంపారు.

కరువు భత్యంపై సందిగ్ధం..

ప్రస్తుతం ఆర్టీసీ ఉద్యోగులకు 82.6 శాతం కరువు భత్యం (డీఏ) అమలవుతోంది. ఇందులో 31.1 శాతం 2017 వేతన సవరణ గడువుకు పాతది. దీంతో తాజా వేతన సవరణలో ఈ 31.1 శాతాన్ని జోడించారు. 2017 వేతన సవరణ గడువు తర్వాత ఉద్యోగులకు వర్తింపజేసిన మిగతా 51.5 శాతం కరువు భత్యాన్ని మూల వేతనంలో కలిపే వీల్లేదు. దాన్ని ఎంత మేర వర్తింపజేయాలన్న విషయాన్ని ఇంకా ఖరారు చేయలేదు. ఆ వివరాలను తర్వాత వెల్లడించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

గ్రేడ్ పే కొనసాగింపు..

ప్రభుత్వ ఉద్యోగులకు లేని గ్రేడ్ పే వెసులుబాటు ఆర్టీసీలో అమలవుతోంది. ఆయా అధికారుల హోదాను బట్టి జీతం కాకుండా అదనంగా గ్రేడ్ పే పేరుతో కొంత మొత్తాన్ని ప్రతినెలా చెల్లిస్తారు. అది సూపర్‌వైజర్ స్థాయి అధికారుల నుంచి మొదలవుతుంది. ఆ దిగువ హోదాలో ఉండే కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర ఉద్యోగులకు ఉండదు. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి రీత్యా ఈ విధానాన్ని తొలగించాలని గతంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.



కానీ దాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. తాజా వేతన సవరణ తర్వాత కూడా దాన్ని కొనసాగించాలని నిర్ణయించారు.

హెచ్‌ఆర్‌ఏ తగ్గింపుపై ఆందోళన..

వేతన సవరణతో జీతాలు పెరుగుతాయన్న ఆనందం ఉద్యోగుల్లో ఓవైపు ఉన్నప్పటికీ మరోవైపు ఇంటి అద్దె భత్యం తగ్గిపోనుండటంతో అంతృప్తి వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వం పలు రకాల సూచీల ఆధారంగా ఇంటి అద్దె భత్యంలో మార్పులు చేసింది. దాన్ని అమలు చేయాల్సి రావడంతో మూడేళ్ల క్రితమే ప్రభుత్వ ఉద్యోగుల పే స్కేల్ సమయంలో అమలులోకి తెచ్చింది. ఆర్టీసీలో వేతన సవరణ జరగకపోవటంతో అప్పటి నుంచి పాత హెచ్‌ఆర్‌ఏలే కొనసాగుతున్నాయి. తాజా వేతన సవరణ నేపథ్యంలో 2020 నుంచి హెచ్‌ఆర్‌ఏ తగ్గింపును అమలు చేయబోతున్నారు. దీంతో హైదరాబాద్‌లో ఉంటున్న ఉద్యోగులకు ఇక నుంచి 30 శాతం బదులు 24 శాతమే హెచ్‌ఆర్‌ఏ అందుతుంది. దీనిప్రభావంతో చిరుద్యోగుల జీతాల్లో దాదాపు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు కోత పడబోతోంది. హెచ్‌ఆర్‌ఏ సీలింగ్ పరిమితిని రూ. 43 వేలకు పెంచారు. ఇది ఉన్నతాధికారులకు మేలు చేయనుండగా ఉద్యోగులకు పెద్దగా ఉపయోగపడదు.

2017 వేతన సవరణ తర్వాత ఆర్టీసీలోని ప్రధాన ఉద్యోగులు, కార్మికుల మూల వేతనం ఇలా.. (రూ.లలో)

ఉద్యోగి హోదా	ప్రస్తుతం కనిష్ట-గరిష్ట వేతనం	2017 నాటి ఫిట్‌మెంట్ తర్వాత కనిష్ట-గరిష్ట వేతనం
అసిస్టెంట్ మేనేజర్	22,290 - 70,650	33,010-1,14,710
సూపరింటెండెంట్	19,110 - 55,470	29,070-96,350
డిప్యూటీ సూపరింటెండెంట్	17,800 - 51,400	27,080-81,400
డ్రైవర్ గ్రేడ్-1	16,400 - 43,360	24,950-70,310
డ్రైవర్ గ్రేడ్-2	13,780 - 35,680	20,960-60,080
కండక్టర్ గ్రేడ్-1	13,780 - 35,680	20,960-60,080
కండక్టర్ గ్రేడ్-2	12,610 - 33,550	19,180-54,380
మెకానిక్ గ్రేడ్-1	13,780 - 35,680	20,960-60,080
మెకానిక్ గ్రేడ్-2	13,070 - 34,490	19,880-57,000
శ్రామిక్/కళాసి	10,880 - 28,760	16,550-45,030

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.